# తిరుమలప్పపై ఇప్పటి కవులు

రచన
ఆచార్య గల్లా చలపతి
తిరుపతి

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2015

**TIRUMALAPPAPAI IPPATI KAVULU**

By

**Prof. Galla Chalapathy**

T.T.D. Religious Publications Series No.1177
© All Rights Reserved
First Edition : 2015

Copies: 2000

Price :

*Published by :*

**Dr. D. Sambasiva Rao**, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

*D.T.P.*

Office of the Editor-in-Chief
T.T.D., Tirupati

*Printed at*

Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

# ముందుమాట

కలియుగదైవమైన శ్రీవేంకటేశ్వరుని దర్శించిన వారికి ఎన్నో ఆధ్యాత్మిక మైన అనుభవాలు, అనుభూతులు ఏర్పడతాయి. ఆ స్వామికి, తిరుమలకొండకు సంబంధించిన అనేకాంశాలు మనస్సులో ముద్రపడతాయి. ముఖ్యంగా కవితాహృదయులైన భక్తుల, సామాజికవాదుల అభిప్రాయాలు వేరువేరుగా ఉంటాయి. తాత్త్వికుల ఆలోచనలు మరొకరకంగా ఉంటాయి. వీళ్లందరిలో సమానంగా కనిపించే అంశం భక్తి . తమ అనుభవాలను, అనుభూతులను ఇతరులకు తెలియజేయడానికి కవులు పద్యగేయ వచనాత్మకమైన రచనలు చేస్తారు. ఈ రచనలలో భక్తితోపాటు ధార్మిక, నైతిక, సాంస్కృతిక విశేషాలెన్నో చోటుచేసుకొంటాయి. భగవంతుని దర్శించినపుడు కవికి భక్తిపరమైన స్పందన కలుగుతుంది. కవికి సామాజిక నిబద్ధత ఉండడంవల్ల అది సమాజంలోకి విస్తరించి సామాజిక భక్తిగా పరిణమిస్తుంది. అపుడు కవి ఒక వ్యక్తిగా తన విషయాలను దేవునికి నివేదించడంతోపాటు సమాజంలో వ్యక్తులందరి ఆర్తిని స్వామికి నివేదిస్తాడు.

భక్తి ఒక వ్యక్తిగతమైన అనుభవం. సమాజంలోని వ్యక్తులందరిలో భక్త్యనుభవం ఒక రకంగా ఉండదు కాబట్టి వాళ్ల వాళ్ల భక్తిననుసరించి ఆ యా వ్యక్తుల ఆలోచనా విధానాలుంటాయి.

శ్రీనివాసుని దర్శించుకొన్న ఇప్పటి కవులు తమ మనస్సులలో పొందిన భావాలను అనేకవిధాలుగా వ్యక్తపరుస్తూ, సమాజంలో కనిపిస్తున్న విపరీతాలను, పర్యవసానంగా కనిపిస్తున్న అనారోగ్యకర లక్షణాలను స్వామికి నివేదించి, ప్రజలందరినీ చల్లని చూపులతో చూస్తూ వారిని మంచి మార్గానికి మరల్చమని కోరుతున్నారు. **‘తిరుమలప్పపై ఇప్పటికవులు’**అనే ఈ గ్రంథంలో ప్రతిపాదింపబడిన ప్రధానాంశమిది. దీనితోపాటు తిరుమల ఆలయంలో, ఆలయ పరిసరాలలో, తిరుమల గిరులలో కవులు దర్శించిన ప్రత్యేకాంశాలను

కూడా ఆ యా కవులు వాళ్లవాళ్ల తీరులలో ప్రదర్శించారు. ప్రతి అంశంలోను శ్రీనివాసుడే ఉన్నాడని, నిశ్చలమైన భక్తితోనే స్వామిని దర్శించవచ్చునని కవులు తమ అనుభవాలననుసరించి ప్రకటించారు.

ఈ గ్రంథ రచనకు ఆధారాలు 1950 నుండి వేంకటేశ్వరునికి సంబంధించి వెలువడిన గేయాలు, గేయకావ్యాలు, శతకాలు, జానపద గీతాలు మొదలైనవి. ఆ యా కవుల ఇలాంటి రచనలన్నింటిని సంపాదించి వాటిలోని విషయాలను సేకరించి **ఆచార్య గల్లాచలపతిగారు** ఈ గ్రంథాన్ని రచించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పక్షాన వారిని అభినందిస్తున్నాను. ఈ గ్రంథం ద్వారా భక్తులు స్వామివారిని గురించి అనేక విషయాలు తెలుసుకొనే అవకాశముంది. ఆలయ సంస్కృతికి సమాజంలో ఎలాంటి స్థానమున్నదో అర్థమవుతుంది. నిష్కల్మషమైన భక్తివల్లనే భగవత్కృపను పొందగలమన్న విశ్వాసం దృఢపడుతుందని నమ్ముతున్నాను.

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

# రచయిత మాట

శ్రీ ఎల్.వి సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.గారు తిరుమల తిరుపతి దేవస్థానాల శ్రీకార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తూ ఉండిన కాలంలో తి.తి.దే. ఎడిటర్–ఇన్–చీఫ్ వారి కార్యాలయంలో కన్సల్టెంటుగా పనిచేయడానికి నాకు అవకాశం కల్పించారు. ప్రచురణలకు సంబంధించిన పనులు చేయడం నా ఉద్యోగ బాధ్యత. తిరుమల క్షేత్రాన్ని దర్శించిన కవుల భావాలను, అనుభూతులను సేకరించి ఒక గ్రంథంగా రచించమని కూడా ఆదేశించడం వల్ల నేను ఈ పనిని కూడా పూర్తి చేయాలని సంకల్పించాను.

తిరుమలను, తిరుమలేశుని ప్రాచీన కవులు కొందరు దర్శించినట్లు సాహిత్యాధారాలున్నాయి. ఆ యా ప్రాచీన తెలుగు కవుల రచనలను పరిశీలించి తిరుమల క్షేత్రానికి సంబంధించిన విశేషాలను కొందరు పరిశోధకులు ఇప్పటికే సేకరించారు. అందువల్ల నేను ఆధునిక కవుల రచనలలోని విషయాలను మాత్రమే సమీక్షించడానికి ప్రయత్నించాను. 1950 నుండి నేటి వరకు వెలువడిన గేయకావ్యాలు, విడిగేయాలు, శతకాలు, జాన పదాంశాలు, సినీగీతాలు ఇత్యాది ఆధారాలను సేకరించి ఆ ఆధారాల నుండి గ్రహించిన విషయసామగ్రితో **'తిరుమలప్పపై ఇప్పటి కవులు'** అనే ఈ గ్రంథాన్ని రచించడం జరిగింది. తిరుమలనుగురించి, తిరుమలవిభుని గురించి ఆ యా కవుల అనుభూతులు, అభిప్రాయాలు ఈ గ్రంథంలో సమీక్షింపబడినాయి.

ఈ గ్రంథం రచించడానికి అవకాశం కల్పించిన తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారి డా।। డి.సాంబశివరావుగారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పోల భాస్కర్ గారికి కృతజ్ఞతాపూర్వకవందనాలు. గ్రంథరచనకు తగిన సమయం కేటాయించిన అప్పటి ఎడిటర్–ఇన్–చీఫ్ ఆచార్య రవ్వా శ్రీహరిగారికి, ఇప్పటి ఎడిటర్–ఇన్–చీఫ్ డా।।సముద్రాల లక్ష్మణయ్యగారికి కృతజ్ఞతలు.

తిరుపతి

18-01-2015

**గల్లా చలపతి**

# విషయక్రమం


| | | పుట |
|---|---|---|
| 1. | శ్రీకృష్ణుడే శ్రీనివాసుడు | 3 |
| 2. | తిరుమలకొండ | 9 |
| 3. | శ్రీవేంకటేశ్వరుడు | 15 |
| 4. | వేంకటేశ్వరుని రూపం | 22 |
| 5. | బీబీనాంచారు వృత్తాంతం | 33 |
| 6. | భక్తుల ఆస్తిక నాస్తికత్వాలు | 37 |
| 7. | వడ్డికాసులవాడు | 44 |
| 8. | సుప్రభాతం | 51 |
| 9. | స్వామిదర్శనం | 55 |
| 10. | ముక్తినొసగే దేవుడు | 65 |
| 11. | తలనీలాలు | 73 |
| 12. | హుండి | 78 |
| 13. | తిరుమలలో శంకరాచార్యులవారు | 82 |
| 14. | స్వామి ఉన్నాడు | 85 |
| 15. | భక్తుల నిందాస్తుతులు | 91 |
| 16. | వేంకటేశ్వరుని గుడులు | 96 |
| 17. | సామాజికాంశాలు | 99 |
| 18. | కవుల భావనలు | 105 |
| 19. | మరికొన్ని విశేషాలు | 110 |
| 20. | కానుకలిచ్చిన దాతలు | 114 |


# ప్రవేశిక

తిరుమల అతిప్రాచీనమైన క్షేత్రం. ఋగ్వేదంలోనే తిరుమల ప్రాశస్త్యం ఉండినట్లు ఆర్షవిజ్ఞానవేత్తలు పేర్కొంటున్నారు. వరాహ, భవిష్యోత్తర, పద్మ పురాణాదులలో తిరుమల కొండను గురించి, తిరుమలవాసుని గురించి అనేక అంశాలున్నాయి. అనేక పురాణాలలోని అంశాల సంకలన గ్రంథమైన శ్రీవేంకటాచలమాహాత్మ్యం తిరుమల ప్రాచీనతను, పద్మావతీ శ్రీనివాసుల వివాహ వృత్తాంతాన్ని వివరంగా వర్ణించింది. పౌరాణికాంశాలు, వైష్ణవాచార్యులుగ్రంథస్థం చేసిన విషయాలు ఆలయచరిత్రకు సంబంధించిన ఎన్నో విశేషాలను తెలుపుతున్నాయి. క్రీ.శ.ఏడెనిమిది శతాబ్దాలనుండి ఆలయ కుడ్యతలాలపై చెక్కించబడి కనిపిస్తున్న ఆంధ్ర తమిళ కన్నడ భాషలలో గల శాసనాలు తిరుమల ఆలయ నిర్మాణాన్ని, చారిత్రకంగా చోటుచేసుకొన్న నిర్మాణ దశలను, వివిధ ఉత్సవాలను వివరాణత్మకంగా చెపుతున్నాయి. దేవాలయ చరిత్రను నిరూపిస్తున్నవి ఈ శాసనాలే. శాసనాలు ఆధారంగా ఎందరో చారిత్రక విమర్శకులు ఆలయచరిత్రను అనేక కోణాలలో పరిశీలించి వివరించారు. మరికొందరు పరంపరగా వినవస్తున్న అంశాలను, జానపదుల ఆలోచనలను క్రోడీకరించి ఆలయాన్ని గురించి అనేక విషయాలను చిలవలు పలవలుగా చెపుతారు. ఈ విషయాలను కథనాత్మక వ్యాసాలుగా కూడా రాశారు. ఇలాంటివారి రాతల్లో వాస్తవాంశాలను ఇతర ఆధారాల ననుసరించి గ్రహించవలసి ఉంటుంది. అన్నిటికన్న ఆలయ శాసనాలు, వాస్తుశిల్పాలు కచ్చితమైన చరిత్రనిస్తాయి.

ఏ ప్రాచీన విషయాన్ని గురించి అయినా చరిత్ర ఒక రకంగా ఆధారాలను చూపుతుంటే, దానికి సమాంతరంగా తరతరాలకు సంక్రమిస్తున్న మౌఖికాంశాలు కూడా ప్రాధాన్యత వహిస్తూ వస్తాయి. నిజమైన చరిత్రను

నిర్మించాలనుకొనే చరిత్రకారుడు ఈ రెండు విషయాల తారతమ్యాలను గమనించాలి. తిరుమలచరిత్రకు సంబంధించికూడా ఈ రెండంశాలు ప్రాధాన్యతను పొంది కనిపిస్తున్నాయి. ఆలయ చరిత్రకు, ఆలయంలో జరిగే అనేక ఉత్సవాల వివరాలకు సంబంధించిన అనేక గ్రంథాలు ప్రచురింపబడి ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ ఆలయచరిత్రను పరిశీలించి చెప్పడం ఈ గ్రంథం పరిధిలోని విషయం కాదు. చరిత్రను అతిజాగరూకతతో పరిశీలించ వలసిన అవసరముందని చెప్పడం వరకే పరిమితం.

తిరుమల ఆలయానికి ప్రతిరోజూ వేలమంది భక్తులు వస్తున్నారు. తిరుమలేశుని వైభవాన్ని దర్శిస్తున్నారు. వీళ్లలో సామాన్యభక్తులతోపాటు కవులు, కళాకారులు ఉన్నారు. స్వామి దర్శనంతో సామాన్యులలో భక్తిప్రపత్తులు ఏర్పడుతున్నాయి. కవులలో, కళాకారులలో గల కవితాశక్తి, సృజనశక్తులు ప్రేరణ పొందుతున్నాయి. భక్తితో కూడిన ఆ ప్రేరణతో కవులు స్వామిని కవితాత్మకమైన రచనలతో స్తుతిస్తున్నారు. ఆ స్తుతులలో తిరుమలను గురించి, తిరుమలవాసుని గురించి మాత్రమేగాక సమకాలీన సామాజిక స్థితిగతుల విశేషాలు కూడా చోటుచేసుకొని కనిపిస్తున్నాయి. లోకంలో తిరుమలేశుని వైభవం ఎలా ప్రసరిస్తున్నదో, దానికి గల నేపథ్యమేమిటో, భక్తులైన ప్రజలలో ఎలాంటి విశ్వాసాలు ప్రచారంలో ఉన్నాయో తెలుసుకోవలసి ఉంది. ద్వాపరయుగంనాటి శ్రీకృష్ణుడే కలియుగ నాయకుడైన శ్రీవేంకటేశ్వరుడని చెపుతూ ఉండడంవల్ల ఆ విషయంతోనే ఈ గ్రంథం ప్రారంభమవుతున్నది.

# శ్రీకృష్ణుడే శ్రీనివాసుడు

దశావతారాలలో శ్రీకృష్ణావతారం తరువాత అవతారం కల్కి. కల్కి ఖడ్గం చేతబట్టి గుర్రంమీద తిరుగుతూ దుష్టసంహారం చేస్తాడని వర్ణన లున్నాయి. కృష్ణావతార పరిసమాప్తి జరిగిననాటినుండి కలియుగం ప్రారంభ మైనట్లు చెపుతారు. 'కలౌవేంకటనాయకః' అనడాన్ని బట్టి కలియుగావతారం వేంకటనాయకుడని తెలుస్తున్నది. మహాభారతం మౌసల పర్వంలోను, భాగవతం పదకొండవ స్కంధంలోను ఈ విషయాన్ని సూచన ప్రాయంగా గమనించవచ్చు. శ్రీకృష్ణుడు అవతారం చాలించి నిజధామానికి వెళ్ళినపుడు ఇంద్రుడు స్వామిని 'ప్రపన్నుల యార్తిఁబాపుటకై యజ్ఞపురుష! కృపతో యుగయుగమున ఇలాగే అవతరిస్తూ ఉండు' అని కోరతాడు (మౌసల-89). ద్వాపరయుగం తరువాత వచ్చేది కలియుగం కాబట్టి, కలియుగంలో కూడా స్వామిని అవతరించమని ఇంద్రుడు కోరినట్లు అర్థమవుతుంది. కలియుగంలో జనం ధర్మదూరులుగా, దుర్గుణాలతో కూడినవాళ్ళుగా, పరస్పరవైరం కలవాళ్లుగా, పాపశీలం కలిగినవాళ్లుగా ఉంటారు కాబట్టి, ఆ లక్షణాలు ఆ యుగధర్మాలు కాబట్టి, అలాంటి వాళ్లను కూడా ఉద్ధరించడానికి భగవంతుని మళ్లీ అవతరించమన్నాడు ఇంద్రుడు. అలా అవతరించిన భగవద్రూపమే కలియుగ వేంకటనాయకుడని ఆస్తికుల విశ్వాసం. శ్రీకృష్ణుడు అవతారం చాలించి నిజధామానికి వెళ్లిన తరువాత 'అన్నారాయణ విగ్రహంబు జలధి ప్రాంతంబున జగన్నాథ స్వరూపంబై యుండె' అని శుకుడు పరీక్షిత్తుకు చెప్పినట్లు భాగవతం (ఏకాదశ-122)లో ఉంది. ఇది కూడా పైన చెప్పిన విషయానికి పోషకంగా కనిపిస్తున్న అంశమే.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆవిర్భావానికి, ఆలయ నిర్మాణానికి సంబంధించిన విషయాలను ఎందరు ఎన్ని ఆధారాలు చూపుతూ చెపుతున్నా తెలియవలసిన విషయాలు ఇంకా మిగిలే ఉంటాయి. అంతప్రాచీన దశకు చెందిన అంశాలను వివరించగల చరిత్ర లేకపోవడం దానికి కారణం. భారతదేశం

లోని ప్రజలు ఎంత లౌకిక ప్రవర్తనులైనా వాళ్లలో కొంతవరకైనా ఆధ్యాత్మిక భావాలు ఉంటాయి. ఎక్కువ మంది మనసులలో దేవాలయం, దేవుడు, భక్తి ఇత్యాది విషయాలకు అస్తిత్వం ఉంటుంది. ఈ అస్తిత్వం వల్లనే భారత రామాయణాది గ్రంథాలలోని, పురాణాలలోని దివ్యత్వాన్ని వెదజల్లిన శ్రీరామ, శ్రీకృష్ణాది పాత్రలు ప్రజలకు సన్నిహితమవుతున్నాయి. ఆయా దివ్యపాత్రల స్వభావాలను సమాజంలోని లౌకికాంశాలతో సమన్వయించి చూడడం కూడా ఆధ్మాత్మికాంశమే. మానవ సంస్కృతిలో దేవాలయ సంస్కృతి ఒక అంతర్భాగం అయిపోయింది. అందువల్లనే ముఖ్యంగా తెలుగుదేశంలో సీతారాములు, రుక్మిణీ కృష్ణులు మొదలైన దివ్యులందరూ తెలుగువాళ్లయి పోయారు. అలాగే ఎందరో ఇలువేల్పుగా పూజిస్తున్న తిరుమలవాసుడు తమఇంటివాడుగా, తమ కష్టసుఖాలను ముచ్చటించుకోవడానికి ఒక మిత్రుడుగా, సలహాలందించే ఒక పెద్ద దిక్కుగా, తమ ఆపదలను బాపేవాడుగా భావించి భక్తులు తమతో సాన్నిధ్యాన్ని కల్పించుకొని తన్మయులవుతూ ఉంటారు. కొందరు తమచుట్టూ ఉన్న సామాజికాంశాలను శ్రీనివాసుడికి నివేదించి అవాంఛనీయ ఘటనలనుండి సమాజాన్ని ఉద్ధరించమని కోరుతూ ఉంటారు. ఇలాంటివాళ్లు సాధారణంగా విమర్శ దృష్టి కలిగి కవితాహృదయం కలవారుగా కనిపిస్తారు.

కలియుగంలో దేవుని గుణగణాలను కీర్తించడం ద్వారా ముక్తి కలుగుతుందని నమ్మకం ఉండడంవల్ల ఆస్తికులందరూ శ్రీవేంకటేశ్వరుని విశేషంగా కీర్తిస్తున్నారు. భక్తులైనవారికిది దైనందిన కార్యక్రమం. కవితా హృదయం కలవారు తమ కవిత్వం ద్వారా స్వామిని ఆరాధిస్తున్నారు. గేయాలలో, శతకాలలో తమను పరిచయం చేసుకొని తమ ఆంతర్యాలను, ఆవేదనలను విన్నవించుకొంటున్నారు. కొందరు తాము రోజూ స్వామిని గుర్తు చేసుకోవడానికి వ్యక్తం చేస్తున్న మాటలు ఛందోరహితమైన గేయరూపాన్ని పొంది కనిపిస్తున్నాయి. ఇలాంటి గేయాలెన్నో సప్తగిరి వంటి పత్రికలలో ప్రచురింపబడుతున్నాయి. గేయపరంగా ఇవి విలువైనవి కాకపోయినా వీటిలో వ్యక్తమయ్యే భక్తిభావాలు గొప్పగా ఉంటాయి. ఆ గేయకర్తల ఆర్తిని స్వామికి నివేదిస్తూ ఉంటాయి. శతకాల మాటకొస్తే అన్నీ 'వేంకటేశ్వరశతకం' పేరుతోనే కనిపిస్తాయి. ఇలాంటి శతకాలలో అన్నమయ్య రచించిన వేంకటేశ్వరశతకమే మొదటిది. అయితే ఇప్పుడొస్తున్న వేంకటేశ్వర శతకాలలో మొదటిశతకంలోని బిగువుగాని, కవితా సౌందర్యం కాని కనిపించవు. అందులోని వస్తువు అలమేలుమంగా శ్రీనివాసులదైతే ఇప్పటి శతకాలలో అనేక లౌకిక విషయాలు చోటుచేసుకొని కనిపిస్తున్నాయి. సమాజంలో పెచ్చుపెరుగుతున్న అవినీతిని, మనుష్యులలో ఏర్పడుతున్న తారతమ్యాలను రూపుమాపి సమసమాజం ఏర్పడేటట్లు చేయుమని స్వామిని ప్రార్థించడానికే కొందరు కవులు శతకాలు రచిస్తున్నారు. ఇలాంటి శతకాలలో భక్తి గౌణంగా, సామాజిక వ్యవస్థ ప్రధానంగా కనిపిస్తాయి.

ఇప్పుడొస్తున్న గేయాలకు, శతకాలకు అవి స్వామిని కీర్తించడానికి ఉద్దేశింపబడినా కొన్ని ప్రధానమైన భేదాలున్నాయి. గేయాలు చాలవరకు భక్తిప్రధానంగా కనిపిస్తాయి. గేయకర్తలు వాళ్ల మనసుకు తోచినంతగా భక్తిభావాలను ప్రదర్శిస్తారు. స్వామి రూపవర్ణనను, గుణకీర్తనను ఎవరికి తోచిన పద్ధతిలో వాళ్లు వ్యక్తపరుస్తారు. తిరుమల కొండను, నైసర్గిక స్థితిని, దివ్యత్వాన్ని ఆళ్వారులు మొదలుకొని ఎందరో వర్ణించారు. ఇప్పటి గేయకర్తలూ వర్ణిస్తూనే ఉన్నారు. అందరినీ కాపాడమనడం కంటే గేయకర్త తన ఆశ్రితపరాయణత్వాన్ని, స్వామి రక్షణపరత్వాన్ని ఎక్కువగా భావిస్తాడు. ఇది ప్రాధాన్యతా దృష్టితో చెపుతున్నమాటే. అందువల్ల గేయాలు ప్రధానంగా ఆత్మాశ్రయంగా కనిపిస్తాయి. ఇక శతకాల విషయానికొస్తే – ఆధునిక లేదా సమకాలీన శతకకర్తల వేంకటేశ్వరశతకాలలోని పద్యాలు ఒక్కొక్క శతకంలో 108 నుండి 300 లకు పైగానే కనిపిస్తున్నాయి. ఈ శతకాలు కేవలం స్వామిని నుతించడానికే పరిమితం కాకపోవడం దీనికి కారణం. అష్టోత్తరశత సంఖ్య ప్రధానమైంది కాబట్టి శతక కర్త ఆ సంఖ్యకే పరిమితంగా పద్యాలు రాయాలనుకొన్నా, భక్తితో పాటు సామాజికాంశాలను పట్టించు

కోవడం వల్ల పద్యాల సంఖ్య పెరిగిపోవడం కనిపిస్తుంది. ఇప్పుడు ప్రచురితాలై కనిపిస్తున్న వేంటేశ్వరశతకాలు ఈ అధ్యయనం కోసం సేకరించినవే వందకుపైగా ఉన్నాయి. ఈ శతకాలలో భక్తితోపాటు ఆధ్యాత్మిక, ధార్మిక, నైతిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలు నిండుగా ప్రస్తావింపబడినాయి.

ఇప్పటి శతకకవులు నివసిస్తున్న సమాజం అనేక రుగ్మతలతో కూడి ఉండడం వల్ల వాళ్ల శతకాలలో భక్తితోపాటు అలాంటి రుగ్మతలను బహిర్గతం చేయాలనే తపన తీవ్రంగా కనిపిస్తుంది. ముఖ్యంగా రాజకీయ వ్యవస్థను పట్టించుకొన్న శతకాలు రాజకీయ అవినీతిని, రాజకీయ నాయకుల కుహనా సంస్కారాన్ని, స్వార్థపరత్వాన్ని విపులంగా చూపాయి. ప్రజలను మోసగించే నాయకులు దైవాన్ని కూడా వంచన చేస్తున్న వైనం, పదవులకోసం ముడుపులు సమర్పించి ఆ పదవులను దక్కించుకొన్న తరువాత కోట్లు వెనకేసుకోవడం కోసం చేసే మోసాలు శతకాలలో వివరంగా దర్శనమిస్తాయి. వీటితోపాటు తిరుమలవాసుని వైభవం, వివిధ ఉత్సవాల సంబరం, ప్రసాదాల పంపకం, వివిధ రకాల యాత్రికుల హుండీ సమర్పణం ఇత్యాది విషయాలు కూడా ఉంటాయి. కొన్ని శతకాలు స్వామి ఆదాయ వ్యయాలను కూడా నిశితంగా పరిశీలించాయి. ప్రస్తుతం తిరుమలస్వామి దర్శనానికి తిరుమలకు వెళ్లే వాళ్లందరూ నిజంగా భక్తిప్రపత్తులతో కూడిన వారేనా? అనే సందేహం చాలమందిలో ఉంది. దీనికి సంతృప్తికరమైన సమాధానం లభించదు. తిరుమలకొండ నిసర్గ సౌందర్యం చూడటానికి వచ్చే వాళ్ల సంఖ్య తక్కువేమీ కాదు. ఎవరు ఎలాంటి ఉద్దేశాలతోవస్తున్నా, వాళ్ల అంతరంగాలు ఎలా ఉన్నా గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి స్వామిని దర్శించుకొనే వెళుతున్నారు.అనేక బాహ్యవిషయాల మీద ప్రసరించే మనస్సును భగవంతుణ్ణి దర్శిస్తున్న ఆ ఒక్క నిమిషమైనా తమ అదుపులో ఉంచుకొంటున్నారు. పైకి బిగ్గరగా అనకున్నా గొణుక్కుంటూనైనా గోవిందా! గోవిందా!! అని అప్రయత్నంగానైనా అనుకొంటున్నారు. ఇదంతా తిరుమలేశుని లీల. ఆలయం లోనికి ప్రవేశించగానే ఎలాంటి వారినైనా స్వామికి ఉన్ముఖం చేసి





**ముక్తిని కలిగించే దివ్యతీర్థం ఆదివరాహక్షేత్రం.**
**తిరుమలలో మొదట దర్శించవలసిన మూర్తి శ్రీభూవరాహస్వామి**

వాళ్ల అంతరంగాలలో భక్తిభావాన్ని ఉద్దీపితం చేస్తుంది ఆలయ పవిత్రత. నిజంగా వైకుంఠంలోనే తిరుగాడుతున్నట్లు అనుభూతి పొందిన వారెందరో ఉన్నారు.

ఇప్పటి సమాజం పూర్తిగా ఆధునికం. కంప్యూటర్లతో జాతకాలు చెపుతున్న కాలమిది. మానవుని ప్రతిభ సాంకేతికతకు దాసోహమంటున్న రోజులివి. అన్నం తినడం ఆలస్యమైనా పరవాలేదు కాని సెల్‌ఫోను లేకుంటే జరగదిప్పుడు. ఈ యంత్రయుగంలో మానవమేధను యంత్ర పరికరాలు నియంత్రిస్తున్నాయి. ఈ మార్పులవల్ల మన సంస్కృతిలో పెద్దమార్పు కనిపిస్తున్నది. సంప్రదాయాల్లో, ఆచారవ్యవహారాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకొని సామాన్య ప్రజలలో సైతం ఆధునిక పద్ధతులు అలవాటవుతున్నాయి. దేశీయులపై పశ్చిమ దేశాల సాంస్కృతిక ప్రభావం పడడం దీనికి కారణమని మొన్నమొన్నటివరకు కొందరు చెప్పేవారు. ప్రస్తుతం ప్రపంచీకరణ కారణంగా ప్రపంచమంతటా ఒకే రకమైన సంస్కృతి వ్యాపిస్తున్నదని, మనదేశం అందుకు అతీతం కాదని మరికొందరు అత్యాధునికులు చెపుతున్నారు. ఇప్పటి మానవ జీవనవిధానం చూస్తే అది నిజమేననిపిస్తున్నది. అయినా దేశీయులలో దేశీయ సంస్కృతి బలంగానే ఉన్నది. భక్తి సంస్కృతిలో ఒక భాగం. మానవ జీవితంలో దేవాలయ సంస్కృతికి ఎంతో విలువ ఉంది. దేవాలయ సంస్కృతిని జీవితం నుండి విడదీయడం అంత సులభం కాదు. ఎందుకంటే సంస్కృతి రక్తగత లక్షణం కాబట్టి. అందువల్లనే సమాజంలో దేవాలయాలకు, ఆ దేవాలయాల లోని దేవతలకు ప్రాధాన్యం ఏర్పడుతూ ఉంది. భక్తులున్నారు. భక్తి రచనలు వెలువడుతున్నాయి. భక్తిలేనివారమని చెప్పుకొనే వాళ్లలో కూడా దేవాలయాలంటే గౌరవముంది. దేవాలయాలకు భక్తులతో పాటు మిగిలిన వాళ్లు కూడా వెళుతున్నారు. పెద్ద పెద్ద దేవాలయాలన్నీ సందర్శకులతో క్రిక్కిరిసి పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆధునిక, అత్యాధునిక కవులు తిరుమలను గురించి, తిరుమల విభుని గురించి ఎలాంటి అభిప్రాయాలు కలిగి ఉన్నారో ఆయా కవుల రచనలు ఆధారంగా ఈ గ్రంథం రూపొందింది.

# తిరుమలకొండ

తిరుమల అంటేనే పవిత్రమైన కొండ అని అర్థం. తిరుమలకు ఆదివరాహక్షేత్రమని పేరు. ఈ కొండపై మొదట వెలసిన దేవుడు శ్రీభూవరాహస్వామి. తిరుమలలో మొదట దర్శించవలసిన దేవుడు వరాహస్వామే. ఇప్పుడు తిరుమల కొండ అంటే పురాణాలు పేర్కొన్న శేషాద్రి, నారాయణాద్రి ఇత్యాది సప్తగిరులన్నీ కలసిన కొండల ప్రాంతం. ఈ కొండలన్నీ దట్టమైన అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. ప్రాచీన కాలంలో తిరుమల అంటే స్వామి కొలువై ఉన్న ప్రాంతంతోపాటు దానికి చుట్టూ ఉన్న కొన్ని పరిసర ప్రాంతాలు మాత్రమే. ఈ పర్వత ప్రాచీనతను గురించి వినవస్తున్న పౌరాణికాంశాలను పక్కనపెట్టి సాహిత్యాధారాలను అనుశీలిస్తే క్రీ.శ. రెండవ శతాబ్దం నుండి తిరుమలకు అడపా దడపా భక్తులు వెళ్లేవాళ్లని తెలుస్తుంది (శిలప్పదిగారం ఆధారంగా). అప్పటినుండి తిరుమలకొండకు ప్రఖ్యాతి ఉంది. భక్తులు కొండ ఎక్కితే చాలు ఆ కొండే తమ ఆపదలను బాపుతుందని విశ్వసి స్తున్నారు. అది పవిత్రమైన కొండ అని, అక్కడ కొలువైన కొండలరాయడు మహిమాన్వితుడైన దేవుడని భావిస్తున్నారు. మధురమైన చెరుకురసం మహానదిగా ప్రవహించి, ఘనీభవించి శర్కర (చక్కెర) గా రూపొందినట్లు శ్రీనివాసుని కరుణరసప్రభావం గడ్డకట్టి వేంకటాద్రిగా రూపొందిందని వేదాంతదేశికులవారు (1268–1369) తమ దయాశతకంలో చెప్పారు. ఈ కొండకు సంబంధించి భక్త ప్రజలకు అనేక అభిప్రాయాలున్నాయి.

సప్తగిరి మాసపత్రిక తిరుమలకొండ పవిత్రతను, శ్రీనివాసుని వైభవాన్ని, భక్తి ప్రాముఖ్యతను ప్రపంచమంతటా చాటడానికి, భక్త పాఠకులకు ఆధ్యాత్మికానుభవం కలిగించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాలు అధికారికంగా నడుపుతున్న పత్రిక. ఆస్తికులైన ఆధునిక కవులెందరో సప్తగిరిలో పద్యాలు, గేయాలు ప్రచురింపజేసి స్వామిని సేవించారు. ఈ రచనలలో ఆయాకవుల

వ్యక్తిగత అభిప్రాయాలతోపాటు, లోకంలో ప్రచారంలో ఉన్న వివిధ పౌరాణికాంశాలు కూడా కనిపిస్తున్నాయి. 'ఏడుకొండలకొండ' అనే గొల్లాపిన్ని సుబ్రహ్మణ్యశర్మ గేయంలో –


**ఏడుకొండలకొండ – ఎచట కానని కొండ**
**వడ్డికాసుల కొండ – వెలుగు బంగరు కొండ**

అంటూ కొండ ప్రాశస్త్యం వెల్లడింపబడింది (సప్తగిరి నవంబర్ 1997). ఈ కొండను బ్రహ్మాది దేవతలు పూజించారని, ఇది త్యాగులకు యోగులకు కల్పతరువని, కవిగాయకులకు కలకండ అని, భక్తులకు వైకుంఠమని, ఈ కొండపై గోవిందనామాల సందడులు వినిపిస్తుంటాయని గేయకర్త ప్రశంసించారు. గేయం చివరి పంక్తిగా **'భరతాంబకీ కొండ – బంగారు మెడదండ'** అనడంలో భారతదేశంలో ఈ కొండకున్న గొప్పతనం వ్యక్తమవుతున్నది. ఈ కొండ తనకెలా కనిపించిందో కింది పద్యంలో మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ వివరించింది (సప్తగిరి, నవంబరు, 1996)

**శృంగారరాయని చెలువుమీరిన కొండ, ఫణిరాజు పేరిట పసిడి కొండ**
**ఘోరపాపమడంచు కోనేర్లు గల కొండ, తలచిన మోక్షంబు తగులు కొండ**
**చిలుకలు కోయిలల్ చెలగి కూసెడు కొండ, మృగజాతి కోట్లెల్ల మెలగుకొండ**
**పుష్పజాతులు విష్ణుబూజింపగల కొండ, కల్పవృక్షములైదు గలుగుకొండ**
**అమరవరులకు నాధారమైన కొండ, ఆళువార్లకు బ్రత్యక్షమైన కొండ**
**అలరజూచిన బ్రహ్మాండమైన కొండ, ఏనుగంటిని శ్రీవేంకటేశుకొండ**

**సిరిమల్లెలు** (శ్రీవేంకటేశ్వర త్రిశతి) అనే చింతలపాటి మోహన మురళీకృష్ణ రచించిన శతకం (2013) లో కొండనుగురించి అనేక విషయాలున్నాయి. తిరుమల కొండలను చూస్తే దీక్షవహించి స్థిరయోగముద్ర ధరించిన మౌనుల వలె కనిపిస్తాయట (109 వ పద్యం). **'ఒక్కొక కొండ నుండి సమయోచితరీతి స్వరంబు లేదుపెం, పెక్కగ సామవేద ఘనభేదములన్**





**వేంకటశైలం నుండి వచ్చేగాలి 'ఓం' అనే శబ్దంతో వీచి భక్తుల మానసాలలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తుంది.**

**వినిపించుచుండె...'**(110) అంటూ ఏడుకొండలనుండి స రి గ మ ప దని అనే సప్తస్వరాలు వినిపిస్తుంటాయని చెప్పిన మాట ఆ శతక కర్త అనుభవమై ఉంటుంది. ఏడుగురు ఋషులు ఏడుకొండలుగా నిలిచి ఉన్నారట.

**వేంకటశైలమందు ప్రభవించెడి వాయువదేమొ కాదు, ని**
**శ్శంకత వేదనాదమయ ఝూంకృతియే ప్రణవ స్వరూపమౌ**
**నోంకృతియై ప్రవర్తిల్లు ...................................... (113)**

ఆ కొండపై నుండి వచ్చేగాలి 'ఓం' అనే శబ్దంతో వీస్తుందట. వాతావరణం ఎలా ఉన్నా అంటే ఎండైనా వానైనా కొండకు భక్తులు రాకుండా ఉండరు. పైగా మిక్కుటమైన ఉత్సాహంతో వస్తారని మరొక శతక కర్త 'ప్రణతి' అనే శతకం (2013) లో పేర్కొన్నారు.

**ఎండకుగాని దట్టపు మొయిళ్లకు గాని భయమ్మునంది నీ**
**కొండకు రాకమానరు, నిగూఢముగా తమకున్న మ్రొక్కులు**
**ద్దండ పటిష్ఠతన్ నిశిత తన్మయ బుద్ధిని తిర్మలాధి పుం**
**డుండు నివాసమందె యతులోత్సుకతన్ ముగియింపు పొంగరే.**

**'వినతి'** అనే శతకంలో (2013) వేమూరి వేంకటరామనాథం 'తిరుపతి కొండ' అనే శీర్షికలో తిరుమలకొండలో వీచే గాలులు దివ్యుల శ్వాసలవలె మనోహరంగా ఉంటాయన్నారు. ఆ గాలులు శరీరానికి సోకితే**'శాంతిసంగత మహత్వమయం'** గా ఉంటుందని కూడా వెల్లడించారు. ఏడుకొండలను, ఆపై నిలిచి ఉన్న శ్రీనివాసుని మానవ శరీరంలోని మూలాధారాది చక్రాలతో తన్మూలమైన కుండిలినీ శక్తితో పోల్చి చెప్పారు కొందరు. అలాగే ఈ సప్తశైలాలు భూలోక, భువర్లోక, స్వర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకాలకు ప్రతీకస్ఫోరకాలని మరొక అభిప్రాయముంది. శ్రీవిద్యా సంప్రదాయాన్నిబట్టి యోగదృష్టితో చూస్తే మానవ శరీరంలో ఏడు చక్రాలు కనిపిస్తాయట. అవి – ఆధారచక్రం, స్వాధిష్టానచక్రం, మణిపూరకచక్రం,



అనాహతచక్రం, విశుద్ధచక్రం, ఆజ్ఞాచక్రం. చివరిది సహస్రారం. అధోముఖంగా ఉండే కుండలినీశక్తిని యోగాభ్యాసంతో ఊర్ధ్వగామిగా చేస్తే అక్కడ పరమాత్మ సాన్నిధ్యం లభించి బ్రహ్మానందం లభిస్తుందట. ఏడు కొండలపై శ్రీనివాసప్రభువు నెలకొని ఉండడం ఈ విషయాన్ని సూచిస్తున్నదని యోగులు చెపుతారు. యాత్రికులైన భక్తులు ఆరుకొండలెక్కి ఎంతో కష్టపడి ఏడవ కొండ ఎక్కగానే అక్కడ స్వామి సాక్షాత్కారం లభిస్తుందని చెపుతారు.

**'అంతరంగ నివేదనము'** అనే గేయకావ్యం (కవయిత్రి శారద–2013) శ్రీనివాసునిగురించి అనేక విషయాలను వివరిస్తున్నది. పరమాత్ముని పసిడికొండ అనే శీర్షికలోని పంక్తులివి.

**పచ్చపచ్చనైన కొండ పరమాత్ముని పసిడి కొండ**
**మెచ్చిన దేవతలెల్లరు విచ్చేసిన కొండ**
**తాళ్లపాక అన్నమయ్య జోలపాట తన్మయమున**
**వ్రేలునోట వేసుకొనుచు డోలలూగువాని కొండ**
**గొల్లయిండ్ల వెన్నతిన్న అల్లరి కన్నయ్య కొండ**
**గొల్లకు తొలిదరిశనమిడు చల్లనైన స్వామి కొండ**

ఇప్పటికీ మారుమూలప్రాంతాల్లో తిరుమలకు స్వామికొండ అనే పేరుంది. కొండకు పోదాం అంటే తిరుమలకు పోదామనే అర్థం. ఇతర ప్రాంతాల్లో ఎన్నో కొండలపై దేవాలయాలున్నాయి. అయినా కొండ అంటే తిరుమల కొండే. పద్మావతి అమ్మవారితో వివాహం కాకముందు శ్రీనివాసుడు పుట్టలో ఉండిన వృత్తాంతం ఉంది. పుట్టలో ఉండిన స్వామిని మొదట చూచినవాడు గొల్లవాడు. అందుకని కలియుగాంతం వరకు గొల్లవానికే మొదటి దర్శనం అనుగ్రహింపబడింది. ఇప్పటికీ ప్రతిరోజూ సుప్రభాతసేవకు ముందు బంగారువాకిలి తెరచేవాడు గొల్లవాడే. ముట్నూరి శంకరశాస్త్రి తన 'సప్తగిరి దర్శనం' అనే గేయంలో (సప్తగిరి మార్చి 1997) ఇలా భావించారు.

భూలోకమే (మనం నివసిస్తున్న భూమి) ఒక కొండ. మరొకగిరి చేరితే అది భువర్లోకం. వేరొకగిరి స్వర్లోకం. ఇంకొకగిరి మహర్లోకం. ఆపైన గిరి జనలోకం. ఆరవగిరి తపోలోకం. సప్తమగిరి సత్యలోకం. ఈ విషయాలన్నీ ప్రాచీనులు చెప్పినవైనా ఇప్పటివాళ్లు కూడా చెపుతూ ఉండడం, అవన్నీ భక్తిభావంతో సత్యమని భావించడం గమనింపదగిన అంశం. లోకంలోని మానవుల పాపాలను శ్రీనివాసుడు పోగొడతాడు. భువర్లోకంలో సూర్యచంద్రులు స్వామి నేత్రాలు. స్వర్లోకంలో శ్రీనివాసుడు స్వర్గాధిపతిగా సాక్షాత్కరిస్తాడు. మహర్లోకంలో ఉండేవాళ్లంతా మౌనులు, మహితాత్ములు. జనలోకం పుణ్యాత్ములకు ఆవాసంగా ఈషణత్రయానికి దూరంగా ఉంటుంది. తపోలోకం తాపసులకు తత్త్వబోధ చేస్తుంది. శంకరశాస్త్రిగారికి ఏడవదైన సత్యలోకం ఇలా దర్శనమిచ్చింది.

**సప్తగిరి నరయ సత్యలోకము**
**నిత్యము స్తుత్యము నిఖిలాధారము**
**బ్రహ్మతత్త్వ పరబ్రహ్మావాసము**
**కలియుగ వైకుంఠము వేంకటనగము.**

* * *

# శ్రీవేంకటేశ్వరుడు

వేంకటాచలానికి ఈశ్వరుడు అనగా ప్రభువు వేంకటేశ్వరుడు. పాపాలకు 'వేం' అని పేరు. 'కట' అంటే దహించడమని అర్థం. పాపాలన్నింటిని దహిస్తుంది కాబట్టి శేషశైలానికి వేంకటాచలమనే పేరు ప్రచారమైంది. కొండే అంత పవిత్రమైతే ఆ కొండకు అధినాథుడైన స్వామి ఎంత పవిత్రుడో, ఎన్ని పాపాలను కడిగివేస్తాడో ఊహకందని విషయం.

**సర్వపాపాని వేంప్రాహుః కటస్తదాహ ఉచ్యతే**
**సర్వపాప దహోయస్మాత్ వేంకటాచల ఇత్యభూత్**

అని బ్రహ్మాండపురాణం పేర్కొంటున్నది. అడవిలో దేహాన్ని వీడిన క్షణమే శ్రీకృష్ణుడు శిలరూపంలో వృషభాద్రికి చేరి శ్రీనివాసుడైనాడు అనే విషయం ప్రసిద్ధంగా చెప్పబడుతున్నా ఇప్పటి కవులు కూడా దీనిని ఆమోదిస్తున్నారు (శ్రీనివాస విలాసం అనే కావ్యంలో ముదివర్తి కొండమాచార్యులు, 2013). ఒక గేయకవయిత్రి వేంకటేశుని ఇలా భావించింది.

**వేంకటాద్రి శిఖరమందు వెలుగు వెండి పువ్వమ్మా**
**వేంకటేశుడమ్మ వీడు చందమామ.**

వెండిపువ్వు అనడం కొత్తగా ఉంది. మరొక గేయకవయిత్రి 'వేంకటేశ' అనే మాటను ఎంత గొప్పగా చెప్పిందో కింది గేయం తెలుపుతుంది.

**'వేం' అని అనగానే – వెతలు తొలగిపోవు**
**'క' యని స్మరించిన – కష్టంబులు తొలగిపోవు**
**'టే' యని ఉచ్చరించిన – కుటిల బుద్ధులు తొలగు**
**'శ' యని మననము చేసిన శక్తి చేకూరును.**

'వేంకటేశ' అనే మాటను ఎన్ని సార్లు మననం చేస్తే అంత ప్రయోజనం సిద్ధిస్తుంది. 'మహాప్రసాదం' పేరుతో ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావుగారు

తన కుమారభారతికావ్యంలో శ్రీవేంకటేశ్వరునిగురించి ఐదు ప్రార్థనా పద్యాలు రచించారు. ఆ పద్యాలలో స్వామిరూపాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించిన పద్యమిది -

**నీలస్నిగ్ధము, కాశచామర సమున్మేషంబు, చంద్రార్కనే**
**త్రాలంకారము, విశ్వనాభి నళినీరమ్యంబు, మాయాజగత్**
**శ్రీలాంగూలము, చండవామన మలక్ష్మీభావ గాఢాంధకా**
**రాలుంటాకము, వేంకటాభిద మహస్సై మమ్ము రక్షించుతన్**

**నీలస్నిగ్ధము -** చిక్కని నీలిరంగు. దూరం నుండి చూస్తే స్వామి నీలిరంగు ముద్దగా కనిపిస్తాడు. అంటే శరీరమంతా నీలికాంతితో కనిపిస్తుందని అర్థం. **కాశచామర సమున్మేషంబు -** రెల్లుపువ్వులవంటి, వింజామరవంటి తెల్లని కాంతితో కూడుకొన్నది. అనగా అలంకరించిన నగలు కన్నులు మిరిమిట్లు కొలిపేటంతటి కాంతులు వెదజల్లుతాయి కాబట్టి స్వామి శరీరం తెల్లని కాంతితో కూడా ప్రకాశిస్తుంది. **చంద్రార్క నేత్రాలంకారము -** స్వామి నేత్రాలు సూర్యచంద్రుల కాంతికంటె మిక్కుటమైన ప్రకాశంతో కనిపిస్తాయి.

**విశ్వనాభి నళినీ రమ్యంబు -** నాభిలో అందమైన పద్మం ఉంది. విశ్వనాభి అంటే విశ్వానికే బొడ్డు అని అర్థం. అంటే స్వామి శరీరం విశ్వమే. విశ్వమంతా వ్యాపించిన లేక విశ్వమంతా తానైనవాడు స్వామి.

**మాయాజగత్ శ్రీలాంగూలము -** మాయాజగత్తును జయించే శక్తి. **చండవామనము -**నీచమైన కోపం. స్వామికి నీచులపైననే కోపం. నీచులంటే ధర్మానికి చ్యుతి కలిగించేవారు.

**అలక్ష్మీభావ గాఢాంధకారాలుంటాకము -** అలక్ష్మీభావాలైన దారిద్ర్యం, అజ్ఞానం, అంధకారం మొదలైనవాటిని దొంగిలించునది. అనగా స్వామి అశుభలక్షణాలను రూపుమాపుతాడని అర్థం.





**సృష్టి అంతటా నిండిన ఓంకార స్వరూపుడు**
**తిరుమల ఆలయంలో స్వయంవ్యక్తరూపుడుగా దర్శనమిస్తున్నాడు.**

**వేంకటాభిదమహస్సు –**వేంకట నామమనే తేజస్సు లేక శక్తి. ఈ తేజస్సును ఎవరు భావిస్తే లేదా ఉచ్చరిస్తే అది మహాసంపన్నమై ఆ వ్యక్తిని రక్షిస్తుంది. ఆ కవి భావనలో స్వామి ఆవిష్కరింపబడిన తీరు ఇది. ఆధునిక కవులు కూడా స్వామిని ఎంత గొప్పగా భావిస్తున్నారో కోటీశ్వరరావు గారి పద్యాన్నిబట్టి తెలుస్తున్నది.

శ్రీమన్నారాయణుని అర్చావతార రూపమే శ్రీవేంకటేశ్వరస్వామి అన్న అభిప్రాయాన్ని ఆధునికులందరూ నమ్ముతున్నారు. **'శ్రీ శ్రీనివాసునికి శతకీర్తన మణిహారం'** అనే సుందరవల్లి శ్రీదేవి గేయకృతిలో స్వామికి సంబంధించిన అనేక విషయాలున్నాయి. 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరి మంత్రం వైష్ణవులకు ప్రాణప్రదమైనది. ఈ గేయకృతిలో 'ఓం నమో వేంకటేశాయ' అనే వేంకటేశమంత్రమే ఆధునికులకు అష్టాక్షరి అని ఇలా చెప్పబడింది.

**నారాయణయను నామము నమ్మిన**
**నారదాదులకు అష్టాక్షరి మంత్రము**
**కలియుగమున శ్రీవేంకటేశ్వర నామము**
**దాటించునది భవసాగరము**

కలియుగంలో వేంకటగిరిపై వెలసిన రూపం దశవిధరూపుడైన శ్రీవేంకటేశుడే నని నిశ్చయంగా చెపుతున్నదీమె. కలియుగంలో శ్రీనివాసుడు వరదుడట. ఓం అని పిలిస్తే ఓ అని స్వామి పలుకుతాడట. కలియుగంలో తిరుమల వాసుడు తప్ప మరొక దేవుడు లేడని 'ఇలలో నీకన్న ఘనులెవ్వరయ్య కలియుగదైవం నీవైయుండగ' అనే మాటలు వ్యక్తం చేస్తున్నాయి. సృష్టి అంతా నిండిన దేవుడు ఆయనేనని టి.మహబూబ్‌సాహెబ్ ఈ పద్యంలో (సప్తగిరి, డిసెంబర్ 1991) చెపుతున్నాడు.



**నీటిలోపల భూమిమీదను నింగిపైనను అంతటన్**
**సాటి లేరయ నీకు పోల్పగ సర్వశాసక! ఓ హరీ!**
**ఆటపాటలు, మేలిబాటలు, హ్లాదసత్య సుధర్మముల్**
**ఆటుపోటులు, చేటుపాటులు అన్నియున్ మరి నీవెపో!**

'తిరుమల కొండలందు తగు తీరున భక్తుల నుద్ధరింపగా, వరములొసంగి బ్రోచు వరవేలుపుగా ధర నిల్చినావు, మా వరదుడ నీవె...' అని మరో కవి పి.వి.సీతారామమూర్తి (సప్తగిరి, మే 1997) అభిప్రాయపడినాడు. 'జయజయజయ శ్రీవేంకటేశా' (ఎ.వేణుగోపాల్) అనే సినిమా పాటలో స్వామి వైకుంఠం వీడి భూలోకానికి వచ్చినప్పటినుండి రమాదేవి వెదకుతూ రాగా –

**శిలారూపమున వెలసితివయ్యా**
**భక్తకోటికిదె నిత్యదరిశనము**
**పాపవిమోచన పుణ్యఫలమయా** అనే విషయముంది.

శ్రీవేంకటేశమంత్రమహిమను అన్నమయ్య ఎంత గొప్పగానో వర్ణించి చెప్పిన విషయానికి కొనసాగింపుగా ముదివర్తి కొండమాచార్యులు తమ శ్రీనివాస విలాసంలో

**సర్వదారిద్ర్య రోగ విషాదములకు**
**శాంతి సమకూర్పఁజాలు ప్రశస్తమైన**
**ఓన్నమోవేంకటేశాయ యన్ననీదు**
**మంత్రజపముండ భయమేల మాకు స్వామి**

అని వేంకటేశమంత్రాన్ని ప్రశంసించారు. తిరుమల ఆలయానికి ప్రచార ప్రాభవాలు కలిగినప్పటినుండి భక్తులందరూ స్వామిని ఇలువేలుపుగా కొలవడం ప్రారంభమైంది. కాలంలో ఎన్ని అత్యాధునిక మార్పులు వస్తున్నప్పటికీ ఈ విషయంలో మార్పు కనిపించడం లేదు. ఈ అంశాన్ని ఎందరో కవులు గ్రంథస్థం చేశారు.

**కళ్లలో వెలగేటి కలి దైవమే వాడు**
**ఇళ్లలో కొలిచేటి ఇలువేలుపే వాడు**
**అన్నమయ్య పాటకు అడుగు లేసేవాడు**
**అలివేలుమంగకు ఆట నేర్పెడువాడు**

అంటూ గొల్లాపిన్ని సుబ్రహ్మణ్యశర్మ **'ఏడుకొండలవాడు'** అనే గేయం (సప్తగిరి, జూలై 2012) లో తన ఇలువేలుపైన స్వామిని కీర్తించాడు.

కొందరు శతక కర్తలు తిరుమల, తిరుమల శ్రీనివాసుల ప్రాచీనతను తమ పద్యాలలో చూపించారు. తిరుమలనుగురించి, శ్రీవేంకటేశ్వరుని గురించి ఆళ్వారులు చెప్పిన పాశురాలలో అప్పటి స్థితి అతిసహజంగా కనిపిస్తుంది. **'రత్నప్రభ'** అనే పేరుతో వఝల రంగాచార్య రచించిన వేంకటేశ్వర శతకం (2012) లో అలాంటి సహజ భావాలెన్నో గ్రంథస్థమైనాయి. ఇవన్నీ ఇప్పటి సమాజదృష్టితోనే కనిపిస్తున్నాయి. గొడ్లు కొండకోనలు తిరిగి ఇంటికివచ్చి విశ్రాంతి తీసుకొన్నట్లు, జన్మించిన నరులందరూ జగతిలో తిరుగాడి చివరకు విశ్రాంతికోసం వైకుంఠానికి వెళ్లాలి. అందుకు పెద్దవాళ్లు శౌరిపురానికి దారి చూపారు. శౌరి ప్రాణులపై గల జాలితో తిరుమలకు వచ్చి నిలిచాడు (59 వ పద్యం). ప్రాంతీయంగా పూచే కాచే పూలు పండ్లు దేవుడికి సమర్పించి పూజిస్తారు (2). సూర్యుడు ఉదయమే స్వామి పాదాలను తాకి తరువాత దినాన్ని నడుపుతాడు. పక్షులు మేల్కొలుపు పాడి ఆకాశంలోకి ఎగురుతాయి. కాపు గుడికి దండం పెట్టుకొని పొలానికి కదులుతాడు. చుక్కపొద్దున లేచి తిరుప్పావు చదువుతూ పూజారి గుడికి వెళతాడు (6). లోకంలోని జనజీవనంలో ఆ యా ప్రాంతాల్లో ఉన్న వేంకటేశ్వరస్వామి గుడుల ప్రాధాన్యతను ఈ పద్యం వివరిస్తున్నది. స్వామి అడవి సంచార జాతులకు ఒడయడట (8). కోయవాళ్లు తునికి పండ్లు సమర్పిస్తారు. లంబాడివాళ్లు ఈతపండ్లు ఇస్తారు. చెంచులు నెమలి ఈకల వీవనలు కానుక చేస్తారు. ఎరుకలు ఏరులలో పూచిన అంబుజాలు తెస్తారు. అన్ని కులాల వాళ్లూ స్వామికి వివిధ సేవలు చేస్తారు. గుడిలో ముదిరాజులు, చాకళ్లు, మంగళ్లు, కాపులు, పట్వారులు, సుంకరులు తమ తమ కులాచారాల ప్రకారం అర్చనలు చేస్తారు (26). దేవుడు అందరి వాడని, ఎవరు ఎలాంటి పూజలు చేసినా స్వీకరిస్తాడని, అందరిని వాళ్లవాళ్ల భక్తిని బట్టి ఆదరిస్తాడని శతక కర్త విశ్వాసంతో చెపుతున్నాడు.



శ్రీనివాసునిగురించి భక్తులు తమకు ఎలా తోస్తే అలా చెప్పుకోవడం కొన్ని జానపదగేయాల ద్వారా తెలుస్తుంది. తిరుపతికి సమీపంలోగల పేరూరులో ఉండే గ్రామదేవత పేరూరమ్మ వేంకటేశ్వరుని తల్లి అని, ఏడుకొండలలోని శేషాచలం తండ్రి అని జానపదులు పాటలు పాడుకొన్నారు. పడమటి దేశాల్లో మచ్చలబండారి అనే దేశాన్ని శేషాచలం ఏలుతున్నాడని అతని భార్యపేరు పేరూరమ్మ అని కొన్ని జానపద గీతాలు చెపుతున్నాయి. అమళ్లదిన్నె గోపీనాథ్ సప్తగిరి, సెప్టెంబర్ 2012 సంచికలో రాసిన 'జానపద సాహిత్యం – శ్రీవేంకటేశ్వరుని ఆరాధన' అనే వ్యాసంలోనిది కింది గేయం.

**పేరూరమ్మ కొడుకూలంటా వాళ్లేడుమందీ**
**పేరుకాడికి పెద్దవోడు పెదవోబీలన్నా**
**అతనికాడికి చిన్నవోడు సినవోబీలన్నా**
**అతనికాడికి చిన్నవోడు పెంచల నరసిమ్మా**
**అతనికాడికి చిన్నవోడు కదిరీ నరసిమ్మా**
**అతనికాడికి చిన్నవోడు గోయిందరాజూ**
**అతనికాడికి చిన్నవోడు శ్రీఎంకాటేశూ**
**కందినముంత వరంతోనా కడబుట్టీనాడు**

పై విషయాలన్నీ జానపదుల నమ్మకానికి సంబంధించినవి. ఇలాంటి విషయాలు ఇంకా ఎన్నో ఉంటాయి. నాగరికతకు దూరంగా గ్రామసీమల్లో నివసిస్తున్న జానపదులకు ఉన్న భక్తిభావాలు నాగరికత బలిసిన ప్రాంతాల్లో ఉండవు.

# వేంకటేశ్వరుని రూపం

వేంకటరమణుడు తిరుమల సిగపై పూవు. కరిదేహుడు. కమల నయనుడు. కనకాభరణుడు. విరిబోణుల అందగాడు. ఆయన నవ్వు వెన్నెల తీగల మెరుపు వలె వుంటుంది. అది వెన్నలు జుర్రిన పెదవుల వెలుగుల జిలుగు. సన్నిధి అమృతపు జాలు. ఈ వర్ణన ఎమ్.సి.కన్నయ రచించిన వేంకటరమణ శతకం (2005) లోనిది. కన్నయ్య ఇంకా ఇలా అన్నాడు.

**నీకేమిర మా స్వామీ! చీకూ చింతా తెలియక చిరునగవులతో**
**ఏకముగా గిరిపైనే, వీకముతో వెలసినావె వేంకటరమణా!**

స్వామి ఎప్పుడూ నిలబడే ఉన్నాడు. "నిలబడుటేనా లేదా, నిలుకడ కూర్చుండనీకు నెలవే కరువా" అని అడుగుతున్నాడు కవి. ఆ స్వామి అడుగడుగుదండాలవాడు, ఆదుకొనెడువాడు, ఆపదమ్రొక్కులవాడు, అందగాడు, సామగానలోలుడు, కాంచనచేలుడు, మౌనిపాలుడు అంటూ ప్రఖ్యాత కవి ముదివర్తి కొండమాచార్యులు భావిస్తున్నారు. కొండంత ఓపికతో నిలిచి ఉన్నాడు. అలా నిలవడానికి కారణం భక్తుల మొరను లాలించి పాలించడానికేనట. స్వామి హస్తముద్రను దర్శిస్తే ఎవరికైనా ధైర్యం కలుగుతుందని మేడవరం వేంకటనారాయణశర్మ తమ **'వేంకటేశ్వరత్రిశతి'** (1984) లో ఇలా చాటుతున్నాడు.

**నీదగు హస్తముద్ర గన నిస్తుల పాప మహాంబురాశిలో**
**నీదెడివానికైన నెద కెంతటి ధైర్యము కల్గురా ప్రభూ!**
**స్వాదు సుధాసమానమగు పావనదృష్టి లవంబు చూప, నా**
**వేదనలెల్ల తూలవా! నివేదన చేరదా! వేంకటేశ్వరా! (39 వ పద్యం)**

స్వామి ప్రతిమలో ప్రణవం పర్యవసిస్తుంది. యోగదృష్టితో చూచే వాళ్లకు మణిమయ సదృశమైన త్రినామం (ఊర్ధ్వపుండ్రం) మూడక్షరాల టిప్పణిగా కనపడుతుంది (133). కొందరు కవులకు స్వామి భౌతికరూపం కంటే మిన్నగా మనస్సులలో సాక్షాత్కరించాడు. 'నా కంటికి కనపడు నీ సుందర రూపము కన్న, లోకంటికి కనపడు నీ అతిసుందరమూర్తి మిన్న' అని ఏడిద కామేశ్వరరావు తన వేంకటేశ్వర స్తుతిమాల (1994) లో భావించాడు. స్వామిని, ఆయన ధరించిన ఆభరణాలను దర్శిస్తే కలిగే ప్రయోజనాలను **'తదేవ కవచం మమ'**అనే పేరుతో వడ్డెంగుంట అంకయ్య రాసిన సీసమాలిక (సప్తగిరి, ఆగస్టు 1997) ఇలా వివరించింది.

**ఆనంద నిలయుని ఆనన మీక్షింప – ఆనందమయమగు నంతరాత్మ**
**చిరునవ్వు లొలికించు చిన్మయమూర్తిని – వీక్షింప నాపదల్ వీడునిజము**
**నవరత్నధారుని నయనముల్ కనుగొన్న – మరుజన్మ ముండదు మరలమరల**
**కర్ణకుండలములు కనులార గాంచిన – కలికాల సుఖసంపద లధికమగును**
**కలియుగ వరదుని కరములు వీక్షింప – వివరములిచ్చి దీవించుచుండు**
**శంఖ చక్రాదుల పొంకంబు జూడంగ – అభయముద్రలు వేసి ఆదుకొనును**
**పద్మనాభుని పాదపద్మముల్ భజియింప – పరమాత్మ దరిజేర్ప నరదమగును**
**పుష్పహారాదులు పొడగన్నయంతనే – దివ్యానుభూతులు దిరుగు మదిని**
**కొండలరాయని కొల్చిన యంతనే – కొంగు బంగారమై కోర్కెదీర్చు**
**భక్తమందార! రమ్యసప్తగిరివాస! సత్యశివసుందరమగు ఓ చక్రధారి!**
**కాచి రక్షింప నాకింక కవచమీవే – నిన్ను నా గుండె గుడిలోన నిల్పుకొంటి.**

ప్రయోజనం మాట అటుంచి ఆలోచిస్తే స్వామిరూపం మోహం పుట్టిస్తుందని, ఆ రూపం చూచిన తరువాత తత్సమానమైన రూపం సృష్టిలో మరొకటి ఉండదని, ఆ రూపాన్ని తనివితీరా దర్శించి వెనుతిరిగినంతనే మళ్లీ చూడాలనిపిస్తుందని, ఎంత ప్రయత్నించినా ఆ రూపం మనస్సులో నిలువదని, ఎన్నిసార్లు చూచినా అప్పటికప్పుడు కొత్తగానే తోస్తుందని స్వామిని దర్శించి వచ్చిన భక్తులు చెపుతూ ఉంటారు. భక్తి భావాలున్న కవులు కూడా ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు. శ్రీనివాసుని చూపు నవనీతం వంటిది. ఆయన రూపు కాటుక కొండ వంటిది. భూతలంలో

స్వర్గాన్ని నిలిపిన ఆయన అడవులలో ఉన్న వేల్పు. ఆయన భౌతిక నేత్రానికి అంతగా అందడు. శిలరూప చరిత్రల చేత, శాస్త్ర విజ్ఞానం చేత, మతాల చేత శౌరిని చూడలేరు. భక్తివలననే ఆయన అనుభూతిని కలిగిస్తాడు. భక్తి ఏర్పడాలన్నా స్వామి అనుగ్రహం కాలసిందే.

తిరుమలవాసుడు కల్యాణ శ్రీనివాసుడు. ఆయన ఉన్నచోటు నిత్య వసంతం. తులసి మాలల సువాసనలు, మంచిగంధపు పరిమళాలు, సాంబ్రాణి ఘుమఘుమలు, హారతి కర్పూరాలు అన్నీ కలసి అదొక పసందైన పరిమళం. ఆ పరిమళాన్ని ఆఘ్రాణించిన పద్మావతి తన గేయంలో (సప్తగిరి నవంబర్ 2005) అదొక వింతయైన సోయగంగా వర్ణించింది. ఒక శతక కర్త అభిప్రాయం ఇలా ఉంది. కదలకుండా నిలుచున్న కాటుక రూపమే దేవుడు. ఆ రూపాన్ని కండ్లలో నిలుపుకోవాలి. ఆ సౌందర్యమూర్తిని హృదయంలో దర్శించి తృప్తిపడాలి. కటిముద్ర చూపించే కన్నయ్యను నమ్మి బతకు పొత్తాన్ని అంకితమివ్వాలి. దేవేరులతో కూడిన స్వామిని రక్తితో సేవించి ముక్తి పొందాలి. ఆ దేవుని గుడులు దేశమంతా నిర్మింపబడినా యంటూ ఆ కవి –

**కలియుగమ్మున లోకానికన్ని చోట్ల**
**విభవరూపాన జనులకై వెలసె ప్రభువు**

అని తన శతకంలో (వజ్ఝల రంగాచార్య) అన్నాడు.

తిరుమల శ్రీనివాసుడు ఆపదలు కాచి అభయం ఇచ్చే దైవంగా లోకంలో ప్రచారమైనప్పటినుండి ఆ స్వామి శివుడని, విష్ణువని, శక్తి అని రకరకాల అభిప్రాయాలు కూడా ఏర్పడినాయి. ఎవరెవరి భక్తి పద్ధతులను బట్టి ఆ యా భక్తులు తిరుమల ప్రభువును ప్రాచీన కాలంనుండి ఆరాధిస్తూ వచ్చారు. భగవద్రామానుజాచార్యుల కాలం వరకు ఇలాగే కొనసాగగా ఆయన స్వామిని వైష్ణదైవంగా, శ్రీమన్నారాయణుని అర్చావతారమైన శ్రీవేంకటేశ్వరుడుగా



అందరి ఆమోదంతో నిర్ణయించి అప్పటి నుండి జరుగవలసిన పూజాదికాలను స్థిరపరచినట్లు వైష్ణవ సంప్రదాయం చెపుతున్నది. అయినా ఆ సందేహం అప్పటితో సమసిపోలేదు. అన్నమాచార్యులవారి కాలంలో కూడా అలాంటి అభిప్రాయాలు ప్రచురంగా ఉండినట్లుంది. అన్నమయ్య స్వామిని శ్రీమన్నారాయణుడుగానే భావించి తన సంకీర్తన సుమాలతో అర్చించాడు. ఎవరికి తోచిన రూపంలో వారు దర్శించవచ్చునని, 'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' అనే పద్ధతిలో ఎలా పూజించినా ఆ పూజలన్నీ శ్రీనివాసునికే చెందుతాయనే ఉద్దేశంతో **'ఎంతమాత్రమున నెవ్వరు దలచిన యంత మాత్రమే నీవు'** అనే సంకీర్తనలో స్పష్టం చేశాడు. ఇదొక ప్రసిద్ధమైన సంకీర్తన. ఇందులోని విషయాలను పండితులు సమగ్రంగా వివరించి ఉన్నందువల్ల ప్రస్తుతం ఇక్కడ వివరాలు పొందుపరచలేదు. శ్రీవేంకటేశ్వరుడు శివుడా? విష్ణువా? అనే అంశం ఇప్పటికీ కొందరి మనస్సులలో మెదలుతూనే ఉందనడానికి ఇప్పటి గేయ, శతక కవులు తమ రచనలలో వెలిబుచ్చిన అభిప్రాయాలు తార్కాణంగా ఉన్నాయి.

ఈ ఆధునిక కాలంలో కవులకు గాని, కళాకారులకు గాని స్వామి రూపానికి సంబంధించిన సందిగ్ధత నూటికి నూరుపాళ్లూ లేదనే చెప్పాలి. అందరికీ ఆ స్వామి దశవిధ అర్చావతారాలను ధరించిన మూలరూపమైన శ్రీమన్నారాయణ పరబ్రహ్మ స్వరూపమే. అయితే గేయాలలో, శతక పద్యాలలో కనపడుతున్న వివిధ అభిప్రాయాలకు కారణమేమిటనే ప్రశ్న ఉదయిస్తున్నది. ఇలా చారిత్రకంగా తమ కాలంలో కూడా వ్యాప్తిలో ఉన్న విషయాలను గ్రంథస్థం చేయడమే వాళ్ల ఉద్దేశంగా కనిపిస్తుంది. స్వామిలో అన్ని అంశాలు ఉన్నాయని చెప్పడం కూడా ఒక సమన్వయ ధోరణే. అభిప్రాయాలెన్ని ఉన్నా తిరుమలవాసుడు ఒక రాముడుగా, ఒక కృష్ణుడుగా, శ్రీమహావిష్ణువుగా అందరిచేతా పూజలందుకొంటున్న విషయం సత్యం. ఇప్పటి సమాజానికి ప్రతినిధులైన కవులలో కొందరి అభిప్రాయాలిలా ఉన్నాయి.

**శివకేశవులకు భేదమె లేదనచు**
**వెంకటేశ్వరుడవై వెలసిన దేవా**
**శక్తి స్వరూప శ్రీవేంకటేశ – మా కులదైవమ! మంగా సతీశ**
**స్వామి నీవే శక్తిరూపమని నమ్మి అంబను సేవించితిని**
**నా ప్రణతులు చేకొమ్మని దుర్గమాతకు దెలిపి బ్రోవవలె**

ఎ.ఎస్.రాముడు రచించిన పైగేయం (శరణు శ్రీహరి శ్రీవేంకటేశ, 2013) లో అలమేలుమంగా శ్రీనివాసులు దుర్గేశ్వరులుగా భావింపబడినారు. 'శక్తిరూపుడవు దేవీప్రియుడవు' అనే విషయం కూడా ఉంది. కాకర్ల శ్రీరామమూర్తి తన వేంకటేశ్వర స్తవం (2010) లో 'శివుడవు విష్ణువై తనరు శ్రీకర తేజమ విశ్వపోషణ' అని స్వామిని సంబోధించాడు. స్వామిని శైవ వైష్ణవాంశాలతో చూడడానికి కారణం స్వామిని బాలాజీ అని పిలవడం, దేవీ నవరాత్రులలో విశేషపూజలు, ఉత్సవాలు జరపడం, స్వామి నామంలోనే ఈశ్వర శబ్దముండడం, నాగాభరణాలుండడం. ఈ విషయాలు అగస్త్యరాజు సర్వేశ్వరరావు రచించిన **'శ్రీవేంకటేశ్వర సంస్తుతి'** (2009) అనే శతకం లోనివి. ఆ విషయాలన్నీ అజ్ఞాన జనితాలుగా తోసివేయడానికి వీలు కాదని చెపుతూ ఆ కవి 'వేంకటనాథుడే శివుడు విష్ణువు విశ్వుడనంత శక్తియున్ (పద్యం 101) అని కూడా అభిప్రాయపడినాడు.

**కొందరు విష్ణువు యనగా, కొందరు వరశివుడనంగ కొందరు నిన్నున్**
**సుందర! బాలాజీయన, అందరు నిను వేంకటేశుడందురు వసుధన్**

అని మరొక కవి ఏలేశ్వరపు రాధాకృష్ణ సుబ్బరాయశాస్త్రి (1999) మాట. కె.సి.జయచంద్ర శాస్త్రిగారు రచించిన శ్రీవేంకటేశ్వర శతకం (1988) లో ఈ విషయానికి సంబంధించిన పద్యమిది.

**శివుడవొ శక్తివో తలఁప శ్రీపతివో నినుఁబూజ సల్పుటన్**
**నవ తులసీ దళమ్ములను నాడెపు బిల్వములన్; మృగేంద్రముల్**



**భవనము మీఁద నుండుట భవన్నిజరూప మెఱుంగలేను నా**
**భవముల రూపుమాపి యపవర్గము గూర్పుము వేంకటేశ్వరా!**

తిరుమల గుడిలో స్వామి అర్చనకు సందర్భాలననుసరించి తులసీదళాలు, బిల్వపత్రాలు వాడబడుతున్నట్లు పై పద్యం చెపుతున్నది. అయితే సాధారణంగా తులసి దళాలను వైష్ణవ గుడులలోను, బిల్వాలను శైవాలయాలలోను వాడడం కనిపిస్తుంది. ఆలయం మీద సింహపు బొమ్మలున్నాయి. సింహం త్రిపుర సుందరి అమ్మవారికి వాహనం. ఇలా మూడంశాలు తిరుమల ఆలయంలో సమన్వయపడుతూ ఉండడం వల్ల శాస్త్రిగారు స్వామిని శివుడవో శక్తివో శ్రీపతివో అని భావిస్తున్నారు. నిజరూపం తెలియడం లేదు. ఏ రూపమయితే నేమి గాని తనకు జన్మరాహిత్యాన్ని ప్రసాదించమని కోరుకొన్నాడు కవి.

సమాజాన్ని ఎంతో గొప్పగా ప్రభావితం చేస్తుంది సినిమా. పౌరాణికా లైన కథాంశాలెన్నో ప్రజలకు పరిచయం కావడానికి సినిమా బాగానే కృషి చేసింది. ఎన్నో భక్తి ప్రధానమైన సినిమాలొచ్చాయి. దేవాలయాలను, దేవాలయాలలో జరిగే ఉత్సవాంశాలను ఆయా కథా సందర్భాలకు అనుగుణంగా చిత్రించి ప్రజలకు ఆలయ సంస్కృతిని ప్రదర్శించి చూపింది సినిమానే. ముఖ్యంగా తెలుగు సినిమా రామకృష్ణాద్యవతార విశేషాలనే కాకుండా శ్రీవేంకటేశ్వర వైభవాన్ని కూడా అనేకమార్లు అనేక రకాలుగా చూపి ప్రజలలో తిరుమలవాసుని దివ్యత్వాన్ని, ఆర్తత్రాణ పరాయణత్వాన్ని ప్రచారంలోకి తెచ్చింది. ఆ అంశాలు చోటు చేసుకొన్న సినిమాలలో స్వామిని గురించి భక్తి భరితమైన పాటలుండడం విశేషం. అలాంటి పాటలలో కూడా దేవుని శైవవైష్ణవాంశాలు కనిపిస్తున్నాయి. సినిమాపాట వంటిదే అయిన ప్రైవేటు రికార్డు 'తిరువేంకటాధీశ జగదీశా' అనే వి.జి.కె.చారి పాటలో

**శివరూపమీవంచు చెప్పుదురు కొందరు**
**ఆదిశక్తివటంచు అందురింకొందరు**
**నారాయణుడవంచు నమ్ముదురు కొందరు**
**మూడు శక్తులు గూడ ముచ్చటౌ రూపమ్ము**

అనే విషయం ఉంది. అలాగే 'తిరుమలమందిర సుందరా – సుమధుర కరుణా సాగరా' అనే దాశరథి పాట (మేనకోడలు సినిమా 1972) లోని

**పాలకడలిపై శేషశయ్యపై – పవళించిన శ్రీపతివో**
**వెండికొండపై నిండు మనసుతో వెలిగే గౌరీపతివో**
**ముగురమ్మలకే మూలపుటమ్మగ భువిలో వెలసిన ఆదిశక్తివో**

అనే పంక్తులు ఆ విషయాన్నే చెపుతున్నాయి. ఈ విషయాలు ఇంకా కొన్ని సినిమా పాటలలో కనిపిస్తాయి.

గేయకర్తలు, శతక కవులు స్వామిని విష్ణువని, శివుడని ఇత్యాదిగా భావించిన విషయాలన్నీ వాళ్ల అభిప్రాయాలనుకోనక్కర లేదు. లోకంలోని ప్రచారాంశాలే అవి. ఒకే సత్యాన్ని పండితులు అనేక రకాలుగా వివరించినట్లు (ఏకం సద్విప్రాబహుధా వదన్తి) అద్వితీయమైన పరబ్రహ్మ స్వరూపంలో అనేక ఇతర దేవతా రూపాలను భావించడం ఉంది. కవుల ఆలోచన కూడా ఇదే.

**కైలాసవాసుడైన వైకుంఠదేవుడైన**
**ఈశుడే! పరమేశుడే! జగదీశుడే!**
**అడ్డనామాలయిన నిలువు నామాలయిన**
**సర్వేశ్వరుడే! సహస్రనాముడే!**
**నందివాహనుడయిన గరుడ వాహనుడయిన**
**దయార్ద్ర హృదయుడే! ఆపద్బాంధవుడే!**
**శ్రీగిరీశుడైన వేంకటగిరీశుడైన**
**త్రినేత్రుడే కమలలోచనుడే!**

అనే పద్ధతిలో సమన్వయరూపంగా శ్రీనివాసుని భావించడం కవుల పద్ధతిగా కనిపిస్తున్నది. డా॥ ఆవుల రామచంద్రయ్య రచించిన**'ఓం నమో వేంకటేశాయ'** అనే గేయకావ్యంలోనిదైన పై గేయం కవులందరి మార్గంగా కనిపిస్తుంది. తి.తి.దే. కపిలేశ్వరస్వామి దేవస్థానాన్ని కూడా నిర్వహిస్తుండడం గమనింప దగిన అంశం. ఆలయ సంస్కృతి సమాజంలో తి.తి.దే. ద్వారానే బాగా



వ్యాపించి ప్రజలలో సమైక్యతను కలిగిస్తున్నది. రోజురోజుకు తిరుమల వాసుని దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ ఉండడమే దీనికి తార్కాణం.

**శ్రీరామానుజుడీ గిరిపైన, శ్రీసన్నిధి శ్రీకారముంచెనట**
**శైవము వైష్ణవమిచట, నీరు పాలువలె కలసి వరలునట**

**'పిలిచితే పలుకుతావట'** అనే గేయంలో (1994) ఏడిద నాగేశ్వరరావు చెప్పిన పై పంక్తులు సమాజంలోని ప్రజాభిప్రాయాన్ని చెపుతున్నవే.**'శివుడవో మాధవుడవో'** అనే చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారి వ్యాసం (సప్తగిరి, ఫిబ్రవరి 2004) లో కనిపించే కింది విషయం కూడా గమనింపదగిందే. పరబ్రహ్మ స్వరూపుడైన భగవంతుడు శివుడా? లేక విష్ణువా? అని దేవతలకే సందేహం వచ్చిందట. ఆ సందేహానికి సమాధానంగా ముగ్గురుమూర్తులు మూడు విధాలుగా సమాధానం చెప్పారట. 'రామేశ్వరః' అనేది ఏ సమాసం? రామస్య ఈశ్వరః అని విగ్రహవాక్యం చెప్పి (రామునియొక్క ప్రభువు ఈశ్వరుడు) విష్ణువు తత్పురుష సమాసమన్నాడు. తత్పురుష కాదు బహువ్రీహి అన్నాడు శివుడు. రాముడే ఈశ్వరుడుగా కలవాడు అన్నపుడు బహువ్రీహి. 'రామేశ్వరః' తత్పురుష కాదు, బహువ్రీహి కాదు. కర్మధారయసమాస మవుతుందని బ్రహ్మ చెప్పాడు. వీరరాఘవుడు అన్నపుడు వీరుడు ఒకడు రాఘవుడు ఒకడు కాదు. వీరుడు రాఘవుడు ఒక్కడే. అలాగే రామేశ్వరు దన్నపుడు ఈశ్వరుడు, రాముడు వేరువేరు కాదు. రాముడే ఈశ్వరుడు, ఈశ్వరుడే రాముడు. రామశ్చాసౌ ఈశ్వరస్య రామేశ్వరః అనే విగ్రహవాక్యం ప్రకారం కర్మధారయ సమాసం అవుతుంది. ఈ విషయాన్ని తెలిపే శ్లోకమిది–

**విష్ణుస్తత్పురుషం బ్రూతే బహువ్రీహిం మహేశ్వరః**
**ఉభయో రప్య తృప్తానా మాత్మభూః కర్మధారయమ్**

ఆత్మభూః అంటే బ్రహ్మ. అందువల్ల **'శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః'** అని భావించడం పండితులందరూ అంగీకరించిన

విషయం. ఈ సందర్భంలో ఈ విషయాన్ని లోతుగా వ్యక్తం చేసిన అన్నమయ్య సంకీర్తనను చూడడం అవసరం.

**ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంత మాత్రమే నీవు**
**అంతరాంతరము లెంచి చూడఁబిండంతే నిప్పటి యన్నట్లు ॥పల్లవి॥**

**కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని**
**పలుకుదురు వేదాంతులు పరబ్రహ్మంబనుచు**
**తలఁతురు మిము శైవులు తగిన భక్తులును శివుఁడనుచు**
**అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁడనుచు ॥ఎంత॥**

**సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు**
**దరిశనముల మిము నానా విధులను తలఁపుల కొలఁదుల భజింతురు**
**సిరుల మిమ్ము నే యల్పబుద్ధిఁదలచిన వారికి నల్పంబవుదువు**
**గరిమల మిము నే ఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁడవు ॥ఎంత॥**

**నీవలన గొరతే లేదు మరి నీరుకొలది తామెరవు**
**ఆవల భాగీరథిదరి బావుల ఆ జలమే వూరినయట్లు**
**శ్రీవేంకటపతి నీవైతే మముఁజేకొని వున్న దైవమని**
**యీవల నీవే శరణని యెదను యిదియే పరతత్త్వము నాకు ॥ఎంత॥**

అన్నమయ్యకు శ్రీవేంకటేశ్వరుడే పరతత్త్వం. ఆ పరతత్త్వాని వైష్ణవులు విష్ణుడని, శైవులు శివుడని, కాపాలికులు భైరవుడని, శాక్తేయులు శక్తియని పిలిచారు. ఈ అంశలన్నీ సమన్వయం పొందిన పరతత్త్వం వేదాంతులు దర్శించే పరబ్రహ్మ స్వరూపం. ఆ స్వరూపమే శ్రీవేంకటేశ్వర రూపం.

కొందరు నామాలు (ఊర్ధ్వపుండ్రాలు) ధరిస్తారు. కొందరు అడ్డబొట్లు (విబూదిరేఖలు) ధరిస్తారు. నామాలతో, బొట్లతో పనిలేదు. నిండుగా భక్తి ఉన్నపుడు నిత్యమూ నామాలు, అడ్డబొట్లు పెట్టకపోయినా స్వామిని మనస్సులో నిలుపుకొన్నవాడే యోగ్యుడవుతాడు. వేంకటేశ్వరుని రూపంలో



మహేశ్వరత్వం కనిపిస్తుందని, శైవ వైష్ణవ రూపాల సమన్వయరూపంగా స్వామిని భక్తులు ఆరాధిస్తారని చింతలపాటి మోహనమురళీకృష్ణ తన సిరిమల్లెలు (వేంకటేశ్వర త్రిశతి) అనే శతకంలో అభిప్రాయపడినాడు. శ్రీనివాసుని సమన్వయ తత్త్వమీ పద్యంలో కనిపిస్తుంది.

**శివుడవు నీవు విష్ణుడవు సృష్టివిధాతవు నీవె యౌదు వు**
**ద్భవ గతి నాదిశక్తి యవతారముగా ప్రభవించి దీనులన్**
**భువి కడతేర్చుచుంటివి విభూతినొసంగి; సమస్త దేవతల్**
**భువికరుదెంచి నిన్గొలువ పుణ్యము హెచ్చెను వేంకటేశ్వరా!**

స్వామి శైవ వైష్ణవ రూపాలను వర్ణించిన మరికొన్ని పద్యాలు –

**కొందరికీశుడౌచు మరికొందరకున్ హరి వైచు నిట్టులే**
**యందరి కన్ని రూపముల నాదృతి నిల్తువు వేంకటేశ్వరా! (28వ పద్యం)**

**కొందరు బాలనీవగ కొందరు శంకరుడంచు నట్టులే**
**కొందరు విష్ణువంచు మరికొందరు శ్రీ జగదంబయంచు నిన్**
**డెందములం దలంచి ప్రకటించుచుఁదృప్తి వహింప, నీవు నా**
**యందరి కన్ని రూపముల నాత్మ స్ఫురింతువు వేంకటేశ్వరా! (34 వ పద్యం)**

(అగస్త్యరాజు సర్వేశ్వరరావు, శ్రీవేంకటేశ్వరసంస్తుతి నుండి)

శ్రీవేంకటేశ్వరుడే గాక మంగతాయారమ్మ కూడా గంగరాజు మోహనరావుకు (శ్రీమత్ అలిమేలుమంగ శతకం, ద్వితీయభాగం 2011) ఏ యే రూపాలలో కనిపించిందో కింది పద్యం వివరిస్తున్నది.

**కంచి కామాక్షి మీనాక్షి కంబుకంఠి**
**విజయవాడ నివాసియై విజయమొసగు**
**కనకదుర్గమ్మతల్లివై కానబడెడి**
**మంగపురవాసి అలిమేలుమంగ తల్లి**

(కంచి) కామాక్షిగా, (మధుర) మీనాక్షిగా, (విజయవాడ ఇంద్రకీలాద్రి) కనకదుర్గగా కనిపించడమేగాక ఆ శతకకర్తకు మరొక పద్యంలో శాంభవిగా, లలితగా, భద్రకాళిగా కూడా అమ్మ దర్శనమిచ్చింది. వేంకటాద్రిపై భక్తులనే గాక వేల్పులను కూడా కాపాడడానికి కొలువై ఉన్న తిరుమలవిభుని కొందరు భవుడంటే కొందరు శివుడంటారు. ఆ స్వామి కొందరికి జానకీధవుడుగా కనిపిస్తే మరికొందరికి గోకులకృష్ణుగా కనిపిస్తాడు. ఈ ఆలోచన బొడ్డుబోయిన వేంకటనారాయణ రచించిన శ్రీవేంకటేశ్వర శతకం (2004) లోనిది.

ఎవరు ఎలా చూస్తే స్వామి అలా కనిపిస్తాడని అనుభవజ్ఞులు చెపుతూ ఉంటారు. మరి నీవు ఎలా కనపడాలనుకొంటున్నావని కొందరు కవులు స్వామినే అడుగుతున్నారు.

**నీవే దుర్గవు భర్గవు కావా? మరి సింగములవి కనపడుటేలో?**
**కావో ఔనో తెలియని, వేవో మర్మముల దెలుపు వేంకటరమణా!**

అని వేంకటరమణ శతకం (2005) లో ఎమ్.సి.కన్నయ్య ప్రశ్న. ముదివర్తి కొండమాచార్యుల శ్రీనివాస విలాసము (2013) లోని పద్యం ఇలా ఉంది.

**భవుని గుడిలోన శక్తిదేవళములోన**
**గార్తికేయ కోవెలలోనఁగంటి నిన్నె;**
**నీకు శేషంబు విశ్వంబు; నిఖిలదేవ**
**తాంతరాత్ముండ వీవె శేషాచలేంద్ర!**

నిఖిల దేవతలలో అంతరాత్మగా భాసిల్లే పరమాత్మ శ్రీవేంకటేశ్వరుడే అనే విషయం సాధకులైన భక్తులకే అర్థమవుతుంది. సామాన్యులు స్వామి భౌతిక రూపాన్ని మాత్రమే చూచి ఆనందిస్తారు. అంతర్యామి రూపాన్ని దర్శించడానికి జన్మజన్మల భక్తి అవసరమవుతుంది.

* * *

# బీబీనాంచారు వృత్తాంతం

పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవం ఎందరో కవులకు ప్రేరణను కలిగించింది. ఆ కల్యాణం తమ కండ్లముందు జరుగుతున్నట్లుగా ఊహించి, వర్ణించి కల్యాణవైభవ అనుభవాన్ని మదిలో నింపుకొని ఆనందించే గేయకవులు, శతక కవులు ఎందరో కనిపిస్తారు. **'మధురోహలను గూడి – మాధవుడు శ్రీధరుడు మంగమ్మ మెడలోన – మాంగల్యమును గట్టె'** అని స్వామివారి కల్యాణాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నట్లు తన **'అంతరంగ నివేదనం'** లో ఒక గేయకర్త భావించడం కనిపిస్తుంది. ఇలా చాలమంది కవులు అలమేలుమంగా తిరుమల విభుల కల్యాణాన్ని, ప్రణయానుబంధాన్ని తమ కవితలలో పొందుపరిచారు. దేవేరులతో కూడిన స్వామిని దర్శిస్తే సకల సంకటాలు తొలగి శుభపరంపరలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. తిరుమలగుడిలో ప్రతిరోజూ కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. లోకకల్యాణం కోసం స్వామివారి కల్యాణం జరుగుతుందని చెపుతారు. ఉభయదేవేరులతో స్వామివారికి జరిగే కల్యాణం ఒక అపురూప దృశ్యం. **'రోజూ పెళ్లిమీద పెళ్లి చేసుకొని నిత్యపెళ్లి కొడుకయి నిగనిగలాడే స్వామి'**అన్నాడొక గేయకర్త. కల్యాణోత్సవాలను చూచినపుడు స్ఫురించిన అంశమే ఇది. భక్తులందరు దేవుని కల్యాణాన్ని తమ ఇండ్లలో జరిగే కల్యాణంగా భావిస్తారు.

పెంచి పెద్ద చేసిన యశోద శ్రీకృష్ణునికి పెళ్లి చేయలేకపోయింది. ఆమె దానినొక కొరతగా భావించి విచారపడింది. కలియుగంలో శ్రీనివాసుడుగా తిరుమలలో ఉంటున్న సమయంలో ఆమె చేతి మీదుగానే తన వివాహం జరుగుతుందని అమ్మకు శ్రీకృష్ణుడు వరం అనుగ్రహించాడు. ఆ వరం ప్రకారం ఆమె వకుళమాతగా వచ్చి పద్మావతీ శ్రీనివాసులు వివాహం జరిపించినట్లు ఒక కథ ప్రచారంలో ఉంది. స్వామి ఆలయంలోని 'పోటు' దారిలోనే తూర్పుముఖంగా కొలువై ఉన్న దేవత వకుళమాత అని భక్తుల విశ్వాసం. ఈ కథకు గ్రంథస్థాధారాల కంటె భక్తులలో ఉన్న ప్రచారమే బలమైన ఆధారంగా ఉంది. శ్రీవారి కల్యాణోత్సవ సందర్భంలో వకుళమాత

విషయాన్ని కవులు ప్రస్తావించారు. అయితే ఆలయంలోని 'పోటు' సమీపంలో కనిపిస్తూ వకుళమాతగా పూజలందుకొంటున్న విగ్రహం వకుళమాత కాదని, సాక్షాత్తూ శ్రీవారి దేవేరి యైన అలమేలుమంగమ్మేనని కొందరు భావిస్తున్నారు. పద్మావతీ శ్రీనివాసులకల్యాణం తరువాత వకుళమాత ఒక పుష్పమాలగా మారి స్వామి మెడలో చేరిందని కూడా ఆ కథలోని అంశమే. ఈ విషయాన్ని స్ఫురింపజేస్తూ అగస్త్యరాజు సర్వేశ్వరరావు తన రచన 'వేంకటేశ్వరసంస్తుతి'ని **'వకుళాఖ్య సుపుష్పమాల'** గా గ్రహించి ఆశీర్వదించమని శ్రీనివాసుని వేడుకొన్నాడు.

స్వామివారికి వనితలంటే వ్యామోహమెందుకో చెప్పమని అడిగే ఈ పద్యం ముదివర్తి కొండమాచార్యులవారిది.

**పారువేటలన్న పాచికలన్నను**
**వడ్డికాసులన్న వనితలన్న**
**నిలువుదోపులన్న నీకేల వ్యామోహ**
**మెరుగజెప్పవయ్య తిరుపతయ్య?**

స్వామి ఒక మహమ్మదీయ వనితను వివాహమాడాడని ప్రచారం ఉంది. ఆమెకు స్వామి ఒక సంతోషాన్ని కలిగించి ఏలుకొన్నాడని భక్తులు చెపుతూ ఉంటారు. ఆమెను వివాహం చేసుకొన్న తరువాత కొండకు వస్తున్న వాళ్లంతా హిందువులుగానే ఉండడం, మహమ్మదీయులు రాకపోవడం గమనించిందామె. తమ వాళ్లను ఎందుకు అనుమతించలేదని బాధపడగా ఆమెను ఓదార్చడానికి స్వామి 'కొండకు వచ్చే వాళ్లందరూ మా వాళ్లు, కొండనుండి వెళ్లే వాళ్లందరూ మీవాళ్లు' అని చెప్పగా ఆమెకు సంతోషం కలిగిందట. వెళ్లేవాళ్లందరూ శిరోముండనం చేయించుకొని వెళతారు. సాధారణంగా మహమ్మదీయులు తలవెంట్రుకలు తొలగించుకొని కనిపిస్తారు. తలనీలాలు సమర్పించి వెళ్లే భక్తులందరూ బోడిగుండులవారే కాబట్టి వాళ్లను మహమ్మదీయులుగా అంటే తనవాళ్లనుగా భావించుకొమ్మని ఆమెకు చెప్పి సంతోషం కలిగించాడని భక్తులలో ఒక విశ్వాసం ఉంది. ఈ విషయాన్ని చాలమంది కవులు ప్రస్తావించారు.



**'ఏకాంతసేవ'** అనే గేయంలో అలమేలు మంగమ్మ నిన్నలరించేనా? బీబీనాంచారమ్మ బింకము చూపేనా? అంటూ సుందరవల్లి శ్రీదేవి శ్రీనివాసుని అడుగుతున్నది. నీకు రోజూ పెళ్లా? అలమేలుమంగమ్మను దూరంగా (తిరుచానూరులో) ఉంచి బీబీనాంచారిని పెళ్లాడినావా? అంటూ మరొక గేయకర్త (ఆవుల రామచంద్రయ్య)

**అమాయకపు వనిత అలిమేలమ్మను**
**అల్లంతదూరాన వుండమనిచెప్పి**
**బీబీనాంచారిని బిరబిరా పెండ్లాడె! అమ్మో!**
**రోజురోజు పెళ్లి మీద పెళ్లి చేసుకొని**
**నిత్యపెళ్లికొడుకయి నిగనిగలాడె సామి**

అన్నాడు. వేంకటరమణ శతకంలో కన్నయ్య వేంకటరమణుని 'బిబ్బీనాంచారి మగడు' గా చెప్పాడు. మైలవరపు సుబ్బరాయశాస్త్రి తన వేంకటేశ్వర శతకంలో భూదేవినే బీబీనాంచారిగా అభిప్రాయపడినాడు.

**నీవల విష్ణుదేవుడవు, నీరజలోచన లక్ష్మితాను ప**
**ద్మావతి, బీబినాంచరి క్షమాపతి, స్వర్గము సప్తశృంగమౌ**
**గ్రావముగా భువిన్ వెలసి రక్షణ జేసెడి నీ కొనర్తు వే**
**సేవ ధరాధరాలయ! విశేష కృపామయ! వేంకటేశ్వరా!**

బీబీనాంచారిని వివాహమాడిన తరువాత శ్రీవేంకటేశ్వరునికి మహమ్మదీయులు కూడా భక్తులైనారని కొందరు అభిప్రాయపడుతున్నారు. కోటీశ్వరరావుగారి పద్యమిది –

**మలకు పాదుషా పంగనామాలవాడు**
**వృజిన జంతు సంతానంపు వేటకాని**
**ఫాలపుండ్రపు పచ్చ కప్రంపు తావి**
**గుబులు కొనుగాత హృత్పద్మ కుహరమందు**

మల అంటే కొండ. మలకు పాదుషా అంటే లోకానికంతటికీ ప్రభువు. పాదుషా అనేది ఉర్దూ శబ్దం. ఈ మాటవల్ల మహమ్మదీయులు కూడా

స్వామి భక్తులైనారనే అభిప్రాయం కలుగుతూ ఉంది. మహమ్మదీయులు భక్తులైనారనుకొంటే ఈ పద్యంలోముస్లింవనితనుస్వామి పెండ్లిచేసుకొన్నాడనే విషయం సూచన మాత్రంగా కనిపిస్తుంది.

బీబీనాంచారి కథకు ఆధారం ఎక్కడా లేదు. ప్రచారంలో మాత్రం ఉంది. బాగా ప్రచారమైన తరువాత దీనికొక కథ కల్పింపబడింది. బీబీనాంచారమ్మ ఢిల్లీ సుల్తాన్ కుమార్తె. తురుష్కులు దక్షిణ దేశంపై దండయాత్ర చేశారు. ముఖ్యంగా దేవాలయాలలో ధనం, బంగారం దాచిపెట్టి ఉంటారని, దేవాలయాలను కొల్లగొట్టి సంపదను దోచుకోవాలని ప్రయత్నించారు. దేవాలయాలలో విగ్రహాలను కూడా అపహరించేవారు. తిరునారాయణపురం (మేల్కొటే, కర్ణాటక) లోని తిరునారాయణస్వామి ఉత్సవ విగ్రహమైన సంపత్కుమారస్వామి మూర్తిని అపహరించి ఢిల్లీకి తీసుకొనిపోయారు. ఆ విగ్రహ సౌందర్యానికి ముగ్ధురాలైన బీబీనాంచారి అంతఃపురంలో ఆ విగ్రహాన్ని తన దగ్గరే ఉంచుకొన్నది. తరువాత కొంతకాలానికి భగవద్రామానుజాచార్యులు ఢిల్లీకి పోయి సుల్తానును ఒప్పించి సంపత్కుమారస్వామి మూర్తిని తీసుకొని తిరునారాయణపురానికి బయలు దేరారు. ఆ స్వామి మూర్తిని గాఢంగా ప్రేమించిన బీబీనాంచారి రామానుజులతో పాటు తిరునారాయణపురం చేరింది. అక్కడ ప్రతిష్ఠించిన మూర్తిని విడిచి వెళ్లలేక ఆమె అక్కడే ఉండి కొన్నాళ్లకు ఆ స్వామిలో ఐక్యమైంది. ఈ విధంగా గోదాదేవివలె స్వామిని ప్రేమించి తద్దైక్యం పొందిన బీబీనాంచారి విగ్రహం తయారు చేయించి రామానుజులు శ్రీరంగంలో ప్రతిష్ఠింపజేశారు. ఇప్పటికీ ఆమె విగ్రహానికి అక్కడ పూజాది కైంకర్యాలు జరుపబడుతున్నాయి. స్థూలంగా ఇదీ కథ.

తిరుపతి గోవిందరాజస్వామివారి దేవాలయంలో ఉన్న ఆండాళ్‌ను బీబీనాంచారని పిలుస్తారట. ఆ విగ్రహం ఆండాళే నని, నాంచారు కాదని కూడా కొందరు చెపుతారు. నాంచారు అంటే ఒక దేవత, ఒక వైష్ణవ దేవత అనే అర్థాలున్నాయి. శ్రీమహాలక్ష్మిని కూడా నాంచారనడం ఉందట. ఒక కవి బీబీనాంచారును 'క్షమాసతి' అన్నాడు. క్షమాసతి అంటే భూదేవి.

# భక్తుల ఆస్తిక నాస్తికత్వాలు

దేవుడున్నాడు అని నమ్మేవాళ్లు ఆస్తికులు. లేడనే వాళ్లు నాస్తికులు. సందర్భాన్ని బట్టి ఆశించినవి ఫలించడం ఫలించక పోవడం అనే వాటిననుసరించి కొందరు వ్యక్తులలో ఆస్తికత్వమూ ఉంటుంది, నాస్తికత్వమూ ఉంటుంది. ఇలాంటి వాళ్లు కూడా ఎక్కువమందే ఉంటారు. దేవాలయాలకు వేళ్లే వాళ్లందరూ ఆస్తికులే కానక్కర లేదు. దేవాలయాలకు వెళ్లడానికి వాళ్లకు కారణాలు అనేకం ఉంటాయి. దేవాలయాలకు వెళ్లని వాళ్లందరూ నాస్తికులూ కారు. దేవుడు, దేవత, భక్తి మొదలైనవి మానసిక భావాలు. దైవత్వాన్ని మనస్సులో భావిస్తూ, మానసిక తపస్సు చేసేవాళ్లు కూడా ఆస్తికులే. కవులందరూ తమ రచనలలో ఆస్తిక భావాలను ప్రకటించిన వారే. అయితే కొందరు మొదట సందేహాస్పదమైన మనస్సుతో తమ రచనలను ప్రారంభించి చివరకు పూర్తి విశ్వాసాన్ని ప్రకటిస్తూ రచనలను ముగించడం కనిపిస్తున్నది. 'కలదు కలండనెడువాడు కలడో లేడో' అంటూ భాగవతంలో గజేంద్రుడు సందేహించినట్లు గొప్ప భక్తులకు కూడా ఒక్కోసారి దేవుడు ఉన్నాడా? లేడా? అనే సందేహం కలుగుతూ ఉంటుంది. ఈ సందేహం తాత్కాలికమైనదే. అది ఆ క్షణంలో కలిగిన సందేహమే. ఈ విషయానికి సంబంధించి కవుల అభిప్రాయాలను పరిశీలిస్తే అవన్నీ సమాజంలోని వ్యక్తుల నమ్మకాలనే ప్రతిబింబిస్తున్నట్లు అర్థమవుతుంది. కవిత్వంలో ఆయా కవుల స్వానుభవాలతో పాటు సామాజికాంశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. శిఖామణి రచించిన **'జీవనమురళి'** అనే గేయాన్ని (సప్తగిరి, ఏప్రెల్ 1991) పరిశీలిస్తే కవి అనుభవంతోపాటు సమాజంలోని అనేకుల అభిప్రాయాలు ఇలాగే ఉంటాయని అనిపించకపోదు.

**ఇన్నాళ్లు నిన్ను తెలుసుకోలేక**
**ఎన్నో శుష్కవాదోపవాదాలు చేశాను**
**నన్ను నేను తెలుసుకోలేనితనంలో**

**నిన్ను నేను కోల్పోయాను**
**నవరంధ్రాలతో చేయబడిన ఈ దేహమురళి**
**నువ్వు ఊదితే మ్రోగుతుందని**
**నీ చేతి వేళ్ల లయ విన్యాసంపై**
**ఆధారపడి మనుగడ సాగిస్తుందని**
**తెలుసుకోలేకపోయాను**
**నువ్వు విశ్రమిస్తే ఈ మురళి మూలపడిపోయింది**
**మధురగానం చేసిన ఈ రంధ్రాలు**
**ధూళితో పూడుకుపోయాయి**

ఈ గేయంలో మానవుడి మనస్సు ఊగిసలాడడం కనిపిస్తున్నది. దేవుని గురించి తెలుసుకోలేకపోవడం, ఉన్నాడో లేడో అంటూ వాదోపవాదాలు చేయడం వల్ల మానసిక మురళి పలకకుండా పోతున్నదని చెప్పడం కవి స్వానుభవమే కాదు లోకంలోని అనేకుల అనుభవం కూడా.

ఆస్తికులుగా ఉంటూ దేవుని కొలిచే వాళ్లకు మనస్సు ప్రశాంత మవుతుంది. ఆస్తికులై శాంతి అహింసలను పాటించే వాళ్లకు జీవితంలో పారమార్థిక దశను పొందే అవకాశం కలుగుతుంది. దేవుని స్వచ్ఛమైన భక్తితో కొలిచేవాళ్లకు ఆ దేవునిలో ఇతర దేవతాంశాలు కనిపించినా భగవంతుని సమన్వయ రూపంగానే భావించి పూజిస్తారు.

**అన్నీ నీవు కావా? సంకుచిత భావాలేల?**
**ఏ పేరుతో యే మతముతో కట్టి పడేయగలరీ దౌర్భాగ్యులు?**
**దేశానికి పట్టిన దౌర్భాగ్యమా మతం?**
**బీబీనాంచారి నీలో ఐక్యం కాలేదా వేంకటపతీ! ఎవరడ్డు పడిరి?**

పై పంక్తులలో ఆవుల రామచంద్రయ్య వేంకటపతే సమగ్ర దేవతామూర్తి అని ప్రకటించాడు. మతం పేరుతో సంకుచిత భావాలను ప్రేరేపించే వాళ్లు దౌర్భాగ్యులట. సృష్టిలో అంతటా నీవేనంటూ కాకర్ల శ్రీరామమూర్తి వేంకటేశ్వర తత్త్వాన్ని కింది పద్యంలో ఆవిష్కరించాడు.



**క్షీరమునందు వెన్నయును, శీతకరాంశుని యందు జ్యోత్స్నయున్**
**ధారుణియందు వోషధియు, ధైర్యము శూరుల చిత్తవృత్తులన్**
**సారము వేదధర్మముల, సత్త్వము తత్త్వము లెల్ల నీవె, సా**
**కారుడవై గిరిన్ వెలసి కడ్మిని జూపితె వేంకటేశ్వరా!**

పాలలోని వెన్న, చంద్రునిలోని వెన్నెల, భూమిలో ప్రభవించిన ఓషధి, శూరుల మానసాలలోని ధైర్యం, వేదధర్మాలసారం, సత్త్వమూ, తత్త్వమూ అయిన పరమాత్మ సాకారుడుగా తిరుమలకొండపై వెలసిన వేంకటేశ్వరుడే. ఆ స్వామి చరణాలే సకలజీవులకు మోక్షపథగాములు.

**'శ్రీచరణశరణాగతి'** అనే గ్రంథంలో (2012) రావికంటి వసునందన్ అలాంటి స్వామి చరణాలపై తనకు గల భక్తిని ఇలా ప్రకటించాడు.

**ఏ చరణంబుల్ శ్రుతులు నెంతయు ప్రాప్యములంచు దెల్పెనో**
**ఏ చరణంబు లీవు నరునింద్రజు నాశ్రయమొంద జెప్పితో**
**ఏ చరణంబుల్ మరల నిందరగావగ నిందు జూపితో**
**ఆ చరణంబు లాత్మ తరణార్థము నిత్యము నాశ్రయించెదన్**

**(985వ పద్యం)**

శ్రుతులకు ప్రాప్యమైన, ఇంద్రజుడైన అర్జునుడు ఆశ్రయించిన ఆ చరణాలను తిరుమలవాసుడు భక్తులకు తన వరదహస్తంతో చూపుతున్నాడు.

వృష అంటే ధర్మం. ఆ పేరుతో ఉన్న వృషాద్రి మీద అధివశించి దుర్విషయాలను రూపుమాపి సంస్కృతీసంప్రదాయాలను నిలిపే సద్విషయ విస్తరదాయిలైన నీ పాదాలు నా వర్తనలోని వంకరలను తొలిగించు గాక అని వసునందన్ తన అస్తిత్వభావాన్ని వివరించాడు.

**కలియుగంబున ఖలులను కాలరాచి**
**ఆశ్రిత జనుల కాపాడి యాదరించు**
**వేంకటరమణుడొక్కడే విశ్వమయుడు**
**వేంకటాద్రీశ! శ్రీశ! శ్రీవేంకటేశ**

అంటూ బి. రామాచారి తన శ్రీవేంకటాద్రీశ శతకం (2013) లో స్వామి విశ్వమయత్వం మీద తన విశ్వాసాన్ని వెల్లడించాడు. దేవుడు ఉన్నాడో లేడో అనే సందేహానికి తావు లేకుండా స్వామీ! నీవు కొండపైన నిలిచి ఉన్నావని ముదివర్తి కొండమాచార్యులు తమ శ్రీనివాస విలాసంలో ఇలా అన్నారు.

**కలఁడు కలండను నాతఁడు, కలఁడో లేఁడో యటంచు గజబుద్ధులు శం**
**కిలకుండ వేంగడమ్మున, నిలిచిన శ్రీ శ్రీనివాస నీకు నమస్సుల్**

తిరుమలకు వచ్చే యాత్రికులందరూ భక్తితో శ్రీనివాసుని పూజించడానికే వస్తున్నారా? అని కొందరు ప్రశ్నిస్తారు. దీనికి సమాధానం చెప్పడం కష్టమే. ఎంత ఆధునిక కాలమైనా, అంతర్జాలంతో ప్రపంచంలోని విశేషాలనన్నిటినీ చిటికలో తెలుసుకొంటున్నా, కట్టుబొట్టులలో ఆచారవ్యవహారాలలో అత్యాధునిక మార్పులు చోటుచేసుకొంటున్నా పండుగపబ్బాలొస్తే చాలు చిన్న దేవాలయం పెద్ద దేవాలయం అనే భేదం లేకుండా ప్రతి దేవాలయం లోనూ ప్రాంగణాలు పట్టనంతగా మనుషులు (భక్తులు) కనిపిస్తున్నారు. ఓపికతో 'క్యూలైన్ల' లో గంటల తరబడి నిలబడి ఆయా దేవతల దర్శనం చేసుకొంటున్నారు. ఈ జనంలో ఆస్తికులూ ఉన్నారు, దైవభక్తి అంతగా లేనివారూ ఉన్నారు. కొందరు తమ పొరుగువారు, తెలిసిన వారు దేవాలయాలకు వెళుతూ ఉంటే తాము వెళ్లకపోతే బాగుండదని వెళ్లడమూ కనిపిస్తున్నది. మరి కొందరైతే దేవాలయ ప్రాంతాలకు వెళ్లి దైవదర్శనంతో పాటు సరదాగా అందరితో కలసిమెలసి తిరిగి రావాలనుకోవడమూ ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే అందరితోపాటు మనంకూడా వెళ్లాలి అనుకొనే



మనస్తత్వమే చాలమందిలో ఉంటుంది. అనేక కారణాలవల్ల ఏర్పడే భయాందోళలనలను పోగొట్టుకోవడానికి కొందరు దేవాలయాలకు వెళ్లి భక్తి ప్రపత్తులు అలవరచుకొంటారు. తాము అనుకొన్నది నెరవేరితే దేవాలయానికి వచ్చి మొక్కు చెల్లించుకొంటామని కొందరు మొక్కుకుంటారు. జబ్బులు నయమైతే, ఉద్యోగాలొస్తే, పరీక్షలలో కృతార్థులైతే, ఇండ్లు కట్టుకోగలిగితే, వస్తు వాహనాలు సమకూర్చుకోగలిగితే, అమ్మాయికి వివాహమైతే, ఆస్తి తగాదాలు పరిష్కారమైతే దేవాలయాలలో మొక్కులు చెల్లించుకుంటామనే వాళ్లు అనేకులు. ఇలాంటి కోరికలు తీరిన తరువాత వాళ్ల భక్తి అంతటితో తాత్కాలికంగా ఆగిపోతుంది. అవసరాల కోసం భక్తులు వీళ్లు. మేడవరం వేంకటనారాయణశర్మ శతకంలోని కింది పద్యం (109). ఈ విషయాన్నే తేటతెల్లం చేస్తున్నది.

**భోగి శయన! నిన్నెపుడు భోగులు జోగులు రోగులున్ మదో**
**ద్వేగులు వచ్చి గుంపులో ప్రీతిని సేవలు చేయుచుండుటన్**
**బాగుగ యోచనన్ సలుప భక్తి కతంబునగాదు, వారి కా**
**యాగతి నాప్తతన్ మెలగి యక్కర దీర్చుటె వేంకటేశ్వరా!**

శ్రీనివాసుని దర్శించడానికి వచ్చిన వాళ్లందరూ భక్తితోకాక వారి అక్కరలు తీర్చుకోవడానికే భక్తులుగా నటిస్తున్నారని శర్మగారు పై పద్యంలో చెప్పడం ఇప్పటి సమాజదృష్టితో కొంత సహజంగానే ఉంది.

ప్రస్తుతం ఓట్లు దండుకొని గద్దెలెక్కే రాజకీయనాయకులలో భక్తి అధికంగా కనిపిస్తున్నది. మెడలో వివిధ రకాల పూసల దండలతో, ముఖం మీద పెద్ద నిలువు కుంకుమ బొట్లతో, పట్టుపంచలతో తిరుమలేశుని దర్శనం కోసం వచ్చే ఎందరో రాజకీయనాయకులు తిరుమలలో తారసపడుతూనే ఉంటారు. రాజకీయాలను వ్యాపారంగా మార్చుకొని లాభాలు ఆర్జించే ఇలాంటి నాయకులు తమ రాజకీయ వ్యాపారం ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగాలని, పెద్ద పెద్ద రాజకీయపు గద్దెలను అధిరోహించాలని కంటున్న

కలలు నిజం కావాలని స్వామిని కోరడానికి దర్శనానికి వస్తున్నారు. తమ కోరికలు నెరవేరితే స్వామికి ఏదో కొంత సమర్పణ కూడా చేస్తున్నారు. ఎం.ఎల్.ఏ గా తన నియోజకవర్గ పరిధిలోని ప్రజలను, మంత్రిగా తన రాష్ట్రంలోని ప్రజలను రక్షించి వాళ్లకు అభ్యుదయం కలిగించమని స్వామిని వేడుకొనే నాయకులు ఉన్నారా? ఇలాంటి స్థితిని వివరించే కింది పద్యం నారాయణశర్మగారిది (239 వ పద్యం).

**కొందరు చోరనాయకులు, కొందరు త్రాగుడు నాయకుల్ ప్రభూ!**
**కొందరు జారనాయకులు, కొందరు బొజ్జవినాయకుల్, సరే!**
**కొందరు రూట్లనాయకులు, కొందరు చేతులనెత్తు నాయకుల్**
**చిందరవందరై చెడగ జేసిరి పాలన వేంకటేశ్వరా!**

రూట్ల నాయకులు అంటే ప్రైవేటుగా తమ వాహనాలను నడుపుకొని చేతులనిండా ఆర్జించడానికి బస్సుమార్గాలను అడిగేవాళ్లు. ప్రజల ఓట్ల బలంతో పదవులు సంపాదించి, ఏవేవో చేసి ప్రజాసేవలో తరిస్తామని వాగ్దానాలు చేసి చివరకు ప్రజల ముఖం కూడా చూడకుండా స్వప్రయోజనాల కోసం అడ్డదారులు తొక్కుతూ ముఖం చాటేసేవాళ్లు చేతులు ఎత్తివేసే నాయకులు. గెలిచి వెళ్లిన కొన్ని సంవత్సరాలకు కూడా నియోజక వర్గ ప్రజలకు కనపడని రాజకీయ మేధావులూ ఉన్నారు. మా నాయకుడు కనిపించడం లేదని, తప్పిపోయాడని, కనిపిస్తే ఆచూకీ తెలపమని ప్రజలు పిర్యాదులు చేయడం అందరి అనుభవంలోని విషయమే. ఇలాంటి నాయకులను దేవుడు కాపాడి వరాలు ఇవ్వాలా?

ఇలాంటి నాయకులు, వీళ్లలాంటి కొందరు సంపన్నులు నిజంగా నిన్ను అర్చించడానికి వచ్చిన భక్తులేనా? అని శతక కర్త స్వామిని అడుగుతున్నాడు. నిజంగా నిన్ను పూజించడానికి దూరదేశాలనుండి వచ్చే భక్తులకు బాధలు కలిగిస్తున్నావు. దేవుడు-దెయ్యం, రాళ్లూ-రప్పలూ అని పలికే వాళ్లకు వైభవాలు కట్టబెడుతున్నావు. నీ మహిమను తెలుసుకోవడం కష్టమేనని



(274 వ పద్యం), తెలుసుకొనే ప్రజ్ఞనివ్వమని కవి వేడుకొన్నాడు. నీవు ఉన్నావో లేవో అనే సందేహం ఉండికూడా కొందరు గుడికి వస్తున్నారు. అలాంటి వాళ్లు భగవత్తత్త్వం తెలియని వాళ్లు. ఉన్నావని నమ్మేవాళ్లలోనే నీవు ఉంటావని దండోళ్ల సుబ్రహ్మణ్యం తన బాలాజీ శతకం (2011) లో ఇలా అన్నాడు.

**ఉన్నావో లేవో యని, యన్నట్టి నరులకు నీదు యునికి దెలియునా**
**ఉన్నావని నమ్మినచో, ఉన్నావయ వారిలోనే ఓ బాలాజీ!**

స్వామీ! నిన్నుగురించి తెలియని వాళ్లు ఏమి మాట్లాడినా కోపించక వాళ్లను క్షమించు. నిన్ను తెలుసుకోవాలనే కోరిక వాళ్లలో కలికగించు. నాస్తి నాస్తి అనుకొంటే ఏమీ మిగలదు. అస్తి అస్తి అనుకొంటేనే నీ అస్తిత్వం నిలబడు తుందని స్ఫురింపజేయి. ఈ విషయాలను తన శ్రీనివాస శతకంలో (1983) కొంగే సుధాకరరావు చెపుతూ ఇలా కూడా ప్రకటించాడు.

**తెలివిలేక నిన్ను తెగడును మూర్ఖుడు**
**తగిన ఫలము పిదప తానె పొందు**
**తెలియువారు నిన్ను కొలుతురు భక్తితో**
**శ్రీనివాస సకల శ్రిత జనేశ!**

గొల్లవాడవు, గోపాలకుడవు అని నిందించిన నీ వైరిగణానికి కూడా సద్గతి కలిగించావు. ఇక ఇప్పటి మానవులమైన మేము నిన్ను విస్మరించినా మమ్మల్ని కాపాడుమని వేడుకొంటూ శతక కర్త ఇలా ప్రార్థించాడు.

**గొల్లవాడి వీవు గోపాలకుడవు**
**నరపశువుల రక్షణమ్ము సేయు**
**మాదు మదమణంచి మంగళ మిమ్మయా**
**శ్రీనివాస సకల శ్రితజనేశ!**

* * *

## వడ్డికాసులవాడు

ఆపదమొక్కులవాడు, అడుగడుగు దండాలవాడు, వడ్డికాసులవాడు అని భక్తులు వేంకటేశ్వరస్వామిని పిలుచుకొంటారు. ఏమైనా ఆపదలు కలిగినపుడు స్వామికి మొక్కుకొని ముడుపులు కట్టుకోవడం భక్తలోకంలో ఇప్పటికీ ఉంది. కొంత డబ్బు (నాణాల రూపంలో) పసుపు నీళ్లలో తడిపి ఆరవేసి తడి ఆరిపోయిన బట్టలో మూటగా కట్టి ఇంట్లో పూజించే దేవుని దగ్గర పెట్టుకొంటారు. ఆపదలు తొలగిన తరువాత కొండకు వెళ్లి స్వామిని దర్శించుకొని డబ్బును కట్టిన మూటను (ముడుపును) హుండీలో సమర్పిస్తారు. ఆపదలు తొలగించమని దేవుడికి మొక్కుకొని తరువాత కొండకు వచ్చి నేరుగా మొక్కుతారు. ఆపదలు తొలగించినందుకు భక్తి ప్రపత్తులతో కట్టుకొన్న ముడుపుతో పాటు మరికొన్ని కానుకలు సమర్పించు కొంటారు. ఆ రకంగా శ్రీనివాసుడు ఆపద మొక్కులవాడు. కొండ ఎక్కడం మొదలు పెట్టినప్పటినుండి ప్రతి అడుగుకు గోవిందా! గోవిందా!! అంటూ, రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ (దణ్ణం పెడుతూ) భక్తులు స్వామి దర్శనానికి వెళతారు. అడుగడుగునా భక్తుల దండాలను గ్రహించేవాడు కాబట్టి స్వామి అడుగడుగుదండాలవాడుగా కీర్తింపబడినాడు. హుండీలో ఇంత సమర్పిస్తామని మొక్కుకొని అనుకొన్న సమయంలో కొండకు వెళ్లలేక పోతారు కొందరు. తరువాత ఎప్పుడో వెళ్లడానికి సమయం కుదురుతుంది. అపరాధరుసుంగా కొంత చేర్చి, సమర్పిస్తామని చెప్పిన ధనం తీసుకెళ్లి హుండీలో వేస్తారు. అపరాధ రుసుమే వడ్డి. ఇస్తామన్న ధనం ఇవ్వక పోవడం, ఇచ్చినప్పుడు వడ్డీ కలిపి ఇవ్వక పోవడం కారణంగా ఆపదలు మళ్లీ వస్తాయనే అనుమానం కొందరిలో ఉంది. ఇది జానపదుల ఆలోచనలలోని విషయం.

వడ్డికాసులవాడు అనడానికి కారణం మరోవిధంగా కూడా కొందరు చెపుతారు. శ్రీనివాసుడు పద్మావతిని వివాహమాడిన సందర్భంలో వివాహ నిర్వహణ కోసం కుబేరుని దగ్గర అప్పు తీసుకొన్నాడట. ఆ అప్పును వడ్డీతో కలిపి కలియుగాంతం వరకు తీర్చవలసి ఉందట. అందువల్ల హుండీలో సమర్పింపబడిన ధనం కుబేరుని అప్పుకు చెల్లు అవుతున్నదని భక్తుల విశ్వాసం. భక్తులనుండి వడ్డీ వసూలు చేసేవాడు, కుబేరునికి వడ్డీ కట్టేవాడు కావడం వల్ల శ్రీనివాసుడు వడ్డికాసులవాడుగా భక్తులచే కీర్తింపబడుతున్నాడు. ఈ అభిప్రాయాలు లోకంలో ప్రచారంలో ఉన్నవే. ఇప్పటి కవుల రచనలలో కూడా వడ్డికాసుల విషయం బాగానే ప్రస్తావించబడింది. మల్లాది పద్మావతి పద్మావతమ్మను పరిణయమాడడానికి అప్పు చేసినావని చెపుతూ ఇలా చెప్పింది.

**వడ్డీ కుబేరునకు –వరద! కట్టుతునుంటివి**
**కలియుగాంతం వరకు – కట్టుచు వడ్డీని**
**గడుపుచుంటివా – గరుడాద్రివాసా**
**వడ్డికాసులవాడవైతి – వాచామగోచర**

**'పిలిచితే పలుకుతావు'** అనే మహిమ గల దేవదేవుడవైన వేంకటేశ్వరా! నీ బీద భక్తులు అసలే ఇవ్వలేనపుడు వడ్డి కలిపి ఎలా ఇవ్వగలరు? అంటూ ఏడిద కామేశ్వరరావు

**వడ్డికాసులవాడవట – వడ్డివడ్డి గుంజుదువట**
**అసలు లేనివారమయ్య – వెతలుబాపి కావవయ్య**

అని స్వామిని ప్రార్థించాడు. వడ్డికాసులు గ్రహించినా, గ్రహించిన దానికి ఇబ్బడిముబ్బడిగా ప్రసాదిస్తాడని కూడా భక్తుల నమ్మకం. 'వడ్డికాసుల గూర్చు వ్యాపారమది యేమి, మేలు పెంపొందించు లీల యొక్కొ' అని ఒక కవి భావించాడు. వడ్డీ కట్టే వాళ్లలో

**సిరిని పోగొట్టుకొని – వైకుంఠము వదలి**
**అప్పులు చేసి పెండ్లాడి – వడ్డీలు కట్టే వెంకటేశుని**

మించిన వాళ్లు లేరంటున్నాడు మరొక కవి. 'వడ్డికాసుల దొరవు వడ్డీ తీసుకొంటావు. అసలును అలాగే ఉంచి ముక్తినిస్తావు. వేదమే రూపుదాల్చిన వేల్పుకొండవు' అని వేరొక కవి స్వామి తత్త్వాన్ని గుర్తు చేస్తున్నాడు.

స్వామి తన వివాహానికి కుబేరుని దగ్గర అప్పు తీసుకొన్నాడని, ఇప్పటికీ ఆ ధనం వడ్డీతో కలిపి చెల్లిస్తున్నాడని, దానికోసమే భక్తులు సమర్పించే వడ్డికాసులు ఉపయోగపడుతున్నాయని చెప్పే కథ కల్పితమని అగస్త్య రాజు సర్వేశ్వరరావు చెపుతున్నాడు. ఆయన అభిప్రాయం కింది పద్యం.

**అల్పమె నీకు శ్వశురగృహమందు లభించిన ద్రవ్యరాసులున్**
**కల్పనమే గదా ఋణము గైకొని నీవు వివాహమాడుటల్**
**కల్పిత గాథ లిట్టివని కాంచితి, నీ వ హో శ్రీనివాసుడై**
**యల్పుల గోరినాడవని నచ్చెరువయ్యెడు వేంకటేశ్వరా!**

వేంకటేశ్వరస్వామికి మామగారింట అంటే క్షీరాబ్ధిలో లభించిన ద్రవ్యరాశి అల్పం కాదు. ఆయన దేవేరి ఆదిలక్ష్మి క్షీరాబ్దినుండే ప్రభవించింది. ఆమె సర్వ సంపదల ప్రదాత. ఆమె స్వామికి అనపాయినిగా వక్షం మీదనే కొలువై ఉండగా ఆయనకు ద్రవ్యలోటు ఉంటుందా! ఇది కల్పిత కథ కాకపోతే శ్రీనివాసుడు భక్తుల నుండి ధనం గ్రహించడమేమిటి? ధనం ఒక్కటే కాకుండా భక్తులు బంగారు వెండి అపరిమితంగా కానుక చేస్తున్నారు. వజ్రవైడూర్యాలు, మణులు మాణిక్యాలు సమర్పించి స్వామి కృపకు పాత్రులవుతున్నారు. ఇవన్నీ మీకు అవసరమా అని ఎమ్.సి. కన్నయ్య తన శతకంలో ప్రశ్నిస్తున్నాడు.

**కొండలరాయుడ నీవే, కొండల రారాణి తల్లి కూరిమి సఖియే**
**బండల మనుజులు మీకీ, వెండీ బంగారు లేల వేంకటరమణా!**
**(48వ పద్యం)**



కొండలరాయుడు కొండవంటి వాడేనని, ఆయన కూరిమి సఖి కూడా కొండలకే రాణియని, కొండలలో ఉండేవాళ్లకు వెండీబంగారాలు అవసరమే ముందని కవి చమత్కరిస్తున్నాడు. ఆ కవే మళ్లీ ఇలా హేళనగా అంటున్నాడు.

**వడ్డీకాసులవాడా! వడ్డీనే తీర్తువంట వాస్తవమేనా**
**వడ్డీనే కట్టిన మరి, బెడ్డేనా యసలు తెలుపు వేంకటరమణా!**
**(173వ పద్యం)**

వడ్డికాసులవాడవు వడ్డికడుతున్నావు అసలు బెడ్డేనా? అంటే అసలు కట్టడం హుళక్కేనా? అనడం పైకి పరిహాసంగా కనిపిస్తుంది. నిజంగా ఆలోచిస్తే కవి స్వామి చేష్టను పరిహసిస్తాడా? ఎప్పుడూ అలా చేయడు. వడ్డీ గ్రహించిన స్వామి భక్తుని వృద్ధికి దారి చూపుతాడని కవికి నిండైన నమ్మకముంది. 'లక్ష్మిదయా విశేషంతో లక్షలు కూర్చుకొన్నావు గాని, నిజానికి నిన్ను మెచ్చి ఎవడిస్తాడు? మీకూ అప్పులున్నాయని నాకు తెలుసు. తీసుకోవడమే గాని ఇవ్వడం లేదు గదా!' అనడం నిందాస్తుతి. భక్తుల కానుకలు గ్రహించి వాళ్లకు స్వామి అప్పు పడుతున్నాడు. భక్తితో సేవించినన్నాళ్లూ భక్తుల అప్పును భగవంతుడు దీవెనలిస్తూ తీర్చుతూనే ఉంటాడనే భావం ఆ నిందాస్తుతిలో ఉంది. 'ధరాతలంలో... భక్తులవంతలు బాపుతూ బదులు వడ్డి వరింతువు' అంటూ 'సిరిమల్లెలు' (వేంకటేశ్వరత్రిశతి) లో చింతలపాటి మోహన మురళీకృష్ణ 'స్వామి ఉచితంగా దీవనలివ్వడు. దండిగా వడ్డికాసులిస్తేనే పలుకరిస్తాడు'. (35, 69 పద్యాలు) అని చమత్కరించాడు. వడ్డికాసులు దేవుడికి బహు తీపి అని కూడా అన్నాడు. ఆయనదే ఈ పద్యం –

**లోకము లెల్ల డబ్బునకు లొంగుట వింటిమి, కాని నీవు యీ**
**లోకుల వోలెనే జనుచు లుబ్ధత మొక్కుల వడ్డికాసుతో**
**చేకొని యుద్ధరించుట యశోన్నతి కించుక మచ్చకాదె! నీ**
**ప్రాకట వైభవమ్మునకు వడ్డియె ముఖ్యమ వేంకటేశ్వరా! (127 పద్యం)**

లోకంలో జనం డబ్బుకు దాసోహం అనడం అందరికీ తెలిసిందే. కాని దేవుడు కూడా లుబ్ధతతో మొక్కుబడుల వడ్డికాసులు చేకొంటూ భక్తులను ఉద్ధరిస్తూ ఉండడం ఆయన కీర్తికి తక్కువదనమే. 'నీకు వడ్డి ముఖ్యమా?' అంటున్నది పై పద్యం.

కుబేరుడికి వేంకటేశ్వరస్వామి అప్పుపత్రం రాసి ఇచ్చాడట. అప్పు పత్రం తీసుకొన్న తరువాతనే కుబేరుడు ధనం అప్పుగా ఇచ్చాడట. ఈ అప్పు తీర్చడానికి భక్తులనుండి విశేషంగా కానుకలు గ్రహిస్తున్నాడు స్వామి. లక్ష్మిని ఎదపై ధరించిన స్వామికి భక్తులనుండి సొమ్ము అవసరమా? సాధారణంగా లోకంలో ధనం కలవాడిని లోకనాథుడుగా గుర్తిస్తారు. అలా లోకనాథుడుగా విశ్వమంతా గుర్తింపబడడానికి వడ్డికి వడ్డిచేర్చి ఎక్కువగా ధనం కూడబెడుతున్నట్లుంది. ఇలాంటి అభిప్రాయాలు వేంకటేశ్వర శతకాలలో అధికంగానే కనిపిస్తున్నాయి. కుబేరుని అప్పు కథ తలా తోక లేనిది. ఇలాంటి కథలను చెపుతూ, తమ శతకాలలో ఉటంకిస్తూ ఇంకా ప్రచారం చేస్తున్న వాళ్లను చూచి వేంకటేశ్వరస్వామి నవ్వుకొంటాడు కాబోలు – అంటూ 'వినతి' (2013) అనే శతకంలోని 'నీ అప్పు' అనే శీర్షికలో వేమూరి వేంకటరామనాథం ఈ పద్యం చెప్పాడు.

**ఇది కథగాని, ముజ్జగము లేలెడి నీకె ధనమ్ము లేక, నీ**
**యదనున కా ధనాధిపుని నప్పును గోరెడు ముప్పు కల్గెనా?**
**అది తలతోక లేని కథ లల్లుట బోలెడు, నల్లువారిపై**
**పెదవులు త్రిప్పి నవ్వు కురిపింతువొ పూర్ణదయాస్వభావివై**

ఎందరు భక్తులు ఎన్నెన్ని ధనరాసులను తెచ్చి హుండీలో కుమ్మరిస్తున్నా, స్వామీ! తృప్తి లేక ఇంకా ఇవ్వమంటున్నావట. అలాంటి వాడివి దేవుడవు ఎలా అయ్యావు? అంటూ నిందాపూర్వకంగా భక్తిని ప్రదర్శించాడు ముదుంబై నరసింహాచార్య తన శ్రీవేంకటేశ్వరశతకంలో (1970). ఆ శతకంలోని మరొక పద్యమిది –



**పెండ్లికొరకు మరి కుబేరుని దగ్గర**
**వడ్డికప్పు గొంటె దొడ్డవాడ**
**'వడ్డికాసు' లంచు భక్తుఁ బీడింతువా**
**'పెద్దమనిషి' వయ్య వేంకటేశ!**

నరసింహాచార్య స్వామిని అంతటితో వదలకుండా ఇంకా ఇలా అడుగుతున్నాడు. వడ్డీకి ఎంత ధనం తీసుకొన్నావు? వడ్డి శాతమెంత? ఎంతకాలంలో తీర్చాలి? ఇప్పటికి ఎంత చెల్లించావు? ఇంక ఎంత ఇవ్వాలి? ఇవన్నీ చెపితే మేము కూడా వింటాము. కలియుగంలో ఎపుడో ఒకసారి 'కల్యాణపుమైకం' లో నీవు రాసి ఇచ్చిన వడ్డీపత్రం నీ ఎదుట పెట్టి కుబేరుడు నిన్ను బెదిరిస్తాడే గాని ఊరకనే పోడు. ఇచ్చినదంతా ముక్కు పిండి నీ దగ్గర వసూలు చేయకపోతే అతడు కుబేరుడు ఎందుకవుతాడు? అప్పు తీసుకోవడం అలవాటు లేదని కుబేరునితో అనినా, నీ మాట వినడానికి అతడు వెర్రివాడు కాదు.

**'నాది కాదు కాదు శ్రీద! యీ చేవ్రా' ల**
**టన్నఁగాని ఫలము సున్నయగును**
**కుంచమెత్తు పెట్టికొని గుర్రుపెట్టు గో**
**విందరాజు సాక్షి వేంకటేశ**

ఈ పద్యంలో గోవిందరాజస్వామికి చెందిన విశేషం ఒకటుంది. కుబేరుడు ఇచ్చిన ధనం కుంచాలతో కొలిచి కొలిచి అలసిపోయి గోవిందరాజు ఆ కుంచాన్నే తలగడగా పెట్టుకొని నిద్రపోతున్నాడు. నిద్రపోతున్న భంగిమలోనే భక్తులకు దర్శనమిస్తున్నాడు. అప్పు పత్రంలో పెట్టిన చేవ్రాలు నాది కాదన్నా గోవిందరాజే సాక్ష్యంగా ఉన్నాడు కాబట్టి ప్రయోజనం ఉండదు. శతక కర్త స్వామి సాన్నిధ్యం కల్పించుకోవడానికి, స్వామిని తనకు దగ్గరైన వ్యక్తిగా భావించుకొని సరదాగా సంభాషించడానికి అనిన మాటలివన్నీ. లోకంలో

ప్రచారంలో ఉన్న ఈ విషయాలను మళ్లీ ఒకసారి పాఠకుల ఆలోచనలకు అందించి, ఆ నెపంగా స్వామికి దగ్గర కావాలనే కోరికతో అల్లిన శతకమిది. కొండపైన వేంకటేశ్వరస్వామి నిలుచున్న భంగిమలో భక్తులకు దర్శనం ప్రసాదిస్తుంటే కొండకింద తిరుపతిలో గోవిందరాజస్వామి శయన భంగిమలో ఎందుకున్నారనే సందేహం వచ్చిన జానపద భక్తులు పై విధంగా ఆలోచించారు. 'జ్యోతి' అనే సినిమా (1976) లో ఆత్రేయ రాసిన 'ఏడుకొండలపైన ఏల వెలశావొ' అనే పాటలో కూడా స్వామి తీర్చవలసిన బాకీ విషయ ప్రస్తావన ఉంది.

**పాపిష్టి ధనముకై ఆశపడుతున్నావా**
**ఏనాటి ఋణమును తీర్చు కొంటున్నావొ**
**రెండు ప్రేమల మధ్య బండగా మారావు**
**రేపు లేని నీకు దోపిడీ ఎందుకో ॥ఏడుకొండలపైన॥**

* * *

# సుప్రభాతం

ప్రతిరోజూ వేంకటేశ్వరస్వామిని సుప్రభాతం పలికి మేల్కొలపడం ఆలయ సంప్రదాయం. స్వామి వరద, కటి హస్తాలతో నిలబడి వరదహస్తంతో తన పాదాలను చూపిస్తూ నిలబడి ఉన్నాడు. తన పాదాలు సకల శ్రేయోదాయకాలని, ఆ పాదాలను శరణు పొందమని స్ఫురింపజేస్తున్నట్లు దర్శనమిస్తుంది స్వామి మూర్తి. ఎప్పుడూ నిలబడి భక్తలోకాలను ఏలుతున్న వాడు పడుకొని నిద్రపోతే గదా ఆయనను సుప్రభాతంలో మేల్కొలపవలసిన అవసరం వచ్చేది అనే సందేహం సాధారణ భక్తులకు కలగడం సహజం. ఈ విషయాన్ని ఎందరో కవులు కూడా ప్రస్తావించారు. రసరాజు తన 'నివేదనం' అనే పద్యపంచకంలో (సప్తగిరి, ఏప్రెల్ 1996) 'అసలే రోజైన కన్మూసి నిద్రించితె కృపాసముద్రా! శ్రీనివాసప్రభూ!' అన్నాడు. ఏ రోజూ స్వామి నిద్రపోవడం లేదట. పెద్ద ఊర్ధ్వపుండ్రాలు రెండు కనులమీదుగా ఉన్నందువల్ల స్వామి కళ్లు మూసుకొని ఉన్నట్లు కనిపించినా నిలబడే ఉన్నాడు. నిలబడి నిద్రపోతున్నాడా అని కూడా కొందరు కవులకు సందేహం కలిగింది. రసరాజే మరొక గేయంలో (సప్తగిరి మే 2005).

**నిదురపోవని తెలిసినా నేను జోలపాడాలా!**
**మెలకువగా నీవున్నా తెలిసి మేలు కొలపాలా!**
**వెంకన్నా! నీ లీలలు ఇన్ని రంగులా!**
**వెలిగే ఆ ఇంద్రధనుస్సులోని పొంగులా!**

అన్నాడు. జోలపాడాలంటే దేవుడు నిద్రపోడు. నిద్రపోనివాడికి జోలపాడడం ఎందుకు? ఎప్పుడూ మెలకువగానే ఉండే స్వామిని మేలుకొలపడం ఎందుకు? ఈ ప్రశ్నలు రెండూ లౌకిక విషయానికి సంబంధించినవి. పరమాత్మకు నిద్ర, మెలకువలు ఉండవనే విషయం కవులకు తెలుసు. కాని ఈ రకంగా రాయడం ఎందుకంటే ఆ రకంగానైనా స్వామిని సేవించడం



శ్రీవారి ఆలయంలో బంగారువాకిలి



కోసం. కవులు సమాజంలోని వ్యక్తులే కాబట్టి లోకంలో తాము దర్శించిన విషయాలనే తమ రచనలలో పొందుపరుస్తారు. దేవుడికి సంబంధించిన విషయాలైనా అంతే. తననుగురించి తన భక్తులు ఎన్ని రకాలుగా ఆలోచించినా ఆ యాలోచనలన్నీ భక్తిలోనే పర్యవశిస్తాయి కాబట్టి అవన్నీ స్వామికి ఆనందాన్నే కలిగిస్తాయి. స్వామిని ఎన్నిరకాలుగా విమర్శించి రాసినా ఆయన మీద భక్తి లేకపోతే అసలు అలాంటి ఆలోచనలు కూడా రావు.

స్వామీ! జగాలేలే నీకు నిద్రించడానికి సమయం ఎక్కుడుంది? నువ్వెప్పుడూ మెలకువగానే ఉంటావు. నీవు కండ్లు మూసుకొంటే కల్పాంతం అవుతుంది. అలా కూడా కొందరు కవులు భావించారు. స్వామి నిరంతర నిర్నిద్రుడు. అన్నివేళలా జాగరూకుడుగానే ఉంటాడు. ఒక శతక కర్త స్వామిని అలాగే ఉండమని కోరుతున్నాడు. లేకుంటే లోకం చైతన్యం కోల్పోయి చీకటిలో కనిపించకుండా పోతుందట. వేకువజామున సుప్రభాతంతో నిద్ర లేస్తావు. ఉదయంనుండి రాత్రి వరకు భక్త జనులను సాకుతావు. నీకు నిద్ర తక్కువగదా అని కొందరనుకొంటారు. ఇదంతా ఒక అవివేకపు ఆలోచన అంటున్నాడు మరొక కవి.

**వేకువజామున లేతువు, సాకెదవే రాత్రి వరకు జనులను కృపతో**
**నీకేదీ నిద్దుర యవి, వేకము భంజింపవయ్య వేంకటరమణా!**

స్వామి ఎప్పుడూ కళ్లుమూసుకొనే ఉన్న స్థితిని దర్శించి మరొక శతకకర్త ఇలా అంటున్నాడు. నీవు ఎప్పుడు పుట్టినావో, నీ వయసెంతో తెలియదు. ఇంకా కండ్లు తెరవకుండా ఉన్నావు. కండ్లు తెరచి ఎప్పుడు మాట్లాడతావో. అప్పటికి మేము ఏమవుతామో. నీవు కండ్లు తెరిస్తే అసలు లోకమే ఉండదు. ఉన్న సృష్టి నశించి కొత్త సృష్టికి అంకురార్పణ జరుగుతుంది. '**ప్రణతి**' లో వేమూరి వేంకటరామనాథం పద్యమిది –


**మనవలె సామియున్ నిదురమైకము జారిన దివ్యనేత్రముల్**
**దినకరురాకతో తెఱచుతెన్నున నెంతు మిదెంత మాంద్యమో**
**కొనలగుపించునట్టులు జగమ్ములు విచ్చిన సృష్టినంత బ్రో**
**చు నియత శక్తి కీ గతిని సోలుట లేచుట యన్నవుండునే**

మానవులమైన మనవలె స్వామికూడా నిదుర మైకంలో పడి దివ్యనేత్రాలు ముకుళించుకొని దివాకర కరస్పర్శతో కండ్లు తెరుస్తున్నాడని భావించడం ఎంత అమాయకపు ఆలోచనో కదా! సమస్త సృష్టిని రక్షించే నియత శక్తిగల శ్రీనివాసునికి నిద్రలో సోలడం, నిద్రనుండి లేవడం అనేవి ఉండవు అని పద్యభావం. బ్రహ్మాండాన్ని కదిలించే దేవుని వేకువవేళ లెమ్మంటూ 'నిత్య దర్శన సందానితమైన దివ్యతకు నిద్రారోపణ' చేయడం మానవులు కల్పించి చేస్తున్న పనే.

* * *

# స్వామి దర్శనం

వేంకటేశ్వరస్వామిని దర్శిస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. స్వామి దర్శనం కోసం అనేక దూర ప్రాంతాలనుండి వచ్చే భక్తులు ఎంత శ్రమనైనా ఓర్చి దర్శించుకొని సంతృప్తిగల మనస్సుతో తిరిగి వెళతారు. దర్శనం అయ్యేంతవరకు ఉపవాసం ఉంటారు. ఇరవై ముప్పై సంవత్సరాల ముందు ముఖ్యంగా పల్లెపట్టులనుండి వచ్చే భక్తులు బయలుదేరే ముందే తమ ఇండ్లలో ఒక్కపొద్దు ఉండి, ఇలువేల్పు అయిన శ్రీనివాసుని పూజించుకొని, పసుపు బట్టలు ధరించి, అప్పటి వరకు దాచి ఉంచుకొన్న ముడుపులు తీసుకొని కాలినడకన కొండకు వచ్చేవారు. నడవలేని వారు తిరుపతికి బస్సులలో రైళ్లలో వచ్చినా తిరుపతినుండి తిరుమలకు తప్పని సరిగా నడిచి వెళ్లేవారు. గోవిందా! గోవిందా!! అంటూ తన్మయత్వంతో నడిచి వచ్చి తలనీలాలు సమర్పించి తరువాత పుష్కరిణి వద్దకు చేరుకొని అందులో తప్పక స్నానం చేసేవారు. ముఖంపై ఊర్ధ్వపుండ్రాలు ధరించి ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించి, తెచ్చిన ముడుపులు తదితర కానుకలు హుండీలో సమర్పించేవారు. స్వామి ప్రసాదం గ్రహించి తమ మొక్కు సఫల మయ్యిందని భావిస్తూ తిరుగు ప్రయాణమయ్యేవారు. అంతకు ముందే ఆలయ పరిసర ప్రాంతాలలో ఎక్కడో ఒక అనువైనచోట 'పిండితళిగ' వేసుకొని కర్పూరం వెలిగించి కొబ్బరికాయ కొట్టి నమస్కరించుకొని బయలుదేరేవారు. మళ్లీ తిరుపతి వరకు నడకే. కొండపైన 'పిండితళిగ' వేసుకొని భక్తులు ఇండ్లకు వెళ్లిన తరువాత మరుసటి దినం ఉదయాన స్వామికి తీపి పొంగలి సమర్పించేవారు. అప్పటికి తమ తిరుమలయాత్ర పూర్తి అయినట్లు భావించేవారు. ఈ పద్ధతులు పల్లె ప్రాంతాలనుండి కొండకు వచ్చే భక్తులలో పెద్దవాళ్లకు తెలుసు. పల్లెలనుండి భక్తులు సంవత్సరానికి ఒకసారి తప్పకుండా తిరుమల యాత్ర చేయడం, ఆ సందర్భంలో పైన చెప్పిన అంశాలన్నిటిని పాటించడం ఇప్పటికీ ఉంది. అయితే పట్టణాలకు సమీప గ్రామాలలో ఆధునికత కారణంగా కొన్ని మార్పులు కనిపిస్తున్నాయి.





ఒక్కపొద్దు ఉంటూ కొండకు రావడం, తిరిగి వెళ్లిన తరువాత తమ ఇండ్లలో దేవునికి నివేదన చేసి ఒక్కపొద్దు తీర్చుకోవడం వంటి విషయాల్లో మునుపటి పద్ధతులను పాటించడం తగ్గిపోతూ ఉంది. అయినా సంవత్సరానికి రెండు మూడుసార్లు కూడా తిరుమలకు వస్తున్నారు. మొక్కులు సమర్పిస్తూనే ఉన్నారు. గేయకవులు, శతక కవులు స్వామి దర్శనానికి సంబంధించిన అనేక విషయాలు చెప్పారు.

**'కొండకు పోదాం రండి'** అనే గేయంలో "నీలాలను స్వామికిచ్చి – కోనేటను తానమాడి, అతిపవిత్ర భావమ్ముల – ఆలయమ్ముకిదె రండి" అని రాసిన శారద స్వామిని దర్శించే పద్ధతిని ప్రస్తావించింది. ప్రస్తుతం కోనేటి (పుష్కరిణి) లో స్నానం చేయడానికి మారు కొందరు తమకిచ్చిన వసతి గదులలోనే స్నానం చేసి దర్శనానికి రావడం కనిపిస్తున్నది కాని ముందు కాలంలో పుష్కరిణిలో స్నానం తప్పనిసరి అంశంగా ఉండేది. భక్తులు అన్నిపుష్పాలనూ మించిన అపురూప పుష్పమైన తమ మనసు పుష్పాన్ని స్వామి పాదాల ముందు సమర్పించి భక్తితో దర్శనం చేసుకొంటారు. 'అక్షరదక్షిణ' అనే పేరుతో (సప్తగిరి, డిసెంబర్ 2003) ఎస్.వి.ఆర్. సత్యనారాయణమూర్తి ఎనిమిది పద్యాలు రచించారు. వాటిలో ఒక పద్యం–

**దక్షిణమున తిరుమలలో, మోక్షము నొసగే ప్రసిద్ధ ముడుపుల రేడా!**
**ఏ క్షణమైనను విడువక, దాక్షిణ్యము జూపవయ్య తండ్రీ రమణా!**

శ్రీనివాసుడు ముడుపులరేడు. మోక్షమిచ్చే దేవుడు ఆయనే. అందుకోసమే భక్తులు కొండకువచ్చి స్వామికి మొక్కుతున్నారని మూర్తిగారు చెపుతున్నారు.

**పసులుబట్టలు కట్టినామే – మనసు శుద్ధిగా చేయవయ్యా**
**మూడు నామము లద్దినామే – రాత మార్చుము గోవిందా**
**కురుల నిచ్చితి మొక్కు తీర్చితి – ముడుపు కట్టిన మూటలన్నీ**
**హుండి చేర్చితి పొర్లుదండపు – పుణ్యమీయుము గోవిందా!**

ఇత్యాదిగా సాగే మన్నవ గంగాధరప్రసాద్ 'ఏడుకొండల వేంకటేశ' అనే గేయంలో (సప్తగిరి, డిసెంబర్ 2003) భక్తులు స్వామిని వేడుకొనే పద్ధతి కనిపిస్తున్నది.

దర్శనానికి వచ్చిన భక్తులు ఎంత సేపు 'క్యూ' లో నిలబడాలి? వీళ్లెంత సేపు నిలబడగలరో చూద్దామని దేవుడు పరీక్ష చేస్తున్నాడా అనిపిస్తుంది. అలా నిలబడడం కూడా ఒక రకమైన తపస్సే. ఆ సమయంలో భక్తులు వాళ్లకు సంబంధించిన లౌకిక విషయాలు మాట్లాడుకోవడం కనిపిస్తుంది. అలా కాకుండా శ్రీహరిని సేవిస్తూ కాలం గడిపి దేవుని దర్శిస్తే అమందానందం కలుగుతుందని భక్తులకు ఒక కవి సలహా ఇస్తున్నాడు. స్వామిని దర్శించి వెనక్కు తిరిగితే మళ్లీ చూడాలనిపిస్తుంది. అలాంటి మోహనరూపం శ్రీవారిది. మళ్లీ దర్శించడానికి ప్రయత్నిస్తే శ్రీవారి సేవకులు లాగి పారేస్తారు. క్షణమైనా కన్నులారా చూడనివ్వరు. నడిచే ప్రయత్నం లేకుండానే జనం తోపుళ్లకే శరీరం బయట పడిపోతుంది. మనస్సు మాత్రం స్వామి మూర్తినే నిలుపుకోడానికి యత్నిస్తుంది. 'నువ్వంత సులభంగా మనస్సులో నిలుస్తావా' అని ఒక గేయకర్త స్వామి దర్శనాన్ని భావించాడు. గుడి వెలుపలికి వచ్చిన తరువాత స్వామిమూర్తి మనోనేత్రానికి కూడా అందకుండా పోతుందని, మళ్లీ కొంతకాలం తరువాత వచ్చి దర్శిస్తే అప్పటికి కొత్తగానే తోస్తుందని, అది స్వామిమూర్తిలోని అద్భుతమని కొందరికి అనిపిస్తుంది. ఎంతసేపు దర్శించినా తనివి తీరదని

**రెండు కన్నులు చాలవే నిను తనివి తీరా చూడగా**
**వెను దిరిగి తిరిగి కనగనెంచి పదము వీడదు నిన్ను వీడగ**

అంటూ ఒక గేయకర్త తన మానసిక స్థితిని చెప్పుకొన్నాడు. కొందరు భక్తులు స్వామిని కన్నార్పకుండా చూస్తూనే ఉంటారు. ఏవేవో చెప్పాలని, ఎన్నెన్నో అడగాలని అనుకొని ఏమీ చెప్పలేక, ఏదీ అడగలేక నోరు



కదపకుండా ఆ మూర్తిని దర్శించి దివ్యానుభూతికి లోనై స్తబ్ధంగా ఉండిపోతారు. కొందరు గేయకర్తలు వాళ్ల అనుభవాలను వివరించారు. రసరాజు గేయమిది (సప్తగిరి, ఫిబ్రవరి 2005).

**అలా నీవు కనిపిస్తే చాలు ఆకైనా అడగను**
**ఆ చూపే పదివేలు – వెనక్కి అడుగైనా వేయను**
**ఎంత అందమయ్యా వెంకన్నా నీ రూపం!**
**ఎందైనా కలదయ్యా ఇంత గొప్ప దీపం!**

స్వామి దివ్యసౌందర్యంలో మునిగిన మనస్సు తన కోరికలను మరచిపోతుం దని పై గేయం చెపుతున్నది. స్వామి దివ్యపాదాలను దర్శిస్తే చాలు మనస్సు అక్కడే ఆగిపోయి పైకి వెళ్లడం లేదని 'నీ పాదదాసిని' అనే గేయం (సప్తగిరి, మార్చి 2005) లో వి.పద్మావతి ఇలా అంటున్నది.

**నీ తిరునామాల శోభను తిలకించి పులకించాలనుకొన్నా**
**శంఖచక్రాల వైభవాన్ని కనులారా చూచి మనసారా తరించాలనుకొన్నా**
**నీ హృదయంలో కొలువున్న దేవేరులను చూచి ఆనందం పొందాలనుకొన్నా**
**కానీ... నీ బంగారు పాదాలను చూడగానే నా కనులు తన్మయత్వంతో మూసుకుపోయాయి.**
**నా శిరస్సు పరవశంతో నీ పాదాల మ్రోల నిలిచి పోయింది.**
**భక్తిపారవశ్యంతో నా మనసు మూగబోయింది.**

పైసా పైసా కూడబెట్టుకొని ముడుపులుగా మూటగట్టుకొని కోరికలు తీరుస్తావని బీదభక్తులు కొండకు వస్తే కాలు పెట్టడానికి తావుండదు. ఏమి న్యాయం వెంకన్నా ఇది? గుండు గీయించుకొని, కోనేటిలో మునకవేసి, నామాలు పెట్టుకొని గంటల తరబడి 'క్యూ' లో నిలబడి 'గోయిందా! గోయిందా!' అని తోసుకొంటూ తోసుకొంటూ నీ దర్శనానికి వస్తే తోపులాటల యుద్ధాలు. అయినా ఓపికతో వస్తే నీ పాదాలు చూపి పొమ్మంటావు ఇదేమి న్యాయం?

**నీ వెవరో చూదామంటే ముఖమంతా నామాలాయె**
**ఇదెక్కడి మిడిమేలమంటే నవ్వేసి పొమ్మంటావు**

అని ఆవుల రామచంద్రయ్య గేయం. ముఖమంతా నామాలుండడం వల్ల స్వామి ముఖం సరిగా కనిపించడం లేదని గేయకర్త అభిప్రాయం.

**ప్రజలకోసం పథకాలు వేసి కోట్లు గడించు మంత్రులు**
**వారి నాశ్రయించి లక్షలు ఆర్జించు అధికారులు**
**ధనముతో ధగధగలాడు ధనవంతులు, పారిశ్రామికులు**
**అతిసులభంగ నిన్ను దర్శింతురు! నీ ప్రసాదాలు వారికే అందు**
**నీ అలంకారాలు వారికోసమే అన్నట్లు హారతి ఇచ్చి**
**నిన్ను చూపింతురు పూజారులు! అధికారులు! శ్రీనివాసా! గోవిందా!**
**పేదవానికి, సామాన్యునికి నీ దరిశనమబ్బదు తృప్తిగ**
**టక్కున తెరవేతురు యెందుకొ అరక్షణమైన చూడకనే**
**ఆ వెనుక వచ్చు రాజకీయ నాయకుడికి తెరపడదు గంటయిన**
**ఈ ఆలయ మర్యాదలు పేదలకేనా పరంధామా!**
**గోవింద! గోవింద! వెంకటరమణా! గోవింద!**

స్వామి దర్శనం కల్పించడంలో జరుగుతున్న అవకతవకలను, అసమానతలను పై గేయం సుస్పష్టం చేస్తున్నది. దీనికి కారణం ఏమిటో గేయకర్త రామచంద్రయ్యకు తెలుసు. అయినా కారణాలన్నిటికీ ఆ పరమాత్మే అసలు కారణం కాబట్టి ఆయననే అడుగుతున్నాడు. ఎంతో దూరం నుండి వచ్చి ఎంతోసేపు కాచుకొని, నిలబడి, కూర్చుని, మళ్లీ నిలబడి – ఇలా 'క్యూ' వరుసలో ఉండి దేవాలయంలోనికి ప్రవేశిస్తే శాంతిగా నిన్ను దర్శించుకోనీక త్వరత్వరగా నెట్టివేస్తారని అగస్త్యరాజు సర్వేశ్వరరావు స్వామికే ఇలా పిర్యాదు చేస్తున్నాడు.

**ఎన్ని దినాల నుండి, తుదకెంతొ ప్రయత్నము చేసి చేసి నీ**
**సన్నిధి జేరినన్, నిను బ్రశాంతిగ జూడగ నీయ రక్కటా!**
**క్రన్నన నెట్టివేయుదురు; కాళ్లను జూపులు నిన్ను జూచుచున్**
**దిన్నగ వెన్కకున్ దిరుగు, తిర్గదు చిత్తము వేంకటేశ్వరా!**



కాళ్లు వెనుకకు తిరిగినా, స్వామి మూర్తిపై నిలిచిన చిత్తం వెనక్కు తిరుగదు. ఇలాంటి అభిప్రాయాన్ని చాలమంది కవులు వ్యక్తం చేశారు. కవులదే కాక ఈ యభిప్రాయం భక్తులందరిదీ కూడా. ఎలాంటి తోపులు, లాగడాలు, కసరడాలు లేకుండా ఒక క్షణమైనా నిశ్చలంగా నిలబడి స్వామిని దర్శించే భాగ్యమే భాగ్యమని అందరూ అనుకొంటారు. అలాంటి అదృష్టం కలగాలని భక్తులు స్వామిని వేడుకొంటున్నారు.

కుంతీపురం కౌండిన్యతిలక్ స్వామిని దర్శించినపుడు స్వామి ముఖం **'ముని హృత్సదనము'** వలె కనిపించిందట. ఆయన శతకం (2011) లోని ఈ పద్యం అలా చెపుతున్నది.

**వదనము కాదది ముని హృ, త్సదనము సకలార్థశాస్త్ర సన్నిధి పదమౌ**
**మదరిపు సంహరణకో, విదమౌ పట్టెం నివాస వేంకటరమణా!**

మునులు స్వామి ముఖాన్ని ఎప్పుడూ భావిస్తూ ఉండడంవల్ల వాళ్ల మనస్సులలో ఆ ముఖ సౌందర్యం ప్రతిఫలనం అవుతున్నది. ఆ ముఖ దర్శనంవల్ల సకల శాస్త్రాల సారం స్ఫురిస్తున్నది. ఇలా కొందరు కవులు దేవునిమూర్తికి సంబంధించిన వివిధాంగాలను, ఆయుధాలను కూడా వాళ్లకు తోచినట్లు భావించి వర్ణించారు. రావికంటి వసునందన్**'శ్రీ చరణ శరణాగతి'** అనే గ్రంథం (2012) రచించారు. ఒక పద్యం (945) లో శంఖుచక్రాలు దుష్కరులకు వైరులవుతున్నాయి అన్నారు. స్వామి కటాక్షాలు విశ్వవిస్తారాలట. మరొక పద్యం (953) లో స్వామి శరీరంపై పొడమిన చెమటబొట్లను వర్ణించారు. కొండపైన ఉన్న అమ్మను, కొండ కింద ఉన్న అమ్మను అంటే ఇద్దరమ్మలను సరిసాటిగా ఏలడానికి వెళతాడు వేంకటేశ్వరుడు. కిందికి దిగడం, పైకి ఎక్కడం వల్ల శ్రమ కలిగి శరీరంపై చెమట బిందువులు ఏర్పడతాయి. ఈ చెమట బిందువులు నీలి మేఘం వంటి ఆయన శరీరంపై ముత్యాలవలె కనిపిస్తూ ఆకాశంపైన చుక్కల్లాగా ప్రకాశిస్తున్నాయి. స్వామి నడిరేయిలో కొండదిగి వస్తాడని ఒక సినిమా పాట (రంగుల రాట్నం – దాశరథి రచన) కూడా ఉంది.

**నడిరేయి ఏ జాములో స్వామి నిను చేర దిగివచ్చునో**
**తిరుమల శిఖరాలు దిగివచ్చునో**
**మముగన్న మాయమ్మ అలమేలుమంగమ్మ**
**పతిదేవు ఒడిలోన మురిసేటి వేళ**
**స్వామి చిరునవ్వు వెన్నెలలు కురిసేటి వేళ**
**విభునికి మామాట వినిపించవమ్మా**
**ప్రభువుకు మామనవి వినిపించవమ్మా**

అమ్మ ద్వారా స్వామిని వేడుకోవడం వైష్ణవ సంప్రదాయం. ఆ సంప్రదాయం ఈ పాటలో కనిపిస్తున్నది.

తిరుమలయాత్ర చేసే భక్తులు తిరుపతికి చేరుకొన్న తరువాత ముందుగా కపిలతీర్థంలోని కోనేరు (ఆళ్వారు తీర్థం) లో స్నానం చేసి కొండకు బయలుదేరే సంప్రదాయం గతకాలంలో ఉండేది. ఆ విషయాన్ని తెలుపుతూ పి.వి.శ్రీనివాసమూర్తి 'శ్రీనివాసప్రభూ' అనే పేరుతో పద్యపంచకం (సప్తగిరి, ఆగస్టు 1995) రచించారు. అందులో రెండు పద్యాలివి –

**ఒక తీర్థంబున శైవవైష్ణవులు పాపౌఘాగ్నిఁబాయంగ బా**
**యక నిన్నెంచుచు నోలలాడెదరు ప్రహ్లాదైక చిత్తంబుతో**
**నకళంకస్థితి నొప్పుచున్ కపిలతీర్థాభిఖ్యసంబుద్ధి నో**
**డక యాళ్వారుల తీర్థమంచు కడునిష్ఠన్ శ్రీనివాసప్రభూ!**

**రవితేరున్నుదయాద్రిపై నెగసి సంరంభంబుతో సాగ భూ**
**భువనాంభోరుహ కాంతిరేఖలు సముత్ఫుల్లంబులై ప్రాక మా**
**ధవ! భక్తుల్ తమితీరగాఁగపిలతీర్థంబందు సుస్నాతులై**
**నవతేజంబునఁగొండనెక్కెదరనంతా! శ్రీనివాసప్రభూ!**

కపిలతీర్థంలోని 'ఆళ్వారుల తీర్థము' లో ఉదయాన్నే శ్రీనివాసా! నిన్ను స్మరిస్తూ ఆనందంగా భక్తులు స్నానం చేస్తారు. ఇక్కడ శైవవైష్ణవ భేదం లేదు. ఆ ఇరు సంప్రదాయాలవాళ్లూ తమతమ పాపాలు నశిస్తాయన్న నమ్మకంతో



ఎంతో నిష్ఠతో సుస్నాతులవుతారు. స్నానం చేసి శుచిగా తిరుమలవాసుని దర్శనంకోసం కొండ ఎక్కడం ప్రారంభిస్తారు. భక్తుల అంతరంగాలలో శైవ వైష్ణవ తేడాలు లేవు. శైవక్షేత్రంలో స్నానం చేసిన తరువాతనే కొండకు వెళ్లడం అనే సంప్రదాయం మొన్న మొన్నటి వరకు కొనసాగింది. ఇప్పుడు భక్తులు నేరుగా తిరుమలకు వెళుతున్నారు. శ్రీవారి దర్శనానంతరం కొండ దిగిన తరువాత స్థానిక దేవాలయాలను దర్శించే సందర్భంలో కపిలతీర్థం వెళ్లి ఆళ్వారుతీర్థంలో స్నానం చేసి కపిలేశ్వరస్వామిని దర్శించుకొంటున్నారు. సంప్రదాయాన్ని అనుసరిస్తూ దర్శనానికి వెళ్లినా –

**"పదపద" యంచు త్రోయు గుడి పాలకవర్గము; వారి యూపులో**
**నదరుచు త్రుళ్లి నే గనిన యట్టి శుభంకర విగ్రహమ్ము కన్**
**తుదలను జారిపోనటుల తూగుచు నూగుచు నిల్పియుంచి నా**
**హృదయమునందు నీ యతుల హేల బిగింపగ జూతు నాత్రతన్**

అంటూ వేంకటరామనాథం స్వామి శుభవిగ్రహం మీద కన్నును ప్రసరింపజేసే లోపలే పదపదమని తోసి పారేయడం వల్ల ఆ దివ్యవిగ్రహ దర్శనాన్ని కనులనుండి జారిపోకుండా ఎలాగో నిలిపి ఉంచుకొని బయటకు వస్తున్నానని అంటున్నారు. తిరుపతిలో స్థానిక ఆలయాలను తప్పక దర్శించాలని 'అలమేలుమంగను గోవిందరాజులను చూచినవారలె ధన్యులండి' అని ఒక గేయకర్త చెపుతున్న విషయం సంప్రదాయ విషయమే. ఇప్పుడు వస్తున్న భక్తులు తిరుపతి సమీపంలోని శ్రీనివాసమంగాపురానికి కూడా వెళ్లి కల్యాణవేంకటేశ్వరస్వామిని దర్శించుకొంటున్నారు. తి.తి.దే.వారు స్థానిక దేవాలయాలకు భక్తులను తీసుకొని వెళ్లే సదుపాయాలు కల్పించారు. కొందరు భక్తులు తిరుపతినుండి కాణిపాకం వెళ్లి అక్కడ వెలసిన స్వయంభూ వరసిద్ధి వినాయకస్వామిని కూడా దర్శించి వెళుతున్నారు. కొందరు శ్రీకాళహస్తికి వెళ్లి శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకొని వెళుతున్నారు. దీనితో వైష్ణవ శైవ ఆలయాలను ఒకే తడవ దర్శించినట్లు అవుతున్నది. కొందరు భక్తులు స్వామిని ఒకసారి దర్శించి తృప్తి కలగక మళ్లీ దర్శించాలని 'క్యూ'

వరుసలోకి వెళ్లడం కనిపిస్తుంది. దర్శనానికి వెళ్లడంలో ఎదురయ్యే కష్టాన్ని అధిగమించి స్వామిని దర్శించి పునీతులమయ్యామని భావించే వాళ్లు ఎందరో.

**నిన్నుగాంచి మరలలేక - నిన్ను వీడి వెడలలేక**
**ఒకసరి నీ రూపుగాంచి - ఒడలు పులకరించి మరచి**
**మరియొకపరి గాంచగ నిను - మాధవ! వేచితిమయ్యా!**

కొండకు వచ్చిన భక్తులు తి.తి.దే.వారు సమకూర్చే వసతి గృహాల్లో ఉంటూ వీలైనన్నిసార్లు స్వామిని దర్శిస్తూ మళ్లీ మళ్లీ దర్శించాలనే కోరిక ఈ గేయభాగంలో కనిపిస్తున్నది. కొండదిగి వెళ్లే సమయంలో 'పునర్దర్శనము కొరకై - పురుషోత్తమ నినువేడితి' అని మొక్కుకొంటూ త్వరలో మళ్లీ తిరుమలకు వచ్చే పరిస్థితిని కలిగించమని ప్రార్థిస్తూ వెళతారు. దుర్బలులైనా కొండ ఎక్కడానికే ఇష్టపడతారు. బస్సులలో వెళ్లడానికి ఇష్టపడరు. ఎక్కుతూ ఉంటే అలసట తెలియనీయకుండా స్వామే భక్తులను పైకి చేదుకొని దర్శనమిస్తాడని భక్తులలో నమ్మకముంది. ఈ విషయం ఏడిద కామేశ్వరరావు తన 'అభయమూర్తి' అనే (1994) గేయంలో ఇలా చెప్పాడు.

**ఏడుకొండ లెక్కలేక వేడుకొనెడి నీ భక్తులు**
**గోవిందా! అని పిలువగనే మెట్ల నిట్టె దాటింతువు**

కొండకు వెళ్లే భక్తులు 'కొండపాదము దరి నిండుగా నిలిచిన' (అలిపిరిలో కనిపిస్తున్న స్వామి పాదాలను) స్వామి పాదాలను దర్శించి, ఆ పాదాలకు సాష్టాంగనమస్కారంచేసి నడకదారిలో కొండకు వెళ్లడం కూడా ఒక సంప్రదాయ విషయమే. ఇప్పటికీ నడచివెళ్లే భక్తులు స్వామి పాదాలను దర్శించి వెళుతున్నారు. ఎన్నిసార్లు దర్శించినా మళ్లీ దర్శించుకోవాలనిపిస్తుంది. అదే శ్రీనివాసుని మహిమ.

* * *

# ముక్తినొసగే దేవుడు

శ్రీవేంకటేశ్వరస్వామి పిలిస్తే పలికే దైవమని, ఆయనవంటి మరొక దేవుడు లేడని, ఆయనే మోక్షమిచ్చే వేలుపని భక్తుల నమ్మకం. ముక్తికి మానవజన్మమే కావాలి. దుష్టచేష్టలతో దానవరూపులైన కొందరు మానవత్వాన్ని మంట గలుపుతున్నారు. ధనదాహంతో సనాతన సంస్కృతిని అవహేళన చేస్తున్నారు. దివ్యజీవనం కొనసాగడం లేదు. ఈ లక్షణాలను పరిమార్చడానికి భక్తితో నిన్ను కొలవడమే సాధనం. భక్తులకు ముక్తిమార్గం చూపించమని కాకర్ల శ్రీరామమూర్తి స్వామిని ప్రార్థిస్తున్నాడు. స్వామి నామం నోరారా స్మరించిన వాళ్లకు నరకం ఉండదు. మరొక జన్మ లేదు. 'ఓం నమోవేంకటేశాయ' అనే మంత్రజపం చేసినవాళ్లకు ఏ భయమూ ఉండదు. వేంకటాచలమే వైకుంఠం. అది భక్తిముక్తులిచ్చే దివ్యక్షేత్రం. వేంకటేశ్వరుని కృప ఉంటేనే తిరుమలకు వెళ్లి స్వామిని దర్శించాలనే సంకల్పం కలుగుతుంది. ఈ సందర్భంలో కింది ముదివర్తి కొండమాచార్యుల పద్యంలోని భావాన్ని గమనింపవలసి ఉంది.

**తన వేషంబు ధరించినట్టి నటునాంధ్రక్ష్మాస్థలీముఖ్య మం**
**త్రిని జేసెన్; నిజనామధారులన్ సల్పెన్ పెక్కురన్ భారతీ**
**స్తనయుగ్మ ప్రతిమాన రమ్య కవితా సంగీత సామ్రాజ్య భూ**
**షణులన్; సప్తధరాధరేశ్వరుని వాత్సల్యంబు సామాన్యమే?**

శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలను; వేంకటేశ్వరస్వామి పాత్రను సినిమాలలో నిరుపమానంగా ధరించి నటించిన నటరత్న ఎన్.టి.రామారావుగారికి స్వామి మీద ఎనలేని భక్తి. ఆయనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రిని చేసి ప్రజాసేవ చేయుమని ప్రేరేపించింది శ్రీనివాసుడే. రాష్ట్ర ప్రజలైన తన భక్తులకు సేవ చేయడమే రామారావుగారు తనకు చేసిన సేవగా భావించాడు స్వామి. వేంకటేశ్వర అని పేరుపెట్టుకొన్నవాళ్లు స్వామిభక్తులు కాక మరేమవుతారు? అలాంటి వాళ్లలో కూడా అనవరత భక్తి తత్పరులైన కొందరిని సంగీత సాహిత్య రంగాలలో మేటి పండితులు కమ్మని ఆశీర్వదించాడు.


మధురగాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు వేంకటేశ్వర తత్త్వాన్ని గానం చేసి శ్రోతలకు మధురానుభూతిని కలిగించాడు. ఘంటసాల సాధించిన ఆ ఘనతకు స్వామి ఆశీర్వాదమే కారణం.

భక్తుల కష్టాలను తొలగించడమే స్వామికి పండుగ. హథిరాంబావాజీ కోసం వేంకటేశ్వరుడు ఏనుగుగామారి బండెడు చెరుకులు తిన్నాడు. బావాజీపై చూపించిన దయను భక్తులపై చూపించి ముక్తి నొసగమని కొందరు కవులు స్వామిని కోరిన పద్యాలున్నాయి. ఇహపర సాధనం స్వామి దర్శనం. లోకంలో మోక్షకాములైన నరులను –

**'వారమున కొక్కపరియైన వరదు, వేంక**
**టేశ్వరు జూడగోరుట ఇహపరముల**
**సాధనముగాదె....... జగతిలోన**
**వేంకటేశ్వరు దర్శించి వేడుకలర**
**సుగతి మార్గంబు గనుమ......ని'** ఏలేశ్వరపు రాధాకృష్ణ సుబ్బరాయ శాస్త్రి తన స్తోత్రకదంబం (1999) లో ప్రబోధించాడు.

శ్రీనివాసుని దర్శిస్తే భక్తులలో ఉన్న అజ్ఞానం నశిస్తుంది. సుజ్ఞానపు దారులలో పయనిస్తారు. కొందరు భక్తులకు ముక్తి కోరుకోవాలని కూడా తెలియదు. అలాంటి భక్తులను కరుణించి దేవుడే ముక్తిపథగాములను చేస్తాడు. నిరంతరం భగవన్నామస్మరణ చేసేవాళ్లు మోహసాగరంలో మునుగరు. యముని బాధలనుండి తప్పించుకొంటారు. స్వామి పాదాలపైగల భక్తి వల్లనే శాంతి సౌఖ్యాలు పొందుతారు. ఏమీ తెలియని మూర్ఖులైనా స్వామిని శరణుపొందితే చాలు, ఆయనే అలాంటి శరణాగతులను ఉద్ధరిస్తాడు. భక్తులు బలంగా నమ్ముతున్న విషయాలివి. ఇప్పటి పరిస్థితులలో మనస్సును దేవునిపై లగ్నంచేసి పూజించడం వీలుకాని పనిగా ఉంది. మనస్సును నియంత్రించుకో లేని అలాంటి వాళ్లను కూడా తరింపజేయుమని పాలెపు బుచ్చిరాజు తన **'శ్రీ తిరుపతి వేంకటేశ్వరవచనములు'** (2003) లో స్వామికి ఇలా విన్నవిస్తున్నాడు. 'సృష్టికర్తా! నీవు చేసిన ఈ బొమ్మతో





**శ్రీనివాసుని అభయహస్తం భక్తులకు ముక్తిమార్గాన్ని నిర్దేశిస్తుంది.**

ఆడుకోవడం నీకో వింత క్రీడ కాబోలునయ్యా! జీవంపోసి, ధ్యేయాన్ని నిర్ణయించి, మనిషి ఆ దారిన పోకుండా ఎన్ని అడ్డంకుల్ని సృష్టించావయ్యా! నేను, నా స్వార్థం, నా స్వజనం, నా ధనం, నా ప్రపంచం, నా కోరికలు, నా కామక్రోధాలు, నా మిత్రులు, నా శత్రువులు, నా ఆధిక్యత, నా ప్రాణం – ఇన్ని వలయాలు నన్ను చుట్టేసి రణగొణధ్వని చేస్తుంటే – నా మనసు మాత్రం నీపై ఎలా లగ్నం అవుతుందయ్యా! ఇన్ని శక్తులతో పోరాడి, ఈ విషయవలయాన్ని ఛేదించి, నేనై నీ దరికి చేరేది లేదు. జగన్నాటక సూత్రధారివి నీవే తరుణం చూచి తెరమీది ఈ బొమ్మను తరింపజేయి. దేవా! శ్రీ తిరుపతి వేంకటేశ్వరా!' జీవన సంఘర్షణలో పడి ఉన్న మానవులందరిదీ ఈ విన్నపం.

**పాతకుండగు దురితుడైనను – పరమపావన చరితుడైనను**
**భక్తితో శ్రీహరిని గొలిచిన – ముక్తి పొందెడు మార్గమొకటే**

అనే విషయాన్నే ఇప్పటి కవులందరూ వివిధ మార్గాలలో వ్యక్తపరిచారు. స్వామిని గురించి గేయం రాసినా, పద్యం రాసినా, శతకం రాసినా ఆ రచనలలోని ప్రధాన విషయం శరణాగతి పొందడమే. సమాజంలోని అవాంఛనీయ విషయాలనన్నిటినీ కవులు స్వామికి నివేదించారు. సమాజాన్ని స్వర్ణతుల్యం చేయుమని కోరారు. ఎన్ని విషయాలు ఏ రకంగా నివేదింప బడినా ఆ రచనలలో కవుల అంతరంగాలు, ఆ అంతరంగాలలో నిండుగా భక్తిభావాలు ఉంటాయి.

రాగద్వేషాలు, మోహపాశాలు, పక్షపాతాలు, దురభిమానాలు లేకుండా ప్రతిజీవి యెడల ప్రేమ కలిగి ఉండడం ధర్మం. అదే మానవ సంస్కృతి. సమాజంలో అలాంటి సంస్కృతిని వ్యాపింజేయుమని కొందరు కవులు స్వామిని కోరారు. అలాంటి సమాజం ఏర్పడితే ఆ సమాజంలో నివసించడం ఆనందప్రదంగా ఉంటుంది. ఎందరో భక్తులకు సుగతిని ప్రసాదించే వేంకటేశ్వరుడు సమాజాన్ని సమత, మమతలతో నింపితే అదే సమాజానికి



మోక్షస్థితి అవుతుంది. మోక్షం రావాలంటే పుణ్యం సంపాదించాలని కొందరనుకొంటారు. అనేక పుణ్యకార్యాలు చేస్తే ఏర్పడే పుణ్యరాశి మోక్షమార్గానికి నడిపిస్తుందని నమ్మే వాళ్లున్నారు. పుణ్యకార్యం చేయలేక పోయినా, శ్రీనివాసుని దర్శనం కూడా పుణ్యప్రదమేనంటూ ఒక గేయకర్త (సప్తగిరి, మే 1991)

**ఎన్ని జన్మముల పుణ్యమో నిను – కన్నుల గాంచుట పరమాత్మా!**
**కొరతలేదు కోరి యెక్కిన – కోర్కెలు తీర్చే కొండలరాయా!**

అంటూ స్వామిని కన్నులారా చూడడంవల్ల ఏ కొరతా ఉండదని అభిప్రాయపడుతున్నాడు. కొండకు వెళ్లి స్వామిని దర్శించలేనివాళ్లు మదిలో ఆ వేంకటపతిని నిత్యమూ తలచుకొంటూ ఉండినా మనోవికారాలు పోయి మోక్షమార్గం కనపడుతుంది. **'రండి దర్శింప స్వామిని'** అనే పేరుతో కె.వి. రామారావు రాసిన ఏడు పద్యాలలో (సప్తగిరి, జనవరి 2009) ఒక పద్యమిది–

**కనుల పుణ్యంబు జెప్పుట కాదు, హరిని**
**గాంచి నంతనె ఐహిక వాంఛలన్ని**
**సమయ బాంధవ్య బంధముల్ శాంతి నొందు**
**మనసు పరుగిడు దైవత్వమార్గమందు**

ఐహిక వాంఛలు నశించి శాంతి పొందిన మనస్సు దివ్యమార్గంలో పరుగిడడం మోక్షస్థితికి ప్రథమ సోపానం. స్వామిని దర్శించడం వల్లనే అది సాధ్యం.

శ్రీవేంకటేశ్వరస్వామి మూర్తిని దర్శిస్తే భక్తులందరూ తన పాదాలను శరణు పొందమని వరదహస్తమైన కుడిచేతితో నిర్దేశిస్తున్నట్లు స్ఫురిస్తుంది. కుడిచేయి అభయ హస్తం. అది ఆకాశమంత చేయి. అర్థించిన వాళ్లను వర్ధింపజేస్తుంది. ముక్కోటి వేల్పులకు మూలమీచేయి. భక్తులకు వరాలిచ్చే బంగారు చేయి. ఒక గేయకర్తకు స్వామి హస్తం ఇలా కనిపిస్తే కె.సి.జయచంద్ర

శాస్త్రిగారికి స్వామి పాదాలు సర్వసంపదలు ప్రసాదించేవిగా స్ఫురించాయి. **'ఓం నమో వేంకటేశాయ'** అనే పేరుతో ఆయన రాసిన ఐదు పద్యాలలో (సప్తగిరి, సెప్టెంబర్ 2003) ఒక పద్యమిది.

**అడుగడుగున విడువక నీ, యడుగుందమ్ములను భక్తినాత్మదలంపన్**
**పొడమెడు నిడుములు సడలెడు, వడివడిగా వచ్చి సర్వసంపదలబ్బున్**

అడిగినవారికి అభయమిచ్చే ఆపద్బాంధవుడు, పిలిచినంతనే పలికే ఆర్తత్రాణ పరాయణుడు శ్రీనివాసుడు. భక్తులలో కొందరు తాత్త్విక సంపదనివ్వ మని స్వామిని కోరుతారు. మరికొందరు భౌతిక సంపదలను అడుగుతారు. ధనధాన్య భోగభాగ్యాలను ప్రసాదించే అమ్మ శ్రీమహాలక్ష్మి. తన భక్తులకు సంపదలు కురిపించమని తన వక్షం మీద ధరించిన లక్ష్మిని ప్రేరేపిస్తాడు పరంధాముడు. సకల సంపదలకు నిలయమైన శ్రీలక్ష్మి స్వామి ఇచ్ఛానుసారం భక్తులను అనుగ్రహిస్తూ ఉంటుంది. కింది పద్యం ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నది.

**సుందరమూర్తివై వెలసి సోయగ మొల్కగ ఏడుకొండలం**
**దిందరిలోన మాధరణి కిమ్మగు కోర్కెలు తీర్చువాడవై**
**ఇందిర మానసాబ్జమున నెంతయు గాదిలి వాసమేర్పడన్**
**సందర మల్లుడై సకల సంపదలందిన వేంకటేశ్వరా!**

స్వామి ఇందిర మనస్సులో నిలిచి సకల సంపదలతో ఏడు కొండలమీద నిలిచాడని కాకర్ల శ్రీరామమూర్తి రచించిన పై పద్యం (వేంకటేశ్వర శతకం, 2010) చెపుతున్నది. వక్షం మీద కొలువుండి భక్తులకు మోక్షం ప్రసాదించ మని స్వామి మనస్సులో స్ఫురింపజేసేది కూడా లక్ష్మీదేవియే. అడగని వాని దోషమేగాని, లేదనేమాట స్వామికిగాని, అమ్మకుగాని నోటినుండి రాదు.



మాకు ముక్తినివ్వు స్వామీ అని అడగనవసరం లేదు. తిరుమల ముక్తిధామం. దేవతలందరూ తమతమ రూపాలతో కొండపైన తిరుగుతున్నారు. నారాయణ, శేష, గరుడ, అంజనాద్రి గిరులు సకలోన్నతాలు, సత్కామ్య ప్రవర్షాలు. అలాంటి తిరుమలలో స్వామిని దర్శిస్తూ ఆధ్యాత్మికానుభూతిని పొందడమే ముక్తి. ముక్తికోసం మరొక లోకానికి వెళ్లనవసరం లేదు. స్వామిని అత్యంత సన్నిహితంగా దర్శిస్తూ పూజిస్తూ ఉండే భక్తజనులు చెప్పే మాటలివి. తిరుమల వైకుంఠం, శ్రీనివాసుడు వైకుంఠుడు అయినప్పుడు స్వామికి సన్నిహితంగా మెలిగే భక్తులు నిత్యసూరులు కాకుండా పోతారా? వాళ్లు నిత్య సూరులే అవుతారు. తిరుమల కొండకు వచ్చే సామాన్య భక్తులకు కూడా మోక్షమిచ్చి కాపాడమని కింది పద్యంలో టి.మహబూబ్ సాహెబ్ (సప్తగిరి, డిసెంబర్ 1991) స్వామిని ఇలా వేడుకొన్నాడు.

**పక్షివాహన! అంబుజోదర! పారమార్థిక చింతనన్**
**భిక్షులై నినుమానసంబున ప్రీతి గొల్చెడు భక్తులన్**
**అక్షయంబుగ మంగళంబుల నాదరంబున కూర్చుచున్**
**మోక్షమార్గము చూపి చేర్చుచు మోదమందుచు బ్రోవుమా!**

శ్రీనివాసుడు మోక్షమిచ్చే దేవుడు కాబట్టే మహబూబ్ సాహెబ్ అలా కోరుకొన్నాడు. ఒక మహమ్మదీయుడు శ్రీవేంకటేశ్వరుని ప్రస్తుతించడం సర్వసమత్వ విషయాన్ని తెలిపే అంశం. బీబీనాంచారి కారణంగా స్వామితో తమకు సంబంధం ఉన్నట్లు కొందరు మహమ్మదీయులైనా భావిస్తూ ఉన్నారు.

మోక్షం రావాలంటే ముందు అప్పటివరకు చేసిన పాపాలన్నీ హరించి పోవాలి. మోక్షేచ్ఛతో కొండకు వెళ్లే భక్తుల పాపాలలో సగం కపిలతీర్థంలో స్నానం చేసినపుడే పోతాయని, మిగిలిన సగం కొండపై 'పాపనాశం' తీర్థంలో మునిగినపుడు పోతాయని ఒక విశ్వాసం ఉంది. భక్తుల పాపాలను కడగడానికి శ్రీనివాసుడు తన పాదాలనుండి పుట్టిన గంగను పాపనాశం పేరుతో ఒక తీర్థంగా నిలిపినాడనే భక్తుల విశ్వాసాన్ని బూరెల సత్యనారాయణ మూర్తి తన 'శ్రీవేంకటేశ్వర' శతకం (1975) లో ఇలా వివరించాడు.

**నెనరును వీడి పాపములనేకము సల్పిన నాదు బోంట్ల ర**
**క్షణకట నిల్పినావట పసందుగ గంగను 'సర్వపాపనా**
**శని' యనుపేర పాపములు సర్వము మున్గిన యంతమాత్రనే**
**అనువుగ వీడి పోవునుట! అజ్జరె! చిత్రము వేంకటేశ్వరా!**

సర్వపాపాలు 'పాపనాశని' లో మునిగిన వెంటనే వీడిపోతాయట. లోకం విశ్వసిస్తున్న విషయమే ఈ పద్యంలో చెప్పబడింది.

ముడుపులు నీకిచ్చి వేంకటేశ్వరా! మా మొక్కులు తీర్చుకొంటున్నాం. ముక్తికోరి నీ కోసం వచ్చే భక్తులను కాపాడు. నరక సదృశమైన ఈ భూమిని స్వర్గంగా మార్చు. మానవులు నిన్ను చేరుకోవడంలో (నీ దర్శనానికి రావడంలో) గల పరమార్థం తెలుపు. ఈ మాటలు 'నమో వేంకటేశా' అనే సినిమాపాట (రావులపర్తి భద్రిరాజు) లోనివి. సి.సుబ్బారావు రచించిన 'నీ కొండకు నీవే రప్పించుకో' అనే మరొక పాటలోని రెండు చరణాలివి -

**కొండంత సంసారం మోయలేని మానవులం**
**ఏడు కొండలనెక్కి రమ్మంటే రాలేము**
**సాటి మనిషి సౌఖ్యానికి సాయపడని దుర్బలులం**
**స్వర్గానికి నిచ్చెనలు వేయలేము వేయలేము ॥నీ కొండకు॥**

**మా మనస్సు మా హృదయం పరస్పరం శత్రువులై**
**మా లోపలి దివ్యజ్యోతి మసకేసి పోతున్నది**
**అహంకార మణగించి మమకారం తొలగించి**
**చేయూత నిచ్చి మమ్ము చేరదీసుకో ॥నీ కొండకు॥**

కొండంత సంసారంలో మునిగి బయటపడలేని దుర్బలులైన మానవులను చేయూతనిచ్చి చేరదీసుకోమనడంలో శరణాగతి ఉంది. 'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ' అనే భావం ఉంది. సినిమాల ద్వారా కూడా ప్రేక్షకులలో భక్తిభావం కలిగించే ప్రయత్నమిది. ఇలాంటి పాటలు ఇంకా కొన్ని ఉన్నాయి.

# తలనీలాలు

ఇలువేల్పుల దేవాలయాలలో పిల్లలకు పుట్టు వెంట్రుకలు తీయించుకొనే సంప్రదాయం ఉంది. దేవాలయాలకు రాలేనివాళ్లు, ఆ సమయానికి వీలుగాని వాళ్లు వాళ్ల బిడ్డలకు ఇండ్లలోనే ఆయా ఇలువేల్పుల చిత్రపటాలు పెట్టుకొని సంప్రదాయబద్ధంగా కార్యక్రమం నిర్వర్తించి, ఆ వెంట్రుకలను పసుపు గుడ్డలో మూటగా కట్టి ఉంచుకొంటారు. తరువాత ఎప్పుడో దేవాలయాలకు వచ్చినప్పుడు ఆయా దేవాలయాల హుండీలలో ఇతర కానుకలతో పాటు ఆ వెంట్రుకల మూటలను కూడా సమర్పిస్తారు. తిరుమల ఆలయం హుండీలో కూడా గతంలో ఇలాంటి పసుపు గుడ్డలతో కట్టిన కేశాలను సమర్పించేవారట. ఇప్పుడు ఈ పద్ధతి కనిపించదు. పిల్లల పుట్టు వెంట్రుకలు తిరుమలకు వచ్చి కల్యాణకట్టలో గాని లేక ఆ సౌకర్యం ఉన్న వసతి గృహాలలో గాని తీయిస్తున్నారు. తరువాత దర్శనానికి వెళ్లి ఆ సందర్భంలో సమర్పించాలను కొన్న కానుకలను హుండీలో వేస్తున్నారు. కొందరు తలవెంట్రుకలు తీయించు కొన్న తరువాత ఆలయానికి వచ్చి తమ పిల్లలకు తులాభారం వేయించు కొంటారు. ఇది పుట్టు వెంట్రుకలకు సబంధించిన విషయం.

వివిధ సందర్భాలలో స్వామికి తలనీలాలు సమర్పిస్తామని కొందరు మొక్కుకొంటూ ఉంటారు. అలాంటి వాళ్లు కొండకు వచ్చి తలనీలాలు సమర్పిస్తారు. ముందురోజులలో కొండకు వెళ్లిన ప్రతి ఒక్కరూ తల గుండు చేయించుకొనేవారు ఎక్కువగా కాలి నడకనే వెళ్లి దర్శనానంతరం కొండ దిగుతున్నపుడు చూస్తే అందరూ గుండులతోనే కనిపించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. కొండకు వెళ్లిన వాళ్లందరూ తలనీలాలు సమర్పించడం కనిపించదు. గతంలో స్త్రీలు కూడా తలనీలాలు సమర్పించేవాళ్లు. ఇప్పటి స్త్రీలలో అతి తక్కువమంది గుండు చేయించుకొంటున్నారు. కొందరు స్త్రీలు

తమ జుట్టులో కొద్దికొద్దిగా మూడు కత్తెరలు ఇచ్చి గుండు చేయించుకొన్నా మనుకొంటున్నారు. భక్తులు తీర్థక్షేత్రాలలో శిరోముండనం చేయించుకోవడం లోని అంతరార్థాన్ని పద్మపురాణం ఇలా చెప్పింది.

**తీర్థోపవాసః కర్తవ్యః శిరసోముండనం తథా**
**శిరోగతాని పాపాని యాన్తి ముండనతో యతః**

విధిగా తీర్థక్షేత్రాలలో తలవెంద్రుకలు తీయించుకోవాలి. అందువల్ల శిరస్సులో ఉన్న పాపాలు పోతాయి. బుద్ధిపూర్వకంగా చేసిన పాపాలు, రోగాలు, అహంకారాలు నశిస్తాయి. తలచిక్కులను (తలనీలాలను) స్వీకరిస్తూ, భక్తుల చిక్కులను (సమస్యలను) తీరుస్తూ స్వామి భక్తుల చేతికి చిక్కుతూ వాళ్లను రక్షిస్తున్నాడు.

భక్తులు ముడుపులు తీసుకొని వచ్చి ముందుగా క్షురకుల దగ్గరకు వెళతారు. అక్కడ పాపరాశివంటి కేశరాశిని తొలగించుకొంటారు. తరువాత పుష్కరిణిలో మునిగి ఊర్ధ్వపుండ్రాలు ధరించి స్వామి దర్శనానికి వెళతారు. తలమీద ఉండే జుట్టు పొగరుకు చిహ్నమట. జుట్టు అందం కూడా ఇస్తుంది. అందంగా ఉన్నాననే పొగరును తొలగించి భక్తులను సత్త్వదశకు చేర్చడానికి స్వామి జుట్టునే మొక్కుగా గ్రహిస్తాడని ఎమ్.సి.కన్నయ్య రాసిన కింది పద్యం చెపుతుంది.

**జుట్టుంటే పొగరేరా, జుట్టుంటే అందమేర చూపులవరకే**
**జుట్టే మొక్కుగ గొందువు**

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఎప్పుడో రాసిన ఐదు పద్యాలు 'ఏడుకొండలవాడ' అనే పేరుతో సప్తగిరి, సెప్టెంబరు 1996 సంచికలో ప్రకటింపబడినాయి. ఆ పద్యాలలో ఒక సీసపద్యమిది –



**నిలువుదోపుడు దోచు నెఱ దొంగతనమేమి!**
**పాపముల్ హరియించు భావమొక్కొ**
**వడ్డికాసులగూర్చి వ్యాపారమదియేమి?**
**మేలు పెంపొందించు లీలయొక్కొ**
**తలమీది నీలాల దొలచి పుచ్చుట యేమి?**
**చిక్కులం దెగటార్చు పక్కి యొక్కొ**
**ఏడుకొండల మీద వీడౌటయేమి? స**
**హస్రార వసతి రహస్యమొక్కొ**

**ఏటివో యివి పెద్దల నాటి మాట**
**లీశ్వరుడు సర్వభూత సుహృత్తు, సుహృదు**
**డాపదపహర్త, యనువార్త కలరి యట్టి**
**వాడవను కన్నెతిగి కొల్చినాడ నిన్నె.**

వేంకటేశ్వరుడు భక్తుల పాపాలను హరించడానికి నిలువుదోపులు గ్రహిస్తున్నాడు. మేలు కలిగించడానికి వడ్డికాసులు అంగీకరిస్తున్నాడు. చిక్కులు తొలగించడానికి తలనీలాలు పుచ్చుకొంటున్నాడు. సహస్రార స్ఫురణ కలిగించడానికి ఏడుకొండలను వీడుగా ఉన్నాడు. ఇవన్నీ పెద్దలనాటి మాటలు. స్వామి సర్వభూతాల ఆపదలను హరిస్తాడు. ఈ నమ్మకంతోనే భక్తులు తిరుమలకు వచ్చి స్వామిని సేవిస్తున్నారు.

కొందరు భక్తులు తలనీలాలు సమర్పిస్తామని మొక్కుకొని అప్పటినుండి జుట్టు పెంచుకొంటారు. గడ్డము మీసాలు తియ్యరు. గుంపుగూడుగా వెంద్రుకలు పెరుగుతాయి. తరువాత ఎప్పుడో తీరిక సమయం వచ్చినప్పుడు కొండకు వస్తారు. ముఖ్యంగా పల్లెప్రాంతాల భక్తులు వెంద్రుకలిస్తామని మొక్కుకొన్న తరువాత వ్యవసాయం పనులు వస్తే ఆ పనులు పూర్తయ్యే

వరకు వెంద్రుకలు పెంచుకొంటారు. దట్టంగా జుట్టు పెరగడం వల్ల పేలు పడే అవకాశం ఉంటుంది. నారాయణశర్మ పద్యమిది – (వేంకటేశ్వర త్రిశతిలో 123 వ పద్యం).

**మాసిన, పేలు పడ్డ, తలమాసిన భక్తులు దూర తీర సం**
**వాసులు కొల్వ వచ్చిరట, వారిని చూడర పిచ్చిదేవరా!**
**ఆ సిరి యే విధాన నిను నాదరమొప్పగ చేరుచుండె నో**
**చేసిన చేష్టలంగనుచు, చీదర నొందక వేంకటేశ్వరా!**

మాసిన, పేలుపడిన జుట్టును నీ కివ్వడానికి దూరప్రాంతాలనుండి భక్తులు వస్తూ ఉంటే వాళ్ల మురికి తలనీలాలను గ్రహిస్తున్నావు. నీకిది పిచ్చిగాకపోతే తెలివైన వాడు ఇలా గ్రహిస్తాడా? ఆ మురికి నీకూ అంటుకొంటుంది గదా! అలాంటి నీ దగ్గరకు లోకమాత లక్ష్మీదేవి ఎలా వచ్చి నిన్ను సేవిస్తున్నదో! ఈ పద్యంలో స్వామి చేసే పనిని పిచ్చిచేష్టగా భావించినా, ఎంతో భక్తితో అన్నమాటే అది. మురికిజుట్టును గ్రహించడం అంటే ఆయా భక్తుల హృదయాలలో పేరుకొన్న కశ్మలాన్ని తొలిగించడమని అర్థం. ఎన్నో పాపాలు చేసి, ఎందరి తలలనో కొట్టి ఐశ్వర్యమదంతో గుణవంతులుగా నటిస్తూ దొంగభక్తులు 'కంపుగొట్టు తలమైల' ను ఇవ్వడానికి కొండకు వస్తారు. అలాంటివాళ్ల మురికి తలవెంద్రుకలను కూడా గ్రహిస్తున్నావు. బాగానే ఉంది కాని, ఆ దొంగభక్తులను కాస్త గమనించు (254 వ పద్యం) అని శర్మగారు స్వామిని హెచ్చరిస్తున్నారు.

అనుకొన్న పనులు నెరవేరాలనుకొనేవాళ్లు, పదవులకు పాకులాడే వాళ్లు స్వార్థపరులు. అలాంటివాళ్లు నీకు తలనీలాలు ఇస్తున్నారు. అది నీకు తెలుసు. కేశాలు సమర్పిస్తే పాపాలు పోతాయని పెద్దలు చెప్పగా విని ఆ విశ్వాసంతో కొండకు వచ్చి గుండు గీయించుకొనే వాళ్లు నిజమైన భక్తులు. ఆ విషయం చెప్పే పద్యం –



**శిరమున గల్గు కేశములు చెన్నువహించిన పాపరాశులం**
**చరయక వాని ఖండనమె యచ్యుత! దేహికి గల్గు పాపముల్**
**సరిగ తొలంగుచుండుగడుచక్కగ బోధనలొంది మానవుల్**
**నిరతము కేశఖండనము నీ దరిఁజేతురు వేంకటేశ్వరా!**

ఈ పద్యం ముదిగొండ నాగమల్లికార్జునరావు రచించిన శ్రీవేంకటేశ్వరశతకం లోనిది. వెంద్రుకలు సమర్పించడంవల్ల పాపాలు పోతాయని తెలుసుకొని భక్తితో గుండు గీయించుకోవడానికి స్వామి సన్నిధికి భక్తులు వస్తున్నారని పద్యభావం. మానవుల కేశాలకు విపణిలో ఎంతో గిరాకి ఉంది. తి.తి.దే. కేశాలను అమ్మడం ద్వారా ప్రతి సంవత్సరం పెద్ద మొత్తంలో ధనం సంపాదిస్తూ ఉంది. స్వామి కోశాగారానికి అధిక మొత్తం జమ అవుతూ ఉంది. తలనీలాలు లక్షల ధనం కురిపిస్తాయి కాబట్టే తిరుమలవాసునికి వెంద్రుకలమీద ఎంతో ఇష్టం ఏర్పడిందని కొందరు కవులు అభిప్రాయపడినారు. గుండ్లు చేయించు కొన్న వారంటే స్వామికి ఎంతో ప్రీతి కలగడానికి కూడా అదే కారణమని భావించారు.

* * *

## హుండి

వేంకటేశ్వరస్వామికి సమర్పించడానికి తెచ్చి ముడుపులను, వడ్డికాసులను భక్తులు హుండీలో వేస్తారు. ఈ రెండు రకాల కానుకలే కాకుండా ఇంకా అనేక విధాలైన కానుకలు హుండీలోనే సమర్పింపబడతాయి. డబ్బుతోపాటు బంగారు, వెండినగలు కూడా హుండీలోనే పడుతున్నాయి. ప్రత్యేక సందర్భాలలో సంపన్నులైన భక్తులు పెద్ద పెద్ద బంగారు ఆభరణాలు, పళ్లెరాలు ఇత్యాదిగా వాళ్లు స్వామికి ఇవ్వాలనుకొన్నవి చేయించి తెచ్చి ఆలయాధికారులకు సమర్పిస్తారు. ఇలా ప్రత్యేకమైన కానుకలు కాకుండా తదితరాలైన కానుకలన్నీ హుండీలోనే సమర్పింపబడతాయి. కొందరు భక్తులు తమ ఆస్తులను కానుకలుగా సమర్పిస్తారు. అలాంటి ఆస్తులలో భూములుంటాయి. ఇండ్ల స్థలాలుంటాయి. ఇండ్లు ఉంటాయి. వీటిని సమర్పించేవాళ్లు ఆయా కానుకల హక్కుపత్రాలను తెచ్చి హుండీలో వేస్తారు. ఇన్ని రకాల కానుకలతో తిరుమలస్వామి అధిక సంపన్నుడుగా ఉన్నాడని కవులు చెపుతున్నారు. మాచవరం వెంకటసుబ్బారావు రాసిన 'నీరాజనం' అనే పద్యసప్తకం (సప్తగిరి, మార్చి 1996) నుండి ఆ విషయాన్ని తెలిపే ఒక పద్యమిది –

**ఎంత భోగమయ్య, ఏమి పల్లకిలయ్య**
**క్షణము వీడకుండ సేవలయ్య**
**ధనము జూతుమన్న దృష్టి దోషమటయ్య**
**వేంకటాద్రి నిలయ వేంకటేశ!**

స్వామికిగల అపరిమితమైన సంపదలను చూస్తుంటే దృష్టి దోషం కలుగుతుందట. దృష్టిదోషం తగలకుండా భక్తులు కర్పూరం వెలిగించి 'దిష్టి' తీస్తారని కూడా చెప్పబడింది.

ప్రజల నోళ్లుగొట్టి సంపాదించిన ధనంలో కొందరు పాప పరిహారంగా కొంత నీకూ ఇస్తూ ఉంటారు. అలాంటి పాపపు ధనం నీ కెందుకు శ్రీనివాసా! అంటూ గన్ను కృష్ణమూర్తి **'శేషశైలవాస శ్రీనివాస'** అనే పేరుతో రాసిన పద్యాలలో (సప్తగిరి, డిసెంబర్ 1979) అడుగుతున్నాడు. పాపపు సొమ్ము హుండీలో వేస్తే స్వామి ఆమోదించడని, దానివల్ల పాపప్రక్షాళన కాదని కవి అభిప్రాయం. 'గంగిగోవుపాలు గరిటడైనను చాలు' అన్నట్లు ధర్మబద్ధంగా సంపాదించిన సంపాదనలోనే ఇవ్వగలిగినంత స్వామికి ఇస్తే దేవుడు మెచ్చుతాడు. దానికి ప్రయోజనమూ ఉంటుంది. హుండీ ద్వారానే గాక ఇంకా అనేక విధాలుగా సంపాదించి రాశిపోసిన ధనం ఎవరికోసం ఖర్చు పెడుతున్నావని నారాయణశర్మ శ్రీనివాసునే అడుగుతున్నాడు. పేద భక్తులకోసం అయితే వాళ్లకు అందుతున్నదా? వాళ్ల ఆకలిదప్పులు తీరుతున్నాయా? ఈ రెండు ప్రశ్నలకు తగిన సమాధానం దొరకడం లేదు. బాగా గమనిస్తే అందరూ చేరి దేవుడి ధనాన్ని భాగం పంచుకొని ఆరగిస్తున్నారు. దేవాలయం రాబడి రాబందుల నోటిముక్క అయిపోయింది. (శ్రీవేంకటేశ్వర త్రిశతి, 47వ పద్యం). శర్మగారు వెలిబుచ్చిన ఈ అభిప్రాయంలో కొంతైనా వాస్తవం లేకపోలేదు. ఎంతో కొంత హుండీలో తెచ్చివేస్తే వాళ్లను కాపాడుతూ ఠీవిగా నిలుచున్నావు. వాళ్లు ఎలాంటి భక్తులో కాస్త గమనించమని కూడా శర్మగారు స్వామికి హెచ్చరిక చేశారు. సంపన్నులు హుండీలో వేసే మొత్తం పేదల పొట్టలు కొట్టి సంపాదించిందేనట.

**మోసముజేసి సంపదలమూటలు గట్టిగ గట్టి, హుండిలో**
**వేసిరి లోభు లీభువిని పేదల పొట్టలు గొట్టి విత్తముల్**
**రాసుల వోసి ..........................................**

అని శర్మగారు చెప్పినమాట ఆలోచింపదగిందే. అక్రమ సంపాదనాపరులను కాపాడితే సక్రమ మార్గం సాగదు. వక్రపు బుద్ధి కలిగినవాళ్లను సుదర్శన చక్రంలో తుంచమంటున్నాడు స్వామిని. అలా చేయకపోతే స్వామి ఉండడమే వ్యర్థమట (262, 263 పద్యాలు). తిరుమలేశుడు జాగ్రత్త పడకపోతే స్వార్థపరులు హుండీనే దోచుకొని పోతారని ఈ పద్యంలో (288 వ పద్యం) చెప్పబడింది.

**దేవుని యాలయాన తగదే! యెటుచేయగ నేమి తప్పు? మా**
**దేవుడె కాచునంచు గడితేరిన దొంగలు నిర్భయంబుగా**
**తావక సంపదాళి పలుదారుల దోచరె? జాగరూకతన్**
**భావి దలంపకున్న నొక పైసయు నిల్వదు వేంకటేశ్వరా!**

దొంగనతం చేస్తే పట్టుబడకుండా ఉండడానికి దొంగలు కూడా దేవుని వేడుకొంటారు. భక్తి గలిగితే చాలు దేవాలయంలో ఏమిచేసినా తప్పులేదను కొంటారు దొంగ ప్రవృత్తి గలవారు. అలాంటి వాళ్లు హుండీని దోచేస్తారని చెపుతున్నా, కవికి స్వామి తన సొమ్మును తాను కాపాడుకోగలడనే విశ్వాసం ఉంది. చోరులకు దండన కూడా తప్పక ఉంటుందని కవికి తెలుసు.

హుండీలో పడే సొమ్ము ఏయే మార్గాలలో గడించినదో తెలియదు. ఏయే కోర్కెల బోనులో నిలబడి సంపాదించిందో. కొందరు లంచాల ద్వారా సంపాదించినదై కూడా ఉండవచ్చు. వేంకటేశ్వరుని సాయం కోరి ఇలాంటి ధనాన్ని హుండీలో వేసే వాళ్లను కాపాడి, వాళ్ల లంచగొండితనాన్ని స్వామి మెచ్చుకొంటాడా? అని వేమూరి వేంకటరామనాథం తన 'వినతి' లోని ఒక పద్యంలో సందేహపడుతున్నాడు. ఏ మార్గంలో ఆర్జించిన సొమ్మైనా హుండీలో పడినంతనే పవిత్రమై పోతుందట. హుండి వేంకటేశ్వరుని వాణిజ్యమట. హుండీ ధనంలో కొంతభాగాన్నైనా సాంఘిక సంక్షేమానికి తి.తి.దే. ఖర్చు చేస్తున్నది. ఇలాంటి కారణానికి వ్యయం చేయడం మంచిదే. అయితే లంచపు సొమ్ములు తెచ్చే వాళ్లలో మార్పు కలిగించి వాళ్లను మంచిపౌరులుగా చేయుమని స్వామిని కోరడం మంచిది. రామనాథమే తన రచనలోని 'హుండీ' అనే శీర్షికలో హుండీలో డబ్బువేసే వాళ్ల మనస్తత్వాన్ని బాగా గుర్తించారు కింది పద్యంలో.

**లోకులెఱుంగ నట్టులుగ రూకలు కొందఱు రాల్చి హుండిలో**
**ప్రాకటరీతి నల్వురి తలంపుల కెక్కుదునట్లు కొందఱు**



**త్సేకము మింటి నంటునటు దేవుని మాట యటుంచి, మానవా**
**లోకన మబ్బునన్న తమితో ధనరాశులు గుప్పుచుందురే!**

భక్తులలో కొందరు ఇతరులకు తెలియని విధంగా వాళ్లు తెచ్చిన కానుకలను హుండీలో సమర్పిస్తారు. తాము సమర్పించిన విషయం దేవుడికి తెలిస్తే చాలుననుకొంటారు. కొందరు తాము హుండీలో వేస్తున్నది అందరూ చూడాలనుకొంటారు. దేవుని మాట అటుంచి అందరూ గమనించడమే వాళ్లకు కావలసింది. దీనివల్ల వాళ్లకు కలిగే లబ్ధి ఏముంటుందో తెలియదు. అయితే ఈ విషయాన్ని శ్రీనివాసుడు తప్పక గుర్తిస్తాడు.

* * *

## తిరుమలలో శంకరాచార్యులవారు

తిరుమలకు విశేషంగా భక్తులు రావడం, స్వామికి అపరిమితంగా హుండీ నుండి ఆదాయం లభించడం ఆశ్చర్యకరమైన విషయమైనా, స్వామి మహిమే అంతటికీ కారణమని భక్తులు నమ్ముతారు. ఎంతో కాలంనుండి తిరుమల ఆలయానికి ప్రఖ్యాతి ఉన్నా ఆదిశంకరాచార్యులవారి కాలంనుండి ఆ ప్రఖ్యాతి ఇంకా అధికమైనదని, వచ్చే భక్తుల సంఖ్య సంవత్సరానికి సంవత్సరానికి పెరిగిపోతున్నదని, భక్తుల కానుకల రూపంలో అపరిమితంగా స్వామికి ఆదాయం చేకూరుతున్నదని విశ్లేషకులు చెపుతూ ఉండడం వింటున్న విషయమే. ఇంత విశేషానికి కారణం శంకారాచార్యులవారు తిరుమల ఆలయంలో శ్రీచక్రాన్ని స్థాపించడమే నని చెపుతారు. శ్రీచక్ర స్థాపన వల్ల ఈ దేవాలయానికి జనాకర్షణ, ధనాకర్షణ శక్తులు వచ్చాయట. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలనుండి యాత్రికులుగా, భక్తులుగా జనం విశేషంగా తిరుమలకు వచ్చి స్వామిని దర్శించి కానుకలు సమర్పిస్తున్నారు. గతకొన్ని సంవత్సరాలుగా ఇతర దేశాలనుండి కూడా భక్తులు వస్తున్నారు. ప్రపంచంలో తిరుమల ఆలయానికున్న ఖ్యాతి మరొక ఆలయానికి లేదనడం అతిశయోక్తి కాదు.

శంకరాచార్యులవారు స్థాపించిన శ్రీచక్రం కారణంగానే అన్నివిధాలుగా తిరుమలఆలయ ప్రశస్తి పెరిగిందని అనేకుల విశ్వాసం. తిరుమల ఆలయంలో లాగే కొన్ని ఇతర ప్రాంతాలలోని దేవాలయాలలో కూడా శంకరాచార్యులవారు శ్రీచక్ర స్థాపన చేసినట్లు చెపుతారు. ఇలాంటి విషయాలు కథలుగానే ప్రచారంలో ఉన్నాయని కొందరి అభిప్రాయం. ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానందగారు 2009 మార్చి నెల సప్తగిరిలో 'తిరుమలేశుడు – త్రిమతాచార్యులు' అనే వ్యాసం రాశారు. అందులో వారి మాటలు – 'శంకరులు ఫలానా ఆలయంలో శ్రీచక్ర స్థాపన చేశారని, దానితో ఆలయంలో ఆకర్షణ పెరిగిందని కథలుగా చెప్పుకొంటారు. కంచి కామాక్షి అమ్మవారి ఆలయంలో మూలవిగ్రహం ముందు శ్రీచక్రం ఉంది. దానికి పూజాదికాలు ఉన్నాయి. శ్రీనివాసుని ఆనందనిలయ విమానంలో శ్రీచక్రం ఉనికి కనిపించదు. అయినా భక్తులకు శ్రీనివాసునిలో నిరంతరం వైష్ణవి అనుభూతిలోనే ఉంటుంది. స్త్రీ పుంస్త్వాలకు అతీతమైన పరబ్రహ్మ తత్వం శ్రీనివాసునిది. శ్రీలలితను కామకళాస్వరూపిణిగా, ఆనందనిలయ వాసినిగా అర్చిస్తారు. శ్రీచక్రానికి ఆనందనిలయమనే అర్థం. ఇలాంటి తాత్త్విక నేపథ్యం భారతీయ ఆలయ నిర్మాణం వెనక ఉండి శ్రీవారి ఆలయ విషయంలో కూడా భక్తులలో ఐతిహ్యరూపం పొంది ఉంటుంది. సంప్రదాయ భావానుభూతులని వీటినే అంటాం. శ్రీ హరి ఆలయం కావించిన, కావిస్తున్న వైదికశాస్త్ర, ఆగమ పరిరక్షణ వెనక నిస్సందేహంగా శంకరుల ముద్ర ఉంది. చారిత్రక వాస్తవికత అయినా కాకపోయినా మనకు ఇబ్బందిలేదు.... శ్రీవారిని గోవిందునిగా గుర్తించి కీర్తించిన శంకరులవారు 'భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే' అనడంలో గోవిందుడు భూమిని పొందిన వరాహమూర్తి అయినా, శ్రీనివాసుడైనా తప్పక శేషాద్రి నిలయుడే అనే విషయం స్మృతిలో ఉండాలి'. ఈ మాటలను బట్టి చూస్తే బ్రహ్మానంద గారిది ఒక విశ్వాసమే ననిపిస్తుంది. **'పిలిచితే పలుకుతావట'** అనే వేంకటేశ్వర స్తుతిమాలలో ఏడిద కామేశ్వరరావు రాసిన ఒక గేయంలోని కొంతభాగం –

**ఆదిశంకరుడు ఆర్తావనుడై**
**నీదు పీఠమును నిలిపినాడట**
**శ్రీచక్రమున కుబేరుడుండి**
**ధనపతి బిరుదము నిలుపు కొనెనట.**

ఈ గేయంలోని విషయం పూర్తిగా ఆధారం లేనిదే. లోకంలో ఎక్కడైనా స్వల్ప ప్రచారంలో ఈ విషయం ఉందేమో! లేదా ఈ గేయకర్త నివసిస్తున్న ప్రాంతంలో తిరుమల ప్రసక్తి వచ్చినపుడు అలా అనుకుంటూ ఉంటారేమో! ఊహలలో ఉండిన అంశాలకు చారిత్రకత ఉండదు.

హుండీని ఏర్పాటు చేసిన స్థలంలో ఆదిశంకరాచార్యులవారు శ్రీచక్ర ప్రతిష్ఠ చేశారని, అప్పటినుండి విశేషంగా ద్రవ్యరాశి హుండీలో చేరుతున్నదని భక్తులు నమ్ముతున్న విషయం వాస్తవమేనని శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం గారు రచించిన 'హరికొలువు' గ్రంథంలో (తి.తి.దే.ప్రచురణ, 2000, పుట 353) ఉటంకింపబడింది. రచయిత మాటలు – 'ఇది సత్యమే. ఈ హుండీ క్రిందుగా శ్రీచక్రమున్నట్లుగా ప్రత్యక్షంగా దర్శించిన తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు శ్రీరామనాథ ఘనాపాటిగారు ఈ (హరికొలువు) రచయితతో (1992 లో) చెప్పారు. సుమారు 70 ఏండ్ల క్రితం తాను వేదవిద్యార్థిగా వున్నప్పుడు ఆలయ అధికారులు నేలను ఎత్తు పెంచడానికిగాను హుండీ ఉన్న స్థలాన్ని త్రవ్వించూడగా శ్రీచక్రయంత్రం స్పష్టంగా గోచరించిందని అన్నారు. ఇందువల్లనే కాబోలు ఈ ఆలయంలో ఉత్సవాలు (కల్యాణోత్సవాలు వగైరా) నిర్వహించే స్థలాలను అటు ఇటు మార్పు చేశారు. కాని, ఈ హుండీని (కొప్పెరను) మాత్రం ఇక్కడి నుంచి కదల్చలేదు'.

* * *

# స్వామి ఉన్నాడు

స్వామి వేంకటనగంపై నిలిచి లోకాలను పాలన చేస్తున్నాడని భక్తులకు ప్రగాఢమైన నమ్మకముంది. మనుష్యులందరి అంతరంగాలను గమనిస్తూ, వారి వారి పాపపుణ్యాలను లెక్కిస్తూ ఉంటాడని నమ్ముతూ ఉండడం వల్లనే భక్తులు పవిత్ర జీవనం గడుపుతున్నారు. వీలైనన్నిమార్లు కొండకు వెళ్లి స్వామిని దర్శిస్తున్నారు. భక్తులలో ఆధ్యాత్మిక ప్రబోధం కలిగించడానికి తి.తి.దే. అనేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తున్నది. తిరుపతి నగరంలో అన్నమాచార్య కళామందిరం ఒక ఆధ్యాత్మిక వేదికగా ఉంది. ఈ మందిరంలో ప్రతిరోజూ అనేక భక్తి కార్యక్రమాలు జరుగుతూ ఉన్నాయి. నగర ప్రజలు అనేకులు ఈ కార్యక్రమాలను తిలకిస్తున్నారు. ఉపన్యాసాలు వింటున్నారు. సమాజంలో ఆధ్యాత్మిక భావాలను కలిగించడానికి అన్నమాచార్య కళామందిరం చేస్తున్న ప్రయత్నం ఎంతో ప్రాముఖ్యతను పొందుతున్నది. తిరుపతి నగరంలో వైష్ణవాలయాలతో పాటు శైవాలయాలు కూడా ఉన్నాయి. ప్రతి దేవాలయం లోనూ వివిధ ఉత్సవాలు, పూజాకార్యక్రమాలు జరుగుతూ ఉండడం వల్ల భక్తుల సందడి మిక్కుటంగా కనిపిస్తుంది. తిరుపతి ఒక ఆధ్యాత్మిక నగరంగా రూపుదిద్దుకొంటున్నది. ఈ విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానాలు చేస్తున్న ఆధ్యాత్మిక కృషి విశేషంగా గుర్తింపదగి ఉంది.

కొందరి దృష్టిలో తిరుమల, తిరుపతి వేరువేరు కావు. తిరుపతి వెళుతున్నామంటే శ్రీవేంకటేశ్వరుని దివ్యధామానికి వెళుతున్నామనే అర్థం. ఈ కారణంగా తిరుపతి దేశంలోని అనేక ప్రాంతాల వాళ్లనే కాక ఇతర దేశాల వాళ్లను కూడా ఆధ్యాత్మికంగా ఆకర్షిస్తున్నది. ఇక్కడికొచ్చే భక్తులు ఒకసారి స్వామిని దర్శిస్తే చాలు వాళ్లలో ఆధ్యాత్మిక గంధం అలము కొంటుంది. మళ్లీ మళ్లీ వచ్చి స్వామిని దర్శించడంతో పాటు వివిధ అర్చనా కార్యక్రమాలలో పాల్గొనాలని, వివిధ సేవలు చేయించాలని కోరుకొంటారు.

తదనుగుణంగా వాళ్ల కార్యక్రమాలను రూపొందించుకొంటారు. భక్తి తాత్పర్యాలు మనస్సులలో కుదరుకొన్న తరువాత స్వామిని అనేక విధాలుగా కీర్తించాలనుకొంటారు. అలా వాళ్లు చేసిన కీర్తనలు గేయాలుగా, పద్యాలుగా రూపొందుతున్నాయి. ఇలాంటి వీళ్లలో కవితాత్మ మేలుకొంటుంది. వాళ్లు తమ అంతరంగాలను తాము రచించే గేయాల, పద్యాల మూలంగా స్వామి ముందు విప్పుతారు. అనేక సామాజిక విషయాలను స్వామికి నివేదిస్తారు. వీళ్ల రచనలలో ఒక తాత్త్విక భూమిక ఉంటుంది. తమ జీవిత తత్త్వాన్ని అర్థం చేసుకొనే క్రమంలో శరణాగత తత్త్వం బోధపడుతుంది. కింది గేయభాగాలలో అలాంటి విషయాలు వ్యక్తమవుతాయి.

**భార్యాపిల్లల విడువగ పనిలేదు – సన్యసించినా ఫలమేమిలేదు**
**సర్వకర్మలు మానగ పనిలేదు – హరిపై భారము నిలుపవే మనసా!**
**కార్యము సేయుట నీవంతు అది – సఫలము చేయుట శ్రీహరివంతు**
**నమ్మినవారికి ఆపదలుండవు – శరణు శ్రీహరీ! శ్రీవేంకటేశ!**

ఇలాంటి నమ్మకమున్న భక్తులకు శ్రీనివాసుడు పిలిస్తే పలికే దైవమట. శ్రీహరి చెంత ఉంటే సిరిసంపదలు అక్కరలేదు. జగద్రక్షకుని అండ ఉంటే బంధుబలగాలు అవసరం లేదు. **'శరణు శ్రీహరి శ్రీవేంకటేశ'** అనే గేయ క్యావంలో ఎ.ఎస్.రాముడు వ్యక్తం చేసిన ఆలోచనలివి. ఈయన గాయకుడు కూడా. ఈ గేయకావ్య రచనను భక్తులు పాడుకోవడానికే చేసినట్లుంది. ఆ గేయకావ్యంలో ఒక కీర్తన –

**శ్రీనివాసుని భజన చేయండి – ఓ భక్తులార –**
**ముక్తిమార్గము చేరరారండి** ॥పల్లవి॥
**జాతి మతములు ఎంచబోకండి ఓ భక్తులార!**
**నీరు గాలికి జాతిలేదండి ఓ సుజనులార!**
**పేదగొప్పలు చూడబోకండి ఓ భక్తులార!**
**ఆకలి కది అడ్డు రాదండి ఓ సుజనులార!**



**అన్ని మతములు ఒక్కటేనని అంతయూ శ్రీరంగలీలని**
**పాపులను పరిరక్ష జేసే ప్రభువు రంగని చేరుకొండి॥శ్రీనివాసుని॥**

**సాటి మనుషుల గౌరవించండి ఓ భక్తులార!**
**శాశ్వతంబగు నేది లేదండి ఓ సుజనులార!**
**మంచితనమును పంచి చూడండి ఓ భక్తులార!**
**వంచనలకిక తావులేదండి ఓ సుజనులార!**
**వారు వీరని భేదమెంచక సర్వమానవులొక్కటేనని**
**సర్వజీవుల ప్రేమచూపున బ్రోచుదేవుని చేరుకొండి॥శ్రీనివాసుని॥**

మనస్సులో నిండిన శ్రీనివాసుని రూపం మనుగడను సాగించడానికి ఒక దీపం. స్వామి సేవ ఇహపర సుఖాలకు సాధనం. కైవల్యపథానికి మార్గం అని విశ్వసించే ఒక గేయరచయిత్రి స్వామిని సేవించడమే తన భాగ్యంగా భావించింది. ఆమె (సుందరవల్లీ శ్రీదేవి) రచించిన ఒక గేయంలోని పల్లవి ఇలా ఉంది.

**గడపకావల నీవు గడపకీవల నేను**
**ఎంత భాగ్యము నాకు ఈ రీతి సేవింప**

కొన్ని సంవత్సరాలకు ముందు భక్తులను స్వామి గడప వరకు వెళ్లి దర్శించడానికి అనుమతించేవారు. స్వామికి అంత దగ్గరగా వెళ్లి దర్శించడం ఆ గేయరచయిత్రి భావించినట్లు భక్తులకు గొప్పభాగ్యమే. దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు అపరిమితంగా పెరుగుతూ ఉండడం వల్ల దేవస్థానం స్వామి సమీపం వరకు వెళ్లడానికి ప్రస్తుతం అనుమతించడం లేదు. ఇప్పుడు అమలు చేస్తున్న లఘుదర్శనం జయవిజయుల వరకే. రచయిత్రి పేర్కొన్న గడపకు 'కులశేఖరపడి' అని పేరుంది. కులశేఖరులు ముకుందమాల రచయిత. ఆళ్వారులలో కులశేఖరాళ్వారుగా వీరు ప్రసిద్ధులు.

వేంకటేశ్వరస్వామికి తనవాడు, పరుడు అనే భేదం లేదు. భక్తే ప్రధానం. పెద్దవారికి పీట, పిన్నవారికి నేల ఉండదు. అందరూ సమానమే. తిరుమలలో తారతమ్యాలు ఉండవు. కానుకలిచ్చినా, చేతులు జోడించినా స్వామికి ఆనందమే. భక్తులకు గల చిత్తశుద్ధి ముఖ్యం. దళితగోవిందమని, ధనికుల వసంతోత్సవమని భగవంతుని దృష్టిలో తేడాలు లేవు. మనుషులలోనే తేడాలున్నాయి. ఎవరైనా సరే స్వామిని నమ్మి సేవించినవారికి ఆయనే అన్నీ. అనాథలకు ఆయనే నాథుడు. 'దిక్కులేనివారికి దేవుడే దిక్కు' అనే మాట సత్యం. ఇవన్నీ అనుభవజ్ఞుల మాటలు. పల్లెప్రాంతాలనుండి ఎందరో భక్తులు స్వామి దర్శనానికి వస్తారు. వాళ్లు బాగుండాలంటే వాళ్లకు ప్రధానాధారమైన వ్యవసాయం గిట్టుబాటుగా ఉండాలి. వ్యవసాయానికి తగిన వసతులు లేక పల్లెప్రజలు అనేక ఇక్కట్లకు లోనవుతున్నారు. కవులకు వ్యవసాయంపై ఆధారపడి జీవించే ప్రజలపై సానుభూతి ఉంటుంది. సమాజంలోని అన్ని వృత్తులలో ఉంటున్న వాళ్లకు ధాన్యం పండించి ఆహారం అందించే వాళ్లు రైతులే. శతకకవి కాకర్ల శ్రీరామమూర్తి రైతుల అవస్థలను స్వామికి విన్నవించి వాళ్ల బతుకులను బాగుచేయుమని కోరుతున్నాడు. 'స్వామీ! గడ్డి, నీళ్లు లేక కర్షకులు అగచాట్లు పడుతున్నారు. బీటలు వారిన పొలాలలో వీసమైనా పంట రావడం లేదు. బీదరైతుల దుర్గతిని పోగొట్టు. వర్షధారలను కురిపించి నేలమీద సిగ్గుమొగ్గలైన ధాన్యపు మొక్కల మొలకలకు పులకరింతలు కలిగించు. వాసనలేని పూలు, ఊసర క్షేత్రంలో మొలకెత్తిన విత్తనాలు, మొగసాలలో సంచరించే సతి, మూర్ఖుల సాహసం, మానసోల్లాసం లేని పనులు ఇత్యాదులతో వెలితిపడిన జీవితాలలో వెన్నెల కురిపించు'. ఇలా విన్నవించిన ఈ కవి విన్నపాలను స్వామి తప్పకుండా వింటాడు. సతి (గృహిణి) ఇంట్లో వండడానికి సరుకులు లేక, పిల్లలకు అన్నం చేసి పెట్టలేక, ఏమి చేయడానికి పాలుపోక, భర్త ఏదైనా తెస్తాడేమోనని ఎదురుచూస్తూ, మొగసాలలో అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది. ఇలాంటి కాపురాలను ఒక కంట కనిపెట్టమని భక్తులైన కవులు స్వామిని వేడుకొన్నారు.



సమస్త విశ్వాన్ని శాసిస్తూ శంఖుచక్రాలు ధరించిన శౌరి శ్రీనివాసుడు. తిరుమల విభూ! జగాలన్నీ నీలోనే నిండి ఉండగా కొండపైన గర్భగుడి (ఆనందనిలయం) లో బందీగా ఉన్నావు. ప్రాణులందరి కర్మఫలాలను నిర్ణయించే నీవు బందీగా ఉండడానికి కారణం నీ కర్మఫలమా? అని అడుగుతున్నాడు గంగరాజు మోహనరావు తన శ్రీవేంకటేశ్వరశతకంలో (2008). ఆయనదే మరొక పద్యం –

**ఆలి గల్గియు నామెను యవల ద్రోచి**
**మంగపురముకు పంపిన మాధవుండ!**
**కరియవేపాకు దెమ్మన్న కంచి వరద!**
**వేడు కొనియెద నా స్వామి వేంకటేశ!**

ఈ పద్యంలోని పై రెండు పంక్తులలోని విషయం ప్రసిద్ధంగా అందరికీ తెలిసిందే. మూడవ పాదంలోని కరివేపాకు కథ కొందరికి తెలుసు. కొందరికి తెలియదు. శ్రీనివాసుడు పద్మావతి అమ్మవారిని వివాహమాడిన తరువాత దంపతులిద్దరు కొండకు వెళ్లారు. అమ్మవారిని ఆమె తల్లిదండ్రులు సారె పెట్టి పంపినారు. ఆమె సారె పెట్టలతో స్వామి వెంట వెళ్లింది. ఇద్దరూ మోకాళ్ల పర్వతం వరకు వెళ్లారు. సారెగా అన్నీ తెచ్చినావుగానీ కరివేపాకు తెచ్చావా? అని స్వామి అమ్మవారిని అడిగాడు. తేలేదని చెప్పి, వెళ్లి తెస్తానని సారె పెట్టెలను అక్కడే వదిలి వెళ్లింది. మోకాళ్ల పర్వతం ఆనుకొని పెద్దపెద్ద పెట్టెలవలె కనిపిస్తున్న కొండగుట్టలు అమ్మవారు అక్కడ వదలిపెట్టిన సారెపెట్టె లేనని ఒక కథ భక్తలోకంలో ప్రచారంలో ఉంది. ఆ విషయం పై పద్యంలో గ్రంథస్థమైంది.

తిరుమలకు వెళ్లినంత మాత్రాన స్వామిని దర్శించుకోగలిగే అవకాశం కలుగుతుందని చెప్పడానికి వీలుకాదు. కొన్నిరోజులు లేదా కొన్ని నెలలముందే దర్శనం ఏర్పాట్లు చేసుకోవలసి ఉంది. ఇలాంటి ఏర్పాట్లు లేకుండా వెళితే

దర్శనం కష్టమే. నిండైన భక్తితో వెళ్లి 'క్యూ' వరుసలో ఓపికగా ఉంటే సర్వదర్శన సమయంలో దర్శన ప్రాప్తి కలుగుతుంది. దీనికి ఒక రోజంతా పట్టవచ్చు. ఒకటిన్నర రోజూ పట్టవచ్చు. ఎలాంటి ప్రయత్నం చేసుకోకుండా వెళ్లి వాళ్లకు కూడా శ్రీనివాసుని అనుగ్రహం ఉంటే దర్శనం సులభంగానే అవుతుంది. స్వామి అనుగ్రహం పొందడం భక్తితోనే సాధ్యమవుతుంది. ఒక కవి అనుభవం ఇలా ఉంది – ఈ కవి కొండకు వెళ్లాడు. దర్శనం దొరకడం కష్టమని తోచింది. ఇంటికి వెళ్లిపోదామని నిశ్చయించుకొన్నాడు. అంతలోనే సర్వదర్శనం నిలిపివేశారు. కారణం దేశప్రధాని దర్శనానికి వచ్చాడు. కోలాహలంగా ఉంది. ఆ జనంలో ఒకచోట నక్కి ఉన్న కవిని ప్రధాని చుట్టూ ఉన్న వర్గంలో ఉండిన ఆ కవి దగ్గర చదువుకున్న విద్యార్థి చూశాడు. కవిని తొందరగా రమ్మని పిలిచి ప్రధాని వెంట వెళ్లే వాళ్లలో చేర్చాడు. వాళ్లతో వెళ్లి కవి దర్శనం చేసుకొన్నాడు. దర్శనం దొరకడానికి కారణం స్వామికి తనపై కలిగిన అనుగ్రహమేనని విశ్వసించాడు. ఇది ఒక కవి స్వానుభవం. ఇలాంటి అనుభవాలు ఎందరికో ఉంటాయి. కొండకు వెళ్లే భక్తులు తెలుసుకోవలసిన విషయం ఒకటుంది. వెళ్లినప్పటినుండి దర్శనం కాలేదని తపన పడకూడదు. నిశ్చలమైన భక్తితో స్వామి నామాన్ని జపిస్తూ దర్శన సమయం వరకు కాలక్షేపం చెయ్యాలి. స్వామి అనుగ్రహం ఉంటేనే కొండకు రావాలనే తలంపు కలుగుతుంది. కొండకు వచ్చిన తరువాత దర్శనం దొరకకుండా ఎలా ఉంటుంది? తప్పక దొరుకుతుంది.

* * *

# భక్తుల నిందాస్తుతులు

**అడుగడుగు ముడుపులే! అంత వైభోగమా!**
**ఒడలెల్ల తొడవులే! అంత సింగారమా!**
**ఏమైన దొరవీవు! నీకు చెల్లిందిలే!**
**ఈ భక్త బృందమ్ము నీకు జే అందిలే!**

రసరాజు రచించిన ఈ గేయంలో (సప్తగిరి, ఫిబ్రవరి 1996) అతిసమీపానికి వెళ్లి దర్శించిన శ్రీనివాసుని వైభవం కనిపిస్తున్నది. దొరవు నీవు, నీకు చెల్లిందిలే అనే మాటలలో రాజ్యంలోని అన్ని విషయాల మీద ప్రభుత్వం నెరపే ఒక రాజు స్ఫురిస్తాడు. స్వామి విషయంలో అయితే భక్తబృందం. రాజు విషయంలో రాజ్యంలోని ప్రజల బృందం. అంత దగ్గరగా గమనిస్తూ ఉన్నపుడు రాజుగారి వైభవం కనిపిస్తుంది. దానితోపాటు రాజు నడతలోని సమర్థత అసమర్థతలు, గుణావగుణాలు కూడా మనస్సులో మెదలుతాయి. భక్తితో అతి సమీపానికి వెళ్లగలిగినపుడు భక్తులకు దేవుడు తమతోపాటు మెలిగే తమవాడుగా కనిపిస్తాడు. ఎంత భక్తి ఉన్నా దేవుడు నిర్వహించే కార్యాలలోని కొన్ని అంశాలను భక్తులు విమర్శించడం కూడా కనిపిస్తుంది. సమస్త జగత్తును నియంత్రించే పరబ్రహ్మను విమర్శించడం అపచారమని అనుకొనే వాళ్లే కొన్ని సమయాల్లో సమాజంలోని ప్రజల నడతకు సంబంధించిన విషయాల దృష్టితో స్వామిని కూడా తమలో ఒకడుగా భావించి విమర్శిస్తారు. ఈ విమర్శలో ఎత్తిపొడుపు, హేళన, నింద ఉంటాయి. ఎంతగా విమర్శించినా మళ్లీ దేవుని అనంతత్వాన్ని కొనియాడుతూ లోకాన్ని ఉద్ధరించమని కోరుతూ ఉంటారు. కవులలో ఈ లక్షణం ఉంటుంది. కవులకు సామాజిక బాధ్యత ఎక్కువ. సామాజిక నిబద్ధతగల కవులు భగవంతుని గురించి కూడా సామాజిక దృష్టితోనే ఆలోచిస్తారు. కవులకు భక్తి ఉండదని కాదు, భక్తికంటే ముందుగా వాళ్లకు సామాజిక సమస్యలు కనిపిస్తాయి. ఆ కారణంగానే కొందరు కవులు వేంకటేశ్వరస్వామిని సమాజ దృష్టితో

విమర్శించారు. అలాంటి విమర్శలు నిందలుగా తోచినా చివరకు స్తుతులుగానే భావింపబడతాయి. నిందాస్తుతులు ఎలా ఉంటాయో కింది గేయం పరిశీలిస్తే అర్థమవుతుంది.

**గోవిందా! గోవిందా! నీ పని ఇంక గోవిందా!**
**సిరులిచ్చు మాతల్లి శ్రీమహాలక్ష్మి నీ కాద లేకుంటే గోవింద!**
**గరుడుడు అలిగితే గోవింద – షికార్లెలా కొట్టేవు గోవింద!**
**పెట్రోలు ధరలు మండిపోతుంటే – ఏ కారెక్కుతావు గోవింద!**
**ఆదిశేషుడే లేకుంటే – ఎలా పవ్వళించేవు గోవింద!**
**దోమలు నల్లులు నిన్ను కన్ను మూయనీయవు కల్పాంతానికైనా**
**అలమేలుమంగపతి ఆపదమొక్కులవాడు అని పేరెట్టుకొన్నావుగాని**
**వేగమె వచ్చి మమ్మేలుకోకపోతే మాపని కాస్త గోవింద!**

సమాజంలో కొందరు పురుషులు భార్యయే లోకంగా ఉంటారు. వాళ్ల ఆలోచనలన్నీ భార్య చుట్టూనే పరిభ్రమిస్తూ ఉంటాయి. భార్యను ఒంటరిగా ఎక్కడికీ పంపరు. ఈ లక్షణం శ్రీనివాసునికి ఉందని నారాయణశర్మ చెపుతున్నాడు.

**భార్యనె నమ్ముకుండ నెదపైననె కూర్చొన జేసినావె, నీ**
**శౌర్యము, మానమున్ చటుల సాహసమంతయు నిట్టులయ్యెనే!**
**కార్యము లెన్నియున్న నవికాదని, యిల్లరికమ్మె సర్వమై**
**భార్యయె లోకమంచు నెదబాయవిదేమిర, వేంకటేశ్వరా!**

లోక నడతను స్వామికి అంటగట్టడం ఈ పద్యంలోని విషయం. భార్యను బయటకు పంపితే మరల వస్తుందో రాదో అనే భయంతో స్వామి ఎదపైననే శాశ్వతంగా కూర్చోండబెట్టుకున్నాడట. చేయవలసిన పనులలో మునిగి భార్యకు దూరంగా ఉండవలసి వస్తుందని ఇల్లరికం వెళ్లాడట. ఇల్లరికం అంటే భర్త భార్య ఇంట్లోనే ఉండడం. అమ్మవారి గృహం క్షీరాబ్ధి. స్వామి



క్షీరాబ్ధి మీదనే శేషశయ్యపై ఉంటాడు. అంటే భార్య గృహంలోనే ఉన్నాడని అర్థం. అలా భార్య గృహంలో ఉండడం లోకంలో కనిపించే అంశమే. అలమేలుమంగా శ్రీనివాసులది ఒకే తత్త్వం. అదే లక్ష్మీనారాయణుల తత్త్వం. శ్రీనివాసుడంటే అమ్మతో కూడిన స్వామేనన్న విషయం శతక కర్తకు తెలియక కాదు. అయితే ఇలా చెప్పడం ఎందుకు అంటే లోకస్థితిని చెప్పడం కోసం. లోకంలోని భార్యాభర్తలు అనవరతం ఒకే తత్త్వంగా మెలగాలన్న స్ఫురణకూడా ఇందులో ఉంది. 'సుదర్శనచక్రం ధరించి రాక్షసకోటిని సంహరించానని గొప్పలు చెప్పుకొంటావు. అది ఎప్పుడు జరిగిందో తెలియదు. ఇప్పుడు నీ సుదర్శనం తుప్పు పట్టినట్లుంది. ఆ తుప్పు పట్టిన సుదర్శనంతో ఇప్పటి రాక్షసులను చంపగలవేమో చూడు. సమాజంలో ఇప్పుడు రాక్షసులే ఎక్కువగా ఉన్నారు. ఎందరిని చంపుతావు?' అని స్వామికి మరొక సవాలును విసిరాడీ శతక కర్త. రాక్షసప్రవృత్తితో మానవులు ఉండకూడదని, అలాంటి వాళ్లను స్వామి సుదర్శనానికి అప్పజెపుతాడని ఒక హెచ్చరిక ఇందులో ఉంది. 'లోకుల (భక్తుల) సొమ్మును కానుకల రూపంలో లూటీ చేస్తున్నావు. కటికి చేతులతో పేదల సొమ్మును ముక్కు పిండి వసూలు చేసుకొంటున్న ధనికాధములకు నీకూ (శ్రీనివాసునికి) భేదమేముంది? ఇలా ధనం గుంజుకొంటున్నందుకు ఏవేవో సాకులు చెపితే ప్రజలు వచ్చి నీకు మొక్కరు'. ఈ విషయాన్ని గమనించమని స్వామికి చేసిన సూచన ఇది.

స్వామీ వేంకటేశ్వరా! కపిలగోవు నీవు ఉండిన పుట్టపైన గరిటెడు పాలు కార్చకుండా ఉంటే; గోపకుడు గొడ్డలితో పుట్టను కొట్టకుండా ఉంటే; కృపతో కమల నీ ఉరమును గేహంగా చేసుకొని నీ దగ్గరకు చేరకుండా ఉంటే నీకు ఇప్పుడున్న ప్రభావ విభవాదులు ఎలా ఉంటాయి? ఇది జయచంద్రశాస్త్రి శ్రీనివాసుడికి సంధించిన ప్రశ్న. ఇవన్నీ స్వామి సంకల్పం తోనే జరిగినాయని భక్తుల విశ్వాసం. శాస్త్రిగారికి ఈ విశ్వాసం లేకపోలేదు.

శ్రీనివాసుని వివిధ విభూతులను మళ్లీ ఒకసారి కండ్లముందుకు తెచ్చుకోవడానికి చేసిన ప్రయత్నమిది. సాధారణంగా మనిషి తనకు ఉన్నదానితో తృప్తిపడడు. ఇంకా ఇంకా కావాలనుకొంటాడు. దానికోసం ఆరాటపడుతూ ఉంటాడు. లోకంలో కనిపించే లక్షణమిది. ఈ లక్షణం శ్రీనివాసునికి కూడా ఉందని వఝల రంగాచార్య తన శతకంలో చూపాడు. స్వామికి పీతాంబరం ఉంది. ఇక రంగుబట్టలకు ఆరాటం ఎందుకు? సర్వసంపదలకు అధిదేవత అయిన శ్రీమహాలక్ష్మి పత్నిగా ఉంది. మరి రంగురాళ్లపై (వజ్రవైడూర్యాలపై) ప్రేమ ఎందుకు? వైజయంతి ఉండగా వాడిపోయే పూలదండలెందుకు? సప్తాద్రియే వైకుంఠంగా ఉండగా వీధివీధిలో గుడులెందుకు? అని శతక కర్త చెప్పిన ఈ విషయాలు నిందలు అనిపిస్తాయి. కాని ఆ నిందలు భక్తులకు ఒక స్ఫురణను కలిగిస్తాయి. స్వామి అలంకార ప్రియుడు. భక్తులు అలంకార ప్రియుడైన స్వామినే దర్శించి ఆరాధిస్తారు. కాబట్టి తిరుమలలోనే కాక ఇతర ప్రాంతాలలో ఉన్న గుడులలోని శ్రీనివాసుని విగ్రహాలను కూడా అలంకారయుక్తంగానే దర్శించడానికి తగిన కానుకలను భక్తులు సమర్పించి స్వామి అనుగ్రహానికి పాత్రులు కావచ్చు.

అప్పులలో మునిగి తేలే నీకు ఏ గొప్పలూ లేకపోగా మమ్మల్ని చూడమంటే కోపం వస్తుందేమో! నీ తిప్పలు మాకు తెలియనివా! నీకు ధనాశ తీరకనే రత్నాకరం (సముద్రం) చేరావు. లోకులపాట్లు చూడకుండా అక్కడ లక్ష్మితో కలసి ఉండడమే నీకు ఇష్టంగా ఉన్నట్లుంది. దేవతలందరిలో గొప్పవాడివని అంటారు. మరి గొల్ల వనితలను మోహంలో ఎందుకు ముంచావు? పెద్దలే ఇలా అయితే మరి లోకంలో పిల్లలెలా ఉండాలి? ఇలాంటి నిందలను స్వామిపై మోపిన నారాయణశర్మకు ఇవి నిందలు కావని, భక్తులు గమనింపదగిన స్వామి లీలలని తెలుసు. ఇలాంటి ఆలోచనలు ఉన్న కవులు భౌతికవాదులుగా కనిపించినా వాళ్లలో భక్తిలేదని చెప్పడానికి వీలులేదు. అయితే కవులు ఇలా ఎందుకు రాశారు, రాస్తున్నారు అనే ప్రశ్న ఉంది.



ఇప్పుడు మనిషిలో రోజురోజుకీ వ్యాపార సంస్కృతి బలపడుతూ ఉంది. దేవాలయాలకు వెళ్లి రావడం, హుండీలో కానుకలు సమర్పించడం, సేవలు చేయించడం వంటి కార్యక్రమాలకు అయ్యే ఖర్చు మళ్లీ సమకూరాలని ఆలోచించేవాళ్లలో ఉన్న భక్తి వ్యాపార భక్తి. దేవాలయాలలో ప్రసాదాలు పంచడం వంటి కార్యక్రమాలు తమ పరపతిని పెంచుతాయని; పత్రికలలో, టీవీలలో వార్తలు రావడం ద్వారా అనేకుల దృష్టిలో పడతామని; వాటి ద్వారా సామాజిక హోదా పెరుగుతుందని కొందరు ఆలోచిస్తున్నారు. దీనికి తోడు దేవాలయ ప్రాంగణాలలో ప్రవచనాలు చేస్తూ ఆధ్యాత్మికవేత్తలుగా పరిగణింపబడే వాళ్లు సాధారణంగా బతికే జనాన్ని ఆధ్యాత్మికవాదులుగా మార్చే ప్రయత్నంలో భాగంగా భౌతిక సంపదలు కానుకలుగా ఇవ్వడం ద్వారా దైవానికి చేరువ కావచ్చుననే స్ఫురణను కలిగిస్తున్నారు. కలుగుతున్న కోరికలు తీరాలంటే దేవాలయాలకు కానుకలు ఇవ్వాలనే అభిప్రాయం ఏర్పడడం వల్ల భక్తి ఒక వ్యాపార వస్తువైంది. కవులు దేవుని ప్రశ్నించడం, లోటుపాట్లను ఎత్తిచూపడం వంటి విషయాలు నిందాస్తుతులుగా కవుల రచనలలో కనిపిస్తాయి.

* * *

## వేంకటేశ్వరుని గుడులు

దేశంలోని ప్రతి పల్లెలో శ్రీరామాలయం నిర్మింపబడి ఉంది. రామమందిరం లేని గ్రామం ఒక్కటైనా లేదనడం సత్యం. గ్రామ ప్రజలు రామమందిరాలలోనే రామభజన చేసుకోవడం ఇప్పటికీ కనిపిస్తున్న అంశం. ఆధునికకాలంలో కూడా సీతారామలక్ష్మణులకు హనుమత్సమేతంగా పట్టణాలలోనూ ఆలయాలు నిర్మింపబడుతున్నాయి. ప్రాచీన ఆలయాలు పునరుద్ధరింపబడుతున్నాయి. రామాయణ సంస్కృతి దేశమంతా విస్తరించి కనిపిస్తున్నది. దేవాలయాలలో రామాయణ ప్రవచనాలు ఏర్పాటవుతున్నాయి. పండితులు రామాయణ నవాహాలు నిర్వహిస్తున్నారు. ఉపన్యాస వేదికల దగ్గర శ్రోతలకు కరువు లేదు. శ్రీరామాలయాలు ఊరూరా వెలసినట్లు ఇప్పుడు శ్రీవేంకటేశ్వరాలయాలు కూడా అనేకచోట్ల నిర్మింపబడుతున్నాయి. దేవాలయాల నిర్మాణాలకు తిరుమల తిరుపతి దేవస్థానాలు ఆర్థిక సహాయం చేసే ఒక పథకాన్ని అమలు చేస్తూ ఉండడం వల్ల ఆ సహాయం తీసుకొని కొందరు ఆలయాలు నిర్మిస్తున్నారు. దేవతా విగ్రహాలను కూడా తి.తి.దేవస్థానం విరాళంగా ఇస్తూ ఉంది. ఇతర దేవాలయ నిర్మాణాలకూ తి.తి.దే. ఆర్థిక సహాయం చేస్తూ ఉన్నా ఎక్కువగా శ్రీవేంకటేశ్వరాలయాలే నిర్మింపబడుతూ ఉండడం గమనింపదగిన విషయం. తిరుమలలోనే కాక అనేక ఇతర ప్రాంతాలలో శ్రీనివాసుని గుడులు నిర్మాణం కావడానికి కారణం శ్రీవేంకటేశ్వరతత్త్వం అన్నిచోట్లా ప్రచారం కావడం. తిరుమల కొండకు దేశదేశాలనుండి భక్తులు లక్షల సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించి దివ్యానుభూతిని పొందడం, ఆ భక్తులలో కొందరైనా ఈ స్వామికి వాళ్ల ప్రాంతాలలో ఆలయాలు నిర్మించాలని భావించడం జరుగుతూ ఉంది. శ్రీనివాసుడు తమకు ప్రేరణ కలిగించి ఆలయాలను తమ ద్వారా నిర్మింపజేసుకొంటున్నాడని కొందరు ఆలయ నిర్మాతలు చెపుతూ ఉంటారు.

జడభావం పొంది గోముగా శ్రీనివాసుడు కోట్ల రూపాయలు చేర్చుకొంటున్నాడు. ఏమీ మాట్లాడకుండా సీమలు దాటి ప్రభుత్వం నెరపుతున్నాడు. ఇందులోని సూత్రమేమిటో తెలుపమంటున్నాడు నారాయణశర్మ తన శతకంలో. శ్రీవేంకటేశ్వరతత్త్వం ప్రపంచమంతటా వ్యాపించడమే ఆ సూత్రం. ప్రభుత్వం నెరపడమంటే భక్తులను పాలించడం. తిరుమల వైభవం దేశంలోనే గాక విదేశాల్లో సైతం వ్యాపించిందని, ఆ కారణంగా ఎంతోమంది ఇతర దేశాల భక్తులు కూడా తిరుమలకు వస్తున్నారని కింది పద్యం వివరిస్తున్నది.

**తిరుమల దివ్యధామమని దేశ విదేశ ప్రజాస్రవంతి నీ**
**సురుచిర సచ్చిదాత్మక యశోన్నత సుందర దివ్యరూపమున్**
**అరయగ నేగుదెంచెదరు; సద్భుతమౌ భవదీయ దర్శనం**
**బరుదని భక్తితోడ పులకాంకితులౌదురు వేంకటేశ్వరా!**

చింతలపాటి మోహనమురళీకృష్ణ తన వేంకటేశ్వర త్రిశతిలో రచించిన ఈ పద్యంలో శ్రీనివాసునిది సచ్చిదాత్మకమైన సుందర దివ్యరూపమని, ఆ రూపాన్ని దర్శించి భక్తులు పులకాంకితులవుతారని చెప్పబడింది. ఇలాంటి రూపాన్ని నిత్యం దర్శించుకోవడానికి తమ ఆవాసాలకు దగ్గరలోనే శ్రీనివాసునికి దేవాలయాలు నిర్మించాలనే సంకల్పంతో ఆయా ప్రాంతాల భక్తులు శ్రీవేంకటేశ్వరుని గుడుల నిర్మాణానికి పూనుకొంటున్నారు. గ్రామ సీమలలోనే కాకుండా పట్టణాలలో, నగరాలలో కూడా పెద్ద పెద్ద ఆలయాలు కనిపిస్తున్నాయి. దేశమంతటా గుడులున్నా, ఆ గుడులలో వేంకటేశ్వరుని మూర్తులు ఉన్నా, స్వామిని తిరుమలలోనే దర్శిస్తే, ఆ దర్శనానికి ఒక పవిత్రత ఏర్పడుతుంది. తిరుమల కొండలలో వీచే స్వచ్ఛమైన గాలి, అక్కడ సంచరిస్తే కలిగే దివ్యత్వస్ఫూర్తి, యాత్రికులకు కలిగే తృప్తి మరెక్కడ యాత్ర చేసినా దొరకవని మరొక శతకకర్త అభిప్రాయం.

భారతీయులు ఏయే దేశాలలో ఉన్నారో ఆయా దేశాలలో వేంకటేశ్వర స్వామి దేవాలయాలు నిర్మింపబడినాయి. నిర్మింపబడుతున్నాయి. ఈ దేవాలయాలతోపాటు గణపతి, లక్ష్మి, దుర్గ, కుమారస్వామి, ఈశ్వరుడు,

ఆంజనేయుడు, సరస్వతి మొదలైన దేవతలకు ఆలయాలున్నాయి. అమెరికాలో వేంకటేశ్వరస్వామి దేవాలయాలతో పాటు పైన పేర్కొనబడిన దేవతల గుడులు కూడా కనిపిస్తున్నాయి. 'పిట్సుబర్గ్' లోని వేంకటేశ్వరుని దేవాలయంలో తిరుమలలో జరిగినట్లే సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయి. అక్కడున్న భారతీయులు తమ పిల్లలకు పుట్టువెంద్రుకలు ఆ దేవాలయాలలో తీయించు కోవడం కనిపిస్తున్నది. ఇక్కడున్న మరొక విశేషమేమిటంటే ఒకే దేవాలయ ప్రాంగణంలోనే ఇతర దేవతలందరికీ చిన్నచిన్న సన్నిధులు ఉండడం. ఒక్కొక్క సన్నిధిలో ఒక్కొక్క అర్చకుడు పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఆర్జిత సేవలూ జరుగుతున్నాయి. అయితే స్పష్టమైన ఉచ్చారణతో కొందరు అర్చకులుగా ఉన్నవాళ్లు సంబంధిత శ్లోకాలను చెప్పలేకపోతున్నారు. (ఈ గ్రంథ రచయిత అభిప్రాయం ఇది. అమెరికాకు వెళ్లిన సందర్భంలో న్యూజెర్సీ ప్రాంతంలోను, టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ ప్రాంతంలోను కొన్ని దేవాలయాలు దర్శించి, అక్కడ జరుగుతూ ఉండిన సేవాకార్యక్రమాలను గమనించడం జరిగింది). ఈ ప్రాంతాల్లో మనదేశం నుండి వెళ్లిన డాక్టర్లు, ఇంజనీర్లు, వాళ్ల కుటుంబాల వాళ్లే ఎక్కువగా ఉన్నారు. వీళ్లలో తెలుగువాళ్ల జనాభా తక్కువేమీ కాదు. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంవల్ల ఈ రెండు రోజులలో సమీప ప్రాంతాలలోని ఆలయాల్లో తెలుగువాళ్లు అధిక సంఖ్యలో కనిపిస్తారు. కొన్ని దేవాలయాల్లో ప్రసాదాల పంపకం, అమ్మకం రెండూ ఉన్నాయి. తెలుగువాళ్లైన భక్తులు అన్నప్రసాదాలను విరివిగా కొని భుజించడం కనిపిస్తుంది. ఇతర దేశాలలో కూడా శ్రీనివాసునికి గుడులు నిర్మింపబడడం, పూజాదికాలు జరుగుతూ ఉండడం భక్తులందరికి స్ఫూర్తిని కలిగించే అంశాలు.

* * *

# సామాజికాంశాలు

'అందరూ సమానులు, అందరికీ సమానావకాలు' అనే మాటను నాయకులు చెపుతూ ఉన్నా దేశంలో ఈ మాట ఒక కలగానే మిగిలిపోతున్నది. రాజకీయవ్యవస్థ వికృతరూపం దాల్చి కనిపిస్తున్నది. రాజకీయాలలో స్వార్థం ప్రవేశించి సామాన్యుల మనుగడ ప్రశ్నార్థకమైంది. ప్రతి పనీ రాజకీయాలతో ముడిపడి ఉండడం వల్ల రాజకీయ పరపతి లేనివాళ్లు దిక్కులేనివాళ్లు గానే మిగిలిపోతున్నారు. ఎన్నికలలో నిజాయితీ లోపించడం వల్ల నిస్వార్థంగా ప్రజాసేవచేస్తూ, మంచి పరిపాలనను అందించగల నాయకులు రావడం లేదు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు గల కార్యాలయాలలో అవినీతి, లంచగొండితనం రాజ్యమేలుతున్నాయి. ప్రభుత్వం ప్రజలందరికి, అట్టడుగు ప్రజల వరకు సహాయపడేలా పథకాలు అమలు చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటే స్వార్థపరులైన అధికారులు ఆ పథకాలకు తూట్లు పొడిచి ఆ ప్రయోజనాలను ప్రజలకు అందకుండా చేస్తున్నారు. దేనికి సంబంధించిన దైనా ఒక చిన్న 'సర్టిఫికేట్' తీసుకోవాలంటే అంతో ఇంతో లంచం ఇవ్వక తప్పడం లేదు. సమాజం అసూయాద్వేషాలతో, పగ ప్రతీకారాలతో, స్వార్థ పరత్వంతో కునారిల్లుతూ ఉంది. ధనికులు ఇంకా పెద్ద ధనికులవుతూ ఉండే పేదవాళ్లు నిరుపేదలుగా మారుతున్నారు. స్థూలంగా ఇప్పటి సమాజస్థితి ఇది. ఈ సమాజంలోనే బతుకుతున్న కవులకు సమాజస్థితి అందరికంటే బాగా అర్థమవుతుంది. సమాజంలో ప్రజోపకరమైన మార్పులు రావాలని కవులు అభిలషిస్తారు. తమ రచనల ద్వారా పరిస్థితులను ఎరుక పరచి ప్రజలలో చైతన్యం కలిగిస్తారు. భక్తులైన కవులు తమ ఆవేదనలను తాము ఆరాధించే దేవతలకు తెలియజేసి సమాజాన్ని ఉద్ధరించమని కోరతారు.

ఈ గ్రంథంలో పరిశీలింపబడిన కవుల రచనలు ప్రధానంగా రెండు రకాలుగా కనిపిస్తాయి. భక్తిని ప్రదర్శిస్తూ, శ్రీనివాసుని వైభవాన్ని వర్ణిస్తూ

శరణాగతి పొందిన విషయాలను వివరించే రచనలు మొదటి రకం. ఈ విషయాలతోపాటు సమాజంలోని అవకతవకలను స్వామికి నివేదించి సమాజాన్ని బాగుచేయమని కోరుతున్న విషయాలను సమీక్షించేవి రెండవ రకం. ఈ రెండూ కాకుండా కేవలం సామాజికాంశాలనే వివరిస్తూ వేంకటేశ్వరుని పేరుమీద రచించబడిన శకతాలు కొన్ని ఉన్నాయి. ఇలాంటివి తక్కువగానే ఉన్నాయి. రెండవ రకానికి చెందిన రచనలలోని విషయాలే ఈ విభాగంలో సమీక్షింపబడినాయి. **'ఓం నమోవేంకటేశాయ'** అనే గేయకావ్యంలో డా॥ ఆవుల రామచంద్రయ్య ఆలోచన ఇది.

**ఏడుకొండలవేంకటేశ్వరా! ఈ దేశమే నాశమాయెరా!**
**ప్రజారాజ్యమని ప్రజలను దోచేస్తున్నారు**
**మంత్రులమని కోట్లు మింగేస్తున్నారు**
**కల్లబొల్లి ప్రమాణాలు చేసి ఓట్లు కొల్లగొడుతున్నారు**
**ఓట్లుకొని పదవులు పంచుకొని**
**కోట్లు కోట్లు దోచుకొని నీకు భాగమిస్తారు జాగ్రత్త!**
**విద్యార్థుల రెచ్చగొట్టి రాష్ట్రాలు విభజింప దలచిన**
**ఈ దేశమెట్లా బాగుపడురా వేంకటేశ!**
**శంఖు చక్రాలేమాయె? నందక శార్ఙ్గము లేమాయె**
**మౌనమేల విజృంభించి విశ్వరూపంతో కాపాడు దేశాన్ని**

నోట్లతో ఓట్లు కొనే సంస్కృతితో దేశం నాశనమై పోతున్నదని శతకకర్త పడిన ఆవేదన పై గేయంలోనేగాక ఇంకా కొన్ని గేయాలలో కూడా రూపుకట్టి కనిపిస్తున్నది.

కలియుగధర్మాలు విపరీతంగా కనిపిస్తున్నాయి. జారులు, చోరులు స్వాముల వేషాలు వేసి మఠాలు నిర్మించుకొని ఆధ్యాత్మిక బోధలు చేస్తున్నారు. ఇలాంటి మఠాలలో జరిగే అవాంఛనీయ ఘటనలనుండి, అసాంఘిక కార్యకలాపాల నుండి ప్రజలను కాపాడుమని తిరుమలవాసుని వేడుకోవడం



కొన్ని శతకాలలో ప్రధానవిషయంగా కనిపిస్తుంది. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపి సంఘసేవ చేసే చవటలు ఎక్కువవుతున్నారు. విదుర నీతులు వినరు. సుమతి శతక సూక్తులు రుచించవు. కాళహస్తీశ్వర శతక పద్యానుభవం పనికిరాదు. నృసింహశతకం పట్టదు. ఇక మానవుని నడతలో నైతిక విలువలు ఎక్కడుంటాయి? ఇలాంటి మానవులను ఎలా సరిదిద్దగలవో ఆలోచించమని కవులు శ్రీనివాసుని కోరుతున్న విషయాలు శతకాలలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను రెండు రాష్ట్రాలుగా చీల్చడానికి జరిగిన ఉద్యమాన్ని శాంతింపజేసి, దేశం రెండు ముక్కలు కాకుండా ఆపి జనంలో ఐక్యతను కలిగించమని తిరుమలవాసుని వేడుకొన్నాడు ఒక శతక కర్త. కలియుగ ప్రథమపాదంలో పెచ్చరిల్లుతున్న పాపాలను పోగొట్టే కల్కి శ్రీనివాసుడు. నేతలు, ఉద్యోగులు చేసే అక్రమాల అగ్నులను ఆర్పివేసే శాంతిమేఘుడు తిరుమల విభుడు. రక్తదాహులైన రాక్షసమూకలను ఖండించే సుదర్శనుడు తిరుమలేశుడు. అలాంటి స్వామి జనచిత్తాలకు తప్పక శాంతిని కలిగిస్తాడని ఈ శతకకర్త విశ్వాసం ప్రకటించాడు.

భక్తిని సంపదను ఆర్జించే సాధనంగా, తమ అభివృద్ధికి పనికొచ్చే మార్గంగా మలచుకొని కుహనాభక్తులైన అల్పమానవులు సంపన్నులవుతున్నారు. వీరి బారిన పడిన భక్తులను నీవే ఉద్ధరించాలి. 'మానవసేవయే జగతి మాధవసేవ యటంచు' చెప్పుకొంటూ దీనులను, హీనులను, కడకు తిండికి బట్టకు లేని పేదలను కూడా మోసం చేసే 'ముచ్చుపెద్దల' ను చూడడం అసహ్యం. స్వామీ! అలాంటి వాళ్లను నీవెలా చూస్తున్నావు? పర్వతాగ్రంపైన ఉండే నీకు భక్తుల విన్నపాలు వినిపిస్తున్నాయా? వినిపించినా అవి పేదల మూల్గులే కదా అనుకొంటున్నావేమో! పైసలు చేతగలవారికే కొండపైన వైభవాలు. ఆపన్న శరణ్యుడవని కదా భక్తులు భావిస్తున్నారు. లంచాలు ఇచ్చే వాళ్లను, పుచ్చుకొనే వాళ్లను పాలన చేస్తున్నావు. ఆలోచించి చూస్తే మోసగాళ్లకే నీ దయవల్ల విశేష సౌఖ్యాలు కలుగుతున్నట్లుంది. ఆపదమొక్కులవాడవని నిన్ను ఆశ్రయించే భక్తకోటిలో పాపులు, క్రూర

కర్ములు, దోపిడి దొంగలు ఉన్నారు గమనించు. దుష్టులు నిన్ను వరాలివ్వమని ప్రార్థిస్తారు. అలాగే సజ్జనులు ప్రార్థిస్తారు. వీళ్ల కోరికలు ఎలా తీర్చుతున్నావో! మానవుడు దానవుడయ్యాడు. దానం, ధర్మం కనిపించకుండా పోయాయి. అధర్మకారకులు పాలకులవుతున్నారు. వీళ్లను ఉపేక్ష చేస్తే సామాన్యులు మనుగడ సాగించలేరు. రానురాను నీకు కొండపైన నిలబడడానికి కూడా తావు లేకుండా చేస్తున్నారు. ఇలాంటి వాళ్ల విషయంలో దిట్టతనం చూపుతూ కొద్దిగానైనా తిప్పలు పెట్టక పోతే వాళ్లు తమ స్వభావాలను మార్చుకోరు. కోట్లు ఖర్చుచేసి ఓట్లు కొనుక్కొని అక్షయపాత్ర వంటి అధికారం సంపాదించి తరువాత నీ దర్శనానికి వస్తారు. సమాజంలో ఉన్నవాళ్లకు లేనివాళ్లకు మధ్య కొనసాగుతూ ఉన్న భేదాన్ని నిర్మూలిస్తామని వాగ్దానాలు చేస్తారు. ఈ నాయకుల వైభవం నీకు తెలుసుగదా! నీవు కానుకలకు వడ్డీ గ్రహిస్తుండడం గమనించి లోకంలో వడ్డీవ్యాపారం వెర్రి తలలు వేస్తున్నది. కొడుకు తండ్రి దగ్గర వడ్డి వసూలు చేస్తున్నాడు. ఆ పద్ధతిని మానిపించు.

కులాల పేరుతో పెరుగుతున్న ద్వేషాలవల్ల, స్వార్థపరత్వంవల్ల సమాజంలో భయాందోళనలు కలుగుతున్నాయి. దారిదోపిడులు, హత్యలు, ప్రాణులను హింసించడం వంటి కలుషితమైన పనులు ఎక్కువ కావడంతో ప్రజలలో అభద్రతా భావం చోటుచేసుకొన్నది. ఇలాంటి సమాజాన్ని నీవు రక్షించకుంటే మరెవరు రక్షిస్తారు? మునుపెప్పుడో కరిని రక్షించడానికి తొందరలో సిరికి కూడా చెప్పకుండా లక్ష్మీపతి పరుగెత్తి మకరిని తునుమాడినాడని పోతనామాత్యుడు భాగవతంలో చెప్పినాడు. అది నిజమే అయి ఉంటుంది. ఇప్పుడు నిత్యం నిన్ను స్తోత్రం చేసే నీ భక్తులను రక్షించు. ఆధ్యాత్మిక విద్యల విలువను గ్రహించలేని మందమతులు లౌకిక విద్యలే విద్యలని భ్రమలో ఉన్నారు. లౌకిక విద్యలతో మానసిక ప్రశాంతిని పొందడం సాధ్యమవుతుందేమో వాళ్లే ఆలోచించుకోవాలి. ఇప్పటి చదువులు



సతులనుండి కట్నాలు పొందడానికి, విత్తమార్జించడానికి పనికొస్తున్నాయి. ఈ చదువరులకు నిజమైన విద్యను గురించి కొద్దిగానైనా తెలుసుకొనే శ్రద్ధను కలిగించు. నీ సొత్తు తిని నీకే అన్యాయం తలపెట్టే అధికారులు తయారవుతున్నారు. అన్యాయాలను చూస్తూ ఊరకనే నిలుచుంటే అన్యాయం చేసే మరికొందరు అధికారులు తయారవుతారు. ముందు ముందు అలాంటివాళ్ల గతి ఎలా ఉండబోతుందో నీకు తెలుసు. అయినా అన్యాయాలను వెంటనే ఆపకపోతే భక్తులకు నీపైన గల విశ్వాసం తగ్గుతుంది.

లోకంలో రక్షణ కరువైంది. అందరినీ రక్షించడమే శ్రీనివాసుని దీక్ష అని భక్తులు చెపుతారు. కాని కొండకు వచ్చే బీద భక్తులను దోచుకొనే రాక్షసుల మాటేమిటి? అలాంటి వాళ్లు కూడా భక్తిని ప్రదర్శిస్తారు. వాళ్లను కృపామతితో చూడకు. మానవులలోని పశుప్రవృత్తి పూర్తిగా నశించాలంటే లోకాన్ని లయం చేయడమే మార్గమని కింది పద్యం చెపుతున్నది.

**సర్వము నాశమై మరల చక్కగ సృష్టి యొనర్చు దాక దు**
**ర్వర్గ పశుప్రవృత్తులును, రాగము ద్వేషము క్రోధ మత్సరం**
**బుర్వర నిండియుండు; లయమొందగ జేయక లోక పాలనా**
**నిర్వహణమ్ము సాగదిక నిశ్చయమియ్యది వేంకటేశ్వరా!**

సమాజంలోని విషయాలను గమనిస్తే మానవులలో పశుప్రవృత్తి రోజు రోజుకూ పెరుగుతూ ఉంది. రాగ ద్వేష క్రోధ మాత్సర్యాలు లేనివాళ్లు అరుదుగా కనిపిస్తున్నారు. ఇంకా కొంత కాలానికి సమాజం మానవత్వాన్ని కోల్పోయి దుర్భరమవుతుంది. అప్పుడు లోకపాలనను నిర్వహించడం కష్టం. అందువల్ల లోకాన్ని లయం చేసి కొత్త సృష్టిని ప్రారంభించు. దశావతారాలను ధరణి రక్షణ కోసమే నీవు ధరించావని పెద్దలు చెప్పారు. మరి ఇలా కదలకుండా ఉండడం మంచిదా? వేగంగా కళ్లు తెరచి పెదవి విప్పి మాట్లాడు.

పైన వివరించిన సామాజిక విషయాలు గేయకర్తలు, శతక కర్తలు తమ రచనలలో ఎత్తి చూపినవి. ఈ విషయాలన్నిటిని తిరుమల విభునికి ఎరుక పరచి పరిష్కారదిశగా సమాజాన్ని ఆశీర్వదించమని, భక్తుల కడగండ్లు తొలగించమని, లోకంలో ధర్మం, న్యాయం, నీతులను చ్యుతిపొందకుండా రక్షించి శాశ్వతంగా ప్రతిష్ఠించమని స్వామిని కోరుకోవడం ఈ రచనలన్నిటిలో కనిపిస్తున్న ప్రధానాంశాలు. ఈ విభాగాన్ని ముదివర్తి కొండమాచార్యులవారి శ్రీనివాస విలాసం (2013) లోని కింది పద్యంలో ముగించడం సముచిత మనిపిస్తుంది

**కలికాలం బిది; శాంతి సౌఖ్యములకున్ కాలంబుగా దిద్ది; బొం**
**కుల్ రంకుల్ గృహదాహముల్ గలబలుల్ కొట్లాటలున్ దోపిడుల్**
**తెలుపగ శక్యమె? దీనమావులకున్ దిక్కెవ్వరయ్యా! వృషా**
**చలవాస! అభయప్రదుండవని విశ్వాసమ్ముతోఁగొల్చెదన్**

* * *

# కవుల భావనలు

కవిత్వపు సొగసు కవి భావించిన తీరులో ఉంటుంది. కవిత్వానికి భావనయే ప్రాణం. సామాజికాంశాన్ని భావనాబలంతో రంగరించి కావ్యంలో ప్రతిపాదించినపుడు అది అందంగా ఆవిష్కరింపబడుతుంది. భావన ఊహా జగత్తుకు చెందినది. ఊహ అందమైన భాషలో వ్యక్తమైతే పఠితకు లేదా శ్రోతకు చదివినప్పుడు లేదా విన్నపుడు ఆనందం కలుగుతుంది. కవిత్వం ఆనందం కలిగించకపోతే ఆ కవిత్వాన్ని ఎవరూ పట్టించుకోరు. వట్టిమాటల కూర్పు కవిత్వపు స్ఫురణను కలిగించదు. అందువల్ల కవిత్వంలో వస్తు ప్రతిపాదనతోపాటు ఆనందం కలిగించే గుణం కూడా ఉండాలి. కవిత్వం కలిగించే ఆనందం రసానందం. కావ్యం రసానంద జనకం కాకుంటే నీరసమైన వట్టి మాటల కూర్పే అవుతుంది. వేంకటేశ్వరుడు ప్రధాన విషయంగా రచితమైన గేయకావ్యాలలో, శతకాలలో కావ్యానికి ప్రధాన లక్షణమైన రసస్ఫురణ ఉంటే ఆస్వాదనీయమే కాని, అది తప్పనిసరి అంశం కానక్కరలేదు. ఇలాంటివి భక్తి రచనలు కాబట్టి, కథాంశ రహితాలు కాబట్టి భక్తిభావమే అంగిగా ఉంటుంది. ఆలయ సంస్కృతి అంతర్లీనంగా సాగుతుంది. సామాజిక విషయాలు భక్తులకు భగవంతునికి మధ్య గల సంబంధాన్ని బట్టి వ్యక్తం చేయబడతాయి. కేవలం సమాజ విషయాలను వ్యక్తీకరించడానికే రాసిన శతకాలలో కూడా వేంకటేశ్వరా! అనే పదముద్రను లేదా మకుటాన్ని పద్యాల చివర వాడుకోవడం కనిపిస్తున్నందువల్ల ఆ శతక కర్తలకు భక్తి భావం ఉందనే అర్థమవుతుంది.

వేంకటేశ్వరుని నామావళి, గుణవర్ణన, అవతార కథనం, అవతార వైభవం, ఆలయ ప్రాశస్త్యం, పూజావిధానాలు, ప్రసాద వితరణలు, తిరుమల కొండ విసర్గ రామణీయకత, ఏడుకొండల అంతరార్థం, వేంకట శబ్దవ్యుత్పత్తి, పద్మావతీ పరిణయం, బీబీనాంచారు వృత్తాంతం, తిరుమలవాసుని సంపద, భక్తుల ముడుపులు, వడ్డికాసులు, తలనీలాల సమర్పణ మొదలైన విషయాలు

భక్తకవుల రచనలకు వస్తువులు. ఈ వస్తువులు ఆధారంగా కవులు తమ అభిప్రాయాలను వెల్లడించడమే గాక ఊహా వైచిత్రిని కూడా ప్రదర్శించారు.

అర్థి జనులకు అమరతరువైన శ్రీనివాసుడు కవి కోవిలకు మావిచిగురు. గాయకులకు నాదగంగ. చిత్రకారులకు ఇంద్రధనుస్సు. పద్యం గద్యం పాట పదం ఆయనను గురించి చెప్పినపుడే వేదవాక్యాలవుతాయి. చిత్రమో, నృత్యమో, గాత్రమో, వాద్యమో ఆయనను గురించే అయినపుడు కళలు అవుతాయి. ఆయన మెచ్చని కావ్యం నివురు అవుతుంది. ఆయనను వర్ణించని కవిత నీరవుతుంది. కవితలను కాణాచి శ్రీనివాసుడే. అంటే కవులకు కవితా స్పందనను కలిగించేవాడు తిరుమలవాసుడేనని అర్థం. వేంకటేశ్వరుడు అక్షరమూర్తి. అంటే శాశ్వతమూర్తి అని, అక్షరజ్ఞానం కవులకు ఇచ్చినవాడని గ్రహించవచ్చు. ఛందోజ్ఞానం లేనివాళ్లు కూడా కొందరు వేంకటేశ్వర శతకాలు రచిస్తున్నారు. స్వామి కరుణా విశేషం వల్లనే వాళ్ల ఆలోచనలు పద్యాలుగా రూపుదిద్దుకొంటున్నాయి. ఇవన్నీ కొందరు శతక కర్తల ఆలోచనలు. విద్య పూర్ణయోగం. విద్యను అయోగ్యం చేసే కువిద్యలు వస్తున్నాయి. విద్యలకెల్ల అమృతమైన శ్రీనివాసుడు కువిద్యలను రూపుమాపాలి. ఇప్పుడు ప్రచారమవుతున్న హృదయంలేని విద్యలు జీవులకు ఆర్తిని కలిగిస్తున్నాయి. అలాంటివి సత్యపదార్థాన్ని నేర్వలేని విద్యలు. ఆదిశంకరులు శబ్దజాలాన్ని మహారణ్యమన్నారు. ఆ మాట భయం కలిగించగా శబ్దాన్ని పరబ్రహ్మగా భావించి స్వామి చెంత సాగిలపడి ఈ శతకం చెపుతున్నానన్నాడు ఒక కవి. కలి కల్మషం పోగొట్టమని, శివవైష్ణవాద్వైతసిద్ధిని కలిగించమని, బంధాలను తొలగించమని మరొక శతకకవి కోరుకొన్నాడు. కవితలు అల్లగల శక్తి శ్రీనివాసుని దయవల్లనే కలిగిందని, తన భావాలను శతకంగా రాసి స్వామికే సమర్పిస్తున్నానని కూడా ఆ కవి చెప్పుకొన్నాడు. 'నిను (శ్రీనివాసుని) చదివినట్టి చదువులె, నిను కీర్తించగ బడసిన నియత పదవులే మనమున సుఖమిడు నిత్యము' అని వేరొక శతక కవి అభిప్రాయం.



ఇప్పటి చదువులలో నైతిక, ధార్మికాంశాలను వివరించే విషయాలు అంతగా కనపడడం లేదు. మానవ సంబంధాలు మునుపటిలా లేవు. మానసిక వికాసం కరువై పోతున్నది. గొప్ప గొప్ప చదువులు చదువుకొన్న వాళ్లలో సహనం, శాంతి, అహింస, క్షమ, కరుణ మొదలైన మానవత్వపు విలువలు తగ్గిపోతున్నాయి. అందువల్ల వేంకటేశ్వరా! చదువరులకు నిజమైన జ్ఞానాన్ని ప్రసాదించమని కవులందరి మాట. ఈ అంశాన్ని వివరించే కొండమాచార్యులవారి పద్యం –

**చదివి చెడుచున్న నన్నున్, పదిలముగా మంచిదారిఁబట్టింపనిచోఁ**
**దుదకు దయనీయుఁడెందును, వెదకిన దుర్లభుఁడు నీకు వేంకటరమణా!**

నాస్తిక భావాలను పెంపొందించుకొని తిరిగేవాళ్లను మంచిదారికిమ్మంటున్నాడు కవి. నాస్తికులు దైవాన్ని నమ్మకపోవడం ఒక్కటే కాదు. సంప్రదాయాలను పాతచింతకాయపచ్చడి అని తేలికపరుస్తున్నారు. మానవసేవయే మాధవసేవ అనేది వీళ్లకు సరిగా అర్థం కాదు. మానవ సంబంధాలను బూటకాలుగా తలుస్తారు. ఇలాంటి వాళ్లే వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను అనాథ శరణాలయాలలో వదిలిపెట్టి వెళతారు. సమాజంలో ఇలాంటి అవాంఛనీయ విషయాలు తొలగిపోవాలంటే సంప్రదాయాలు బతకాలి. తదనుగుణమైన విజ్ఞానజ్యోతి వెలగాలి. సంప్రదాయం ఆధునికతను రూపుమాపే అంశమని కొందరు భావిస్తారు. ఇది నిజం కాదు. ఆకాశ విహారం చేసినవాడు, భూగోళంలోని విశ్వరహస్యాలను బహిర్గతం చేసేవాడు నేలమీదనే జీవించాలి. అతడూ ఒక కుటుంబంలో తల్లిదండ్రులు కన్నబిడ్డే. తల్లిదండ్రులను గౌరవించలేనివాడు తనను తాను గౌరవించుకోలేడు. ఉపన్యాసాలలో మాతృదేవోభవ, పితృదేవోభవ అంటూ మాతాపితరులను గౌరవించమని, పూజించమని ఉద్బోధ చేస్తారు. కాని తమ తల్లిదండ్రులను పట్టించుకోవాలనుకోరు. మానవసేవయే మాధవసేవ అనేది భారతీయ సంస్కృతిలోని అతి ముఖ్యమైన అంశం. మానవులను సేవిస్తే తననే సేవించినట్లు పరమాత్మ

ఆనందిస్తాడు. మానవసేవకు కంకణబద్ధులైన వాళ్లు ముందు వృద్ధ తల్లిదండ్రులను ఆదరంతో చూడడం, అండగా ఉండడం, ఎవరూ లేరనే దైన్యానికి లోనుకాకుండా చేయడం ముఖ్యమైన బాధ్యతగా భావించాలి. తల్లిదండ్రుల ఆశీర్వాద బలంతోనే బిడ్డలు ఉన్నత స్థితికి ఎదుగుతారు. అమ్మానాన్నల బాగోగులు చూడడం తప్పనిసరిగా పాటించవలసిన సంప్రదాయం. అలాంటి సంప్రదాయం ఆధునికంగా ఎదగడానికి అవరోధం కాదు. ఈ సంప్రదాయ విషయాలను గమనించి మంచి మనస్సుతో ఆచరించే విధంగా మానవు లందరికి జ్ఞానాన్ని ప్రసాదించమని కవులు తిరుమలేశుని వేడుకొన్నారు.

కొందరు కవులు తిరుమలేశుని ఆభరణాలతో అభిషేకాలతో తాదాత్మ్యం పొందాలని కోరుకోగా, మరికొందరు సమస్త సృష్టిలో శ్రీనివాసుడినే దర్శిస్తున్నట్లు అనుభూతి పొందారు.

**నీ గళసీమను చేరిన సుమమాలికలలోన చిన్నిపూవుగ నే పరిమళించనా**
**నీ తిరునామపు శ్రీచూర్ణమున నేను ఒక్క రేణువుగ భాసిల్లుదునా**
**నీ పద కంకణముల కింకిణీ రవమున చిరుమువ్వను నేనై సవ్వడి సేయనా**
**నీరాజనమున వెలుగొందగ నేను కర్పూర కళికనై కరిగిపోదునా**
**అభిషేకమున నీకు తీర్థజలములోన ఒక్క నీటిబొట్టునై నిను స్పృశియింతునా**
**నీ పడి వాకిట భక్తుల పదముల రాలిన చిరుధూళినై నేను నిలిచిపోదునా**

ఈ గేయకర్త కోరిక అలా ఉంటే ఇంకొక గేయకారుడు చూచిన ప్రతి చూపులో తిరుమల విభునే దర్శిస్తున్నాడు.

**ఆకు కదిలినా అది నీ హాసం! రేకు విరిసినా అది నీ భావం!**
**అందుకొనే కనులుండాలి ఆలించే మనసుండాలి**
**శ్రీనివాసా! చిద్విలాసా! నిరుపమానం నీ లీల ॥ఆకు॥**



**తొలకరించే మబ్బుగొంతుకలో ఆ మెరుపుల మాటలెవరివి?**
**పులకరించే పుడమి పెదవిపై ఆ చిగురుల పాటు లెవరివి?**
**గురువు చెప్పని భాష్యమిది ప్రశ్నలెన్నో జవాబు నీవే**
**ప్రత్యగాత్మా! సర్వము నీవే ॥ఆకు॥**

**నింగి కెగసే కడలి తరగలో నీ భక్తుని తపన ఉన్నది**
**నేలకురికే జలపాతంలో భక్తవరదా! నీవే కలవు**
**గుడులు చెప్పని భావమది! బడులు నేర్పని పాఠమది!**
**దివ్వెలెన్నో నువ్వు నీవే! దేవదేవా! సారమీవే! ॥ఆకు॥**

కావ్యం రాసి అంకితమిచ్చి పునర్జన్మ లేకుండా అనుగ్రహించమని తమ ఇష్టదేవతలను కోరుకోవడం కవిలోకంలో ఉన్న విషయమే. తాను రచించబోయే మహాభారత రచనను అంకితంగా గ్రహించి పునర్జన్మవల్ల దుఃఖం లేకుండా చేసి సుఖాత్ముని చేయుమని తిక్కన మహాకవి హరిహరనాథుని ప్రార్థించాడు. భాగవతాన్ని తెనిగించి తన జన్మను పునర్జన్మ లేకుండా సఫలం చేసుకొంటానని పోతనామాత్యుడు భావించాడు. ఇలాగే ఆధునిక కవులు కూడా కొందరు తమ కావ్యాలను, శతకాలను తిరుమలేశునికి సమర్పించి తమ ఈప్సితార్థాలను నెరవేర్చుకొనే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా శతక కవులందరూ 'వేంకటేశ్వర' మకుటంతో వేంకటేశ్వర శతకాలు రచించి వేంకటేశ్వరునికే అంకితం చేశారు. తమ రచనలను గ్రహించి కోరికలు తీర్చమని వేడుకొన్నారు. అలాంటి శతక కవులలో ఒక కవి తన రచనను స్వామికి అర్పణ చేసిన విషయాన్ని తెలిపేదే కింది పద్యం –

**కానుకలివ్వలేను బడిగాపుగ నుండగలేను కీర్తనల్**
**నేను రచించలేను ముని నేనయి నిన్ను దపింపలేను నా**
**ధ్యానముఁబద్యరూపముల నర్పణఁజేసితి నీకు భక్తితో**
**గాన, మదీయ కోర్కెలను గ్రక్కున దీర్చుము వేంకటేశ్వరా!**

కీర్తనలు రచించలేను అంటే అన్నమయ్యవలె సంకీర్తనలు రచించలేనని చెప్పడమే అయి ఉంటుంది. అన్నమయ్య సంకీర్తనలను పోలిన సంకీర్తనలు రచించిన వాళ్లు ఇప్పటికి లేరు. ఇక ముందూ ఉండరేమో!

# మరికొన్ని విశేషాలు

పై విభాగాలలో చర్చింపబడని అంశాలు కొన్ని ఈ విభాగంలో కనిపిస్తాయి. వేంకటేశ్వరుడు బడుగుల దేవుడు. ముడుపులను అర్పించడానికి నడచి తన సమీపానికి వచ్చే వాళ్లను కాపాడడానికి సిద్ధంగా ఉంటాడట. దూరంలో ఉండే తిరుమలేశుని దర్శించాలనే తొందరలో క్షణం యుగంగా గడుస్తుందని, తీరా స్వామిని దర్శించినపుడు యుగం క్షణకాలంగా అయిపోతుందని అంటున్న కవి దూపాటి సంపత్కుమారాచార్యులు (సప్తగిరి, ఆగస్టు 2009). ఆ కవి రాసిన పద్యమిది.

**దూరమున నున్న నిన్గాంచ తొందరపడి**
**క్షణము యుగముగ దోచె, నిన్ గాంచువేళ**
**యుగము క్షణమయ్యె వింత గాదొ! పరేశ!**
**విశ్వజన హృదయేశ్వరా! వేంకటేశ!**

ముడుపులు చెల్లించేవారి ఇడుములు బాపే కరుణా సముద్రుడు శ్రీనివాసుడు. అల్పమైన కానుకలనైనా భక్తితో సమర్పిస్తే అనంతమైన వరాలను కురిపిస్తాడు. కొండపైననే ఉంటాడు, మరెక్కడా లేడు అనుకొనే వారు అవివేకులు. స్వామి అణువణువునా ఉన్నాడని నమ్మడమే జ్ఞానమంటాడు ఒక గేయకవి. అన్ని రంగులూ కలిస్తే ఏర్పడేది ఒకే రంగు తెలుపు. అలాగే ప్రాణులన్నిటిలోనూ వెలిగే ఒకే వెలుగు సత్త్వస్వరూపమైన తిరుమల విభుడే.

కొండపైన తి.తి.దే. నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమాన్ని కవులందరూ ప్రశంసిస్తూ రాశారు. ధనిక పేద తారతమ్యంగాని, స్త్రీ పురుష భేదంగాని, పిల్లలు పెద్దలు అనే విచక్షణగాని లేకుండా; టోకన్ పద్ధతి లేకుండా, కొండకు వస్తున్న భక్తులందరికీ శ్రీవారి ప్రసాదం పేరుతో భోజనం పెట్టడం మొదట తిరుమలలోనే ఆరంభమైంది. ఈ ఉచిత భోజన కార్యక్రమం ప్రస్తుతం ఇతర ప్రాంతాల దేవాలయాలలో కూడా కొంతవరకు నిర్వహింపబడుతున్నది.



దీనికి ప్రేరణ తి.తి.దేవస్థానములే. దానాలలో అన్నదానం గొప్ప అనే విషయాన్ని తి.తి.దే. గుర్తించి అహరహం తిరుమలేశుని వీట అన్నదానసేవ చేయడం నిజంగా స్వామివారికి భక్తితో చేస్తున్న సేవే. భక్తుల కోర్కెలు తీర్చడంతో పాటు నిత్యాన్నదానంతో వాళ్ల ఆకలి తీర్చడం స్వామి భక్తజనప్రియత్వానికి నిదర్శనంగా ఉందని, ఆ మాట వింటూ ఉంటేనే ఆనందం కలుగుతున్నదని శతక కవులు వివరించారు. ఇక ప్రసాదాల విషయానికొస్తే కొండలడ్డు తింటే కోర్కె తీరుతుందట. చిన్నలడ్డు (దర్శనానంతరం ప్రసాదంగా ఇచ్చే లడ్డు) తింటే చింత తీరుతుందని, పులుసు అన్నమంటే నాలుక పులకరిస్తుందని తన అనుభవాన్ని పద్యరూపంలో చెప్పాడొక కవి. కొండమాచార్యులవారి పద్యమిది –

**పిడిచిన జిడజిడనేతులు, వడసెడు పొంగళ్లు లడ్లు వడలుండంగన్**
**పొడిపొడి బెల్లపు పిండికి, నిడునాలుక జాచునట్టి నిను సేవింతున్**

స్వామికి నివేదించే ప్రసాదాలలో నెయ్యి అధికంగా వాడబడుతున్నది. పొంగలి, చక్కెర పొంగలి ప్రసాదంగా చేతిలోకి తీసుకొంటే నెయ్యి ఏ మోతాదులో పైన కనిపిస్తూ ఉంటుందో భక్తులందరికీ తెలుసు. పిడిస్తే నెయ్యి కారడమూ అనుభవైకవేద్యమే. పొడిపొడి బెల్లపు పిండి స్వామిని దర్శించుకొన్న తరువాత వెళ్లబోయేముందు ఆలయ ప్రాంగణ సమీపంలోనే అనువైన చోట తళిగగా సమర్పించే బెల్లంతోకూడిన బియ్యపు పిండి అయి ఉంటుంది.

శ్రీనివాసుని సేవించడానికి అనువైన తావులు (గుడులు) దేశంలో ఎన్నో ఉండగా అందరూ తిరుమలకే పోవాలని దీక్ష తీసుకొంటారు. తిరుమల గిరులపై కనిపించే దివ్యదీప్తి స్వర్గాన్ని తలపిస్తూ ఉంటుంది. తిరుమల నిజంగా స్వర్గమేనని దేవతలందరూ వస్తూ పోతూ ఉంటారట. ఈ విషయం తెలిసిన భక్తులు తిరుమలకు కాక మరొక ప్రాంతానికి ఎందుకు వెళతారు? ఈ రోజుల్లో సామాన్యులైన ప్రజలకు సంసారాలను నెట్టుకొని రావడమే

కష్టమవుతూ ఉంది. బియ్యం పప్పు ఇత్యాదుల ధరలు చుక్కలనంటుతున్నాయి. ఇలాంటి వాళ్లు దూరప్రాంతాల నుండి తిరుమలకు రావడం, దండిగా మొక్కుబడులు సమర్పించడం కష్టంగానే ఉంటుంది. వచ్చి శ్రీనివాసుని దర్శించి కానుకలు సమర్పించక పోతే వీళ్లకు పుణ్యం ఎలా అబ్బుతుంది? ఇది చిక్కు సమస్యే. విశేష కృపామయుడవైన వేంకటేశ్వరా! ఈ చిక్కును తీర్చి సామాన్య భక్తుల మొరలను ఆలకించు అంటూ ఒక శతకకర్త స్వామికి వాస్తవ స్థితిని తెలియజేశాడు. ఏ పని చేయాలన్నా తిథులు, వారాలు చూచుకొని మంచి ముహూర్తం నిర్ణయించుకోవడం ఎక్కువమంది చేస్తున్న పనే. అయితే వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చేటప్పుడు తిథులు వారాలు ఎవరూ గమనించకుండానే తిరుమలకు వస్తూ ఉంటారని వాడ్రేవు నారాయణమూర్తి తన వేంకటేశ్వర శతకంలో (1966) ఇలా చెప్పాడు.

**కూరిమి దివ్యదర్శనము కోరుచు ఆశలు మారుమ్రోయ కై**
**వారము చేయుచున్ తిథులు వారములెన్నక భక్తితోడ నే**
**వారము నిన్ను జేరు జనవాహిని, కారుణికాబ్ద! నీదు బం**
**గారు హజారమున్ గనిన కన్నులు నిండును వేంకటేశ్వరా!**

తిరుమలవాసుని ప్రసాదంగా లభిస్తున్న అనేక పదార్థాలలో లడ్డు ప్రసాదం అపురూపమైనది, దివ్యమైనది. తిరుమల లడ్డు తెలియని వారు లేరు. దేవస్థానం ఉచితంగా ఇచ్చే లడ్డుతోపాటు భక్తులు మరికొన్ని లడ్లుకొని ఇండ్లకు తీసుకొని పోతారు. అక్కడ ఆ లడ్డులను చిన్న చిన్న ముక్కలుగా చేసి చుట్టు పక్కల ఇండ్లలోని వాళ్లందరికీ పంచిపెడతారు. వాళ్లు అత్యంత భక్తిభావంతో ఆ లడ్డు ముక్కలను గ్రహించి కండ్లకు అద్దుకొని గోవింద! గోవింద! అంటూ శ్రీవారి ప్రసాదంగా ఆరగించి ఆనందపడతారు. ఒక శతకకర్త తన శతకంలో రచించిన ఈ పద్యం తిరుమల లడ్డు పవిత్రతను వివరిస్తున్నది.



**తిరుపతి యాత్రజేసి యరుదెంచిన మిత్రులనుండి యెంతొ య**
**బ్బురముగ లడ్డుముక్కలను పొందగ నెందరొ కోరుచుందురిం**
**దరుదగు దైవచింతన విధమ్మిదొ గుప్తముగా బరంగు, నీ**
**శ్వరు కరుణాఫలమ్మిదను భావము దాగి తలంపు నింపుతన్**

తిరుపతి యాత్రచేసి వచ్చిన వాళ్ల నుండి లడ్డుముక్కలను ఎందరో కోరతారు. లడ్డు ముక్క దొరికితే స్వామి అనుగ్రహం సిద్ధించినట్లు భావిస్తారు.

భక్తి తత్పరులైన వాళ్లు అనేక వ్యయ ప్రయాసలను ఓర్చి దేవాలయాలు నిర్మిస్తున్నారు. జనులలో భక్తిభావం అధికమవుతున్నట్లే దేవాలయాల సంఖ్య గూడా పెరిగింది. ఇది సంతోషించవలసిన విషయమే. అయితే దేవాలయాలకు రక్షణ సక్రమంగా లేదు. దొంగలు ఆలయాల హుండీలను కొల్లగొడుతున్నారు. దేవతల ఆభరణాలు దోచుకొంటున్నారు. పెద్దపెద్ద ఆలయాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని వార్తాపత్రికల ద్వారా తెలుస్తూ ఉంది. ఇక పల్లెప్రాంతాలలో ఉన్న ప్రాచీన ఆలయాల సంగతి చెప్పేదేముంది? ప్రాచీనులు దేవాలయ ప్రాంగణాలలో నిధులు దాచి ఉంచారని ఆలయ ప్రాంతాలను తవ్వి కట్టడాలను నాశనం చేస్తున్నారు. కొన్ని దేవాలయాలలోని దేవతామూర్తులను అపహరించి పెద్ద మొత్తాలకు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. ఇలాంటి దుర్మార్గులను ఎవరు శిక్షించాలి? వీళ్లు చట్టాలకు దొరకకుండా తప్పించుకొని పోతున్నారు. పంచలోహాలతో తయారు చేయబడి ఆలయాలలో ప్రతిష్ఠింపబడిన దేవతల విగ్రహాలను విదేశాలలో విక్రయించి ఆలయ సంస్కృతిని రూపుమాపుతున్న దేశద్రోహులను చూస్తూ ఉదాసీనంగా ఉండకుండా శిక్షించమని వేంకటేశ్వరుని వేడుకొన్నాడు మరొక శతకకవి జయచంద్రశాస్త్రి. ఆయన పద్యమిది –

**పురములఁబల్లెలన్ సతతపూజిత దైవత విగ్రహమ్ము లె**
**త్తెరువుననో హరించి పరదేశము పాలొనరించు పాపులన్**
**త్వరితమెగాంచి భీతినిట తార్క్ష్యశిలోచ్చయమందు దాగితే**
**హరిహరి! శిక్ష చేయవలదా? తగవా యిది? వేంకటేశ్వరా!**

## కానుకలిచ్చిన దాతలు

తిరుమలఆలయ చరిత్రను పరిశీలిస్తే దేశాన్ని పాలించిన వివిధ రాజవంశాల రాజులు, రాణులు, మంత్రులు, సామంతులు, రాజకీయోద్యోగులు, సంపన్నులు, సామాన్యులు ఎందరో తిరుమలేశునికి విలువైన కానుకలు సమర్పించినట్లు తెలుస్తుంది. ఆయా విషయాలను తెలిపే శాసనాలు ఆలయం గోడలపైన ఇప్పటికీ కనిపిస్తున్నాయి. సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారి నేతృత్వంలో ఆ శాసనాలన్నిటి ప్రతిబింబాలు పరిష్కరింపజేసి తి.తి.దే. ఆరు సంపుటాలుగా ప్రచురించింది. ఈ పనిలో శాస్త్రిగారు చేసిన పరిశ్రమ అనితరసాధ్యం. కానుకలు సమర్పించిన రాజవంశాల చరిత్రను సమగ్రంగా రాసి ఆయా సంపుటాలలో చేర్చి వాటి విలువను పెంచారు శాస్త్రిగారు. ఎందరో చరిత్రకారుల, చరిత్ర పరిశోధకుల మెప్పును పొందిన గ్రంథాలివి. వేంకటేశ్వరస్వామికి కానుకలు సమర్పించి చరితార్థులైన తరతరాల భక్తులు ఈ శాసన సంపుటాల్లో అమరులై భావితరాలకు స్ఫూర్తిని కలిగిస్తున్నారు. దేవాలయానికి వెళ్లినపుడు అలాంటి దాతలను కూడా స్మరించుకోవడం ఆనందాన్ని కలిగించే విషయమే. అందరూ కాకున్నా కొందరు కవులైనా ఆ దాతలను స్మరించి వాళ్లను చల్లగా దీవిస్తూ ఉండమని స్వామిని కోరుకొన్నారు. ఆ కొందరు కవులలో ఒకరైన చింతలపాటి మోహనమురళీకృష్ణ తన 'వేంకటేశ్వర త్రిశతి' (మచలీపట్నం, 2013) లో అలనాటి దాతలను ఈ పద్యంలో స్మరించారు.

**రాజులు రాణులున్ ప్రభులు రైతులు రౌతులు రాచవారలున్**
**పూజలొనర్చి నిన్ను తమ పుణ్యఫలమ్ముగ నెంచి భక్తి వి**
**భ్రాజిత శక్తిగోరెదరు; రాజుల రాజువు నీవు గావునన్**
**తేజమొసంగి వారలకు తృప్తిని గూర్చుము వేంకటేశ్వరా!**

* * *